అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 14-12-2023

సంపుటి : 9 | సంచిక : 295 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50





ధరణిపై 10 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వండి

భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

- వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విస్తీర్ణమెంత?
- కేంద్రం ఇచ్చిన రూ.83 కోట్ల నిధులు ఏమయ్యాయి?
- అన్ని వివరాలు నివేదికలో పొందుపర్చండి : సీఎస్‌ను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూ సంబంధిత వివాదాల శాశ్వత పరిష్కారం కోసం మార్గ దర్శకాలను ప్రతిపాదించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ధరణి పనితీరు, భూ సంబంధిత అంశాలపై బుధవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, సంబంధిత అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గతంలో వేసిన కోనేరు రంగారావు కమిటీ మాదిరిగానే ఈ కమిటీని ఏర్పాటు చేయాలని అన్నారు. మంత్రులతోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, రైతు ప్రతినిధులు, భూ సంబంధిత చట్టాల్లో నిష్ణాతులు కమిటీలో సభ్యులుగా ఉండాలన్నారు. ధరణి యాప్ భద్రతపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ధరణిపై తీసుకున్న నిర్ణయాలపై పూర్తి నివేదిక అందజేయాలని సీఎస్ శాంతి కుమారిని సీఎం ఆదేశించారు. ఈ పోర్టల్‌పై వస్తున్న విమర్శల నేపథ్యంలో డేటా రూపంలో వివరణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. నిషేధిత భూములు, అసైన్డ్ భూములు, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విస్తీర్ణమెంత? పూర్తి వివరాలను నివేదికలో పొందు పర్చాలన్నారు. గతంలోని భూ సమగ్ర సర్వేపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సదస్సులు, రికార్డుల సవరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. భూముల సర్వే డిజిటలైజేషన్, టైటిల్ గ్యారంటీ, చట్టం తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.83 కోట్ల నిధులు ఎమయ్యాయని అధికారులను సీఎం ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగాల భర్తీపై కూడా సీఎం ఈ సందర్భంగా చర్చించారు. గత ప్రభుత్వం భూముల డిజిటలైజేషన్ కోసం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సమస్యల నిలయంగా మారిందని, ప్రజలు ఈ పోర్టల్ వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ, ఎన్నికల ప్రచారంలో ఆరోపించిన ముఖ్యమంత్రి, అధికారంలోకి ...11లో

నేటి నుంచి అసెంబ్లీ

- నాలుగు రోజులపాటు నిర్వహణ

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు స్పీకర్ ఎన్నిక అనంతరం సభ వాయిదా పడనుంది. శుక్రవారం సభ్యులనుద్దేశించి గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ ప్రసంగిస్తారు. అనంతరం శనివారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. సభ ఆదివారం కూడా కొనసాగనుందని అధికారిక వర్గాలు తెలిపాయి.


భద్రత డొల్లే

బీజేపీ ఎంపీ ఇచ్చిన పాస్‌తో పార్లమెంట్‌లో చొరబడ్డ దుండగులు



నివాళి అర్పిస్తున్న ప్రధాని మోడీ

- విజిటర్స్ గ్యాలరీ నుంచి సభలోకి దూకిన వ్యక్తి
- కలర్ స్మోక్ వదిలి భయభ్రాంతులకు గురిచేసిన వైనం
- బయటకు పరుగులు తీసిన ఎంపీలు
- లోక్‌సభ స్పీకర్ చైర్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నం
- పట్టుకున్న ఎంపీలు...భద్రతా సిబ్బందికి అప్పగింత
- విజిటర్ పాస్‌లు రద్దు...
- ఆరుగురు ఆగంతకుల గుర్తింపు
- రంగంలోకి దిగిన దర్యాప్తు సంస్థలు



పార్లమెంట్ పాత భవనంలో భద్రత సమస్య ఉన్నదని, కొత్త పార్లమెంట్‌లో అలాంటి సమస్య ఏదీ ఉండదని కోట్లు గుమ్మరించి కట్టిన చట్టసభలో భద్రత డొల్లతనం బట్టబయలైంది. సరిగ్గా 22 ఏండ్ల కిందట పార్లమెంట్ భవనంపై ముష్కరమూకలు దాడికి తెగబడిన రోజే..మరోసారి ఆగంతకులు ఈ చర్యకు పాల్పడ్డారు. బీజేపీ ఎంపీ ఇచ్చిన పాస్‌తో దర్జాగా లోనికి ప్రవేశించి పొగబాంబులతో కలకలం రేపారు. మా పటిష్టమైన మూడంచెల భద్రతా వలయం దాటుకుని పార్లమెంట్‌లోకి అన్యుల ఎంట్రీ అసాధ్యం మోడీ సర్కార్ మాటలు నీటి మూటలే అయ్యాయి. ఆగంతకులు వీరంగం వేస్తుంటే..కనుచూపుమేరలో భద్రతా సిబ్బంది కనిపించలేదు. చివరికి ఎంపీలే చొరవచూపి, ఆ నిందితులను పట్టుకున్నారంటే.. పార్లమెంట్ భద్రతలోని డొల్లతనమేంటో తేటతెల్లమవుతోంది.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు భద్రతలో భారీ లోపం ఏర్పడింది. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగి 22 ఏండ్లు పూర్తయిన రోజే.. మరోసారి లోక్‌సభలో భద్రతా వైఫల్యం చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. బుధవారం లోక్‌సభలో ఇద్దరు దుండగులు గందరగోళం సృష్టించారు. ఓ వ్యక్తి పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూకగా.. మరో వ్యక్తి గ్యాలరీ నుంచి ఒక రకమైన పొగ (కలర్ స్మోక్)ను వదిలి భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో ఎంపీలు బయటకు పరుగులు తీశారు. కొంత మంది ఎంపీలు ఆ ఆగంతకులను పట్టుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. దీంతో లోక్‌సభలో కొద్దిసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై ఎంపీలు స్పందిస్తూ పార్లమెంట్‌లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన తరువాత ఢిల్లీ సీపీ, హోం కార్యదర్శి అజయ్ భల్లా పార్లమెంట్‌కు చేరుకుని సమీక్షించారు. దాడి ఘటనతో స్పీకర్ ఓం బిర్లా 'విజిటర్' పాస్‌ను రద్దు చేశారు.

భారత్ మాతాకీ జై..తానా షాహీ బంద్ కరో...

లోక్‌సభలో జీరో అవర్ లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీ ఖగేన్ ముర్ము మాట్లాడుతున్న సమయంలో లోక్‌సభలోకి దూకిన వ్యక్తి.. ఎంపీలు కూర్చునే టేబుళ్లపైకి ఎక్కి 'నల్ల చట్టాలను బంద్ చేయాలి. జైభీమ్, భారత్ మాతాకీ జై' తానా షాహీ బంద్ కరో..రాజ్యాంగాన్ని కాపాడాలి. నియంతృత్వం చెల్లదు' అని నినాదాలు చేసినట్టు సమాచారం. లోక్‌సభలోకి దూకి స్పీకర్ చైర్ వైపు పరిగెత్తేందుకు ప్రయత్నించాడు. బూట్లలో రంగుల టియర్ గ్యాస్ బుల్లెట్లను బయటకు తీసి ప్రయోగించాడు. ఈ ఆకస్మిక ఘటనతో అందరూ ఉలిక్కిపడ్డారు.

ఎంపీలే అప్రమత్తమై...

ఈ ఘటనతో అప్రమత్తమైన ఎంపీలు వారిని చుట్టుముట్టి పట్టుకున్నారు. పక్కనే ఉన్న ఎంపీలలో బీజేపీకి చెందిన హనుమాన్ వానియాల్, కాంగ్రెస్‌కు చెందిన గుర్జిత్ సింగ్ ఔజ్లా ఇద్దరినీ పట్టుకున్నారు. పట్టుకున్న వారిలో వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ కూడా ఉన్నారు. అనంతరం భద్రతా సిబ్బందికి అప్పగించారు. నిందితులు విసిరిన పొగ కర్ర గుర్జిత్ సింగ్ చేతికి కూడా తగిలింది. ఇద్దరినీ పట్టుకుని సంసద్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో ప్యానెల్ స్పీకర్ రాజేంద్ర అగర్వాల్ వెంటనే సభ కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ఘటన చోటు చేసుకున్నప్పుడు సభలో కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, కార్తీ చిదంబరం, కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, బీజేపీ ఎంపీలు జగదాంబికా పాల్, సురేంద్రజిత్ సింగ్, అహ్లూవాలియా ఉన్నారు.

పసుపు,ఎరుపు రంగు పొగ వదిలి...

మరోవైపు, అదే సమయంలో పార్లమెంట్ భవనం బయట ఇద్దరు వ్యక్తులు కూడా ...11లో


బీజేపీ ఎంపీ ఇచ్చిన పాస్ తోనే ఆగంతకుల ఎంట్రీ



బీజేపీ ఎంపీ ప్రతాప్ సింగ్

లోక్‌సభ లోపల పట్టుబడిన వారు కర్నాటకకు చెందిన సాగర్ శర్మ, మనో రంజన్ గా గుర్తించినట్టు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరూ మైసూర్‌కు చెందిన వారని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు సమాచారం. మైసూర్‌కు చెందిన బీజేపీ ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రతాప్ సింగ్ ఈ నిందితుల పాస్‌లపై సంతకం చేశారు. పార్లమెంటు బయట నిరసన చేసిన ఇద్దరు వ్యక్తుల్లో ఒక మహిళ కూడా ఉన్నారు. రంగుల పొగను వెదజల్లుతూ ఆందోళనకు దిగిన వీరిద్దరినీ ట్రాన్స్‌పోర్ట్ భవనం ముందు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో పాల్గొన్న మహిళ హర్యానాలోని హిసార్ కు చెందిన నీలం (42) కాగా, మరో వ్యక్తి మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన అమోల్ శిందే (25)గా గుర్తించినట్టు పోలీసులు వెల్లడించారు. పార్లమెంటు లోపల, వెలుపల జరిగిన ఈ ఘటనలకు సంబంధించి ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగ దర్యాప్తు చేస్తుందని అధికారులు వెల్లడించారు.

సమగ్రంగా విచారణ జరపాలి



పార్లమెంటుపై ఉగ్రవాద దాడి జరిగి 22 ఏండ్లయిన నేపథ్యంలో బుధవారం చోటుచేసుకున్న ఘటన తీవ్రమైన భద్రతా వైఫల్యానికి నిదర్శనం. ఈ ఘటనలో దుండగుల ప్రవేశానికి వీలు కల్పించిన కర్నాటక బీజేపీ ఎంపీతో సహా బాధ్యులందరిపైనా సమగ్రంగా, వేగంగా దర్యాప్తు చేయాలి.

- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

కేంద్ర హోంమంత్రి ప్రకటన చేయాలి: ప్రతిపక్షాలు

ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెల్లడించాలని కోరారు. అయితే ప్రతిపక్ష సభ్యుల డిమాండ్‌ను రాజ్యసభాపక్ష నేత, కేంద్ర మంత్రి పియూశ్ గోయల్ తోసిపుచ్చారు. 'రాజ్యసభ అనేది పెద్దల సభ అని భావిస్తున్నాను. ఇలాంటి సమయాల్లో మనమంతా ఐక్యమనే సందేశాన్ని ఇవ్వాలి. కానీ కాంగ్రెస్, ప్రతిపక్షాలు దీనిని రాజకీయం చేస్తున్నాయి. ఇది మంచి సందేశం కాదు' అని విమర్శించారు. దీనికి నిరసనగా ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్

ఎన్నిక లాంఛనమే...

- బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ మద్దతు
- రేపు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 16న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. స్పీకర్ ఎన్నికకు ప్రసాద్ కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ప్రసాద్ కుమార్ అభ్యర్థిత్వానికి ప్రధాన ...11లో

తక్షణమే కాల్పుల విరమణ

ఐరాస తీర్మానం

- అనుకూలంగా ఓటేసిన భారత్
- మారుతున్న ప్రపంచ దేశాల వైఖరి



గాజా స్ట్రిప్ : మానవతా దృష్టితో గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. సుమారు రెండు నెలల క్రితం ఇదే రకమైన తీర్మానంపై ఐరాసలో ఓటింగ్ జరిగినప్పుడు గైర్హాజరు అయిన భారత్, ఈసారి మద్దతుగా ఓటేయడం విశేషం. తీర్మానానికి అనుకూలంగా 153 సభ్య దేశాలు ఓటు వేశాయి. అంటే ఐరాస సభ్య దేశాలలో సుమారు 80% దేశాలు తక్షణ కాల్పుల విరమణకు మద్దతు తెలిపాయి. తీర్మానాన్ని 10 దేశాలు వ్యతిరేకించగా 23 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. పౌరుల ప్రాణాలు కాపాడేందుకు, చట్టపరమైన, మానవతావాద కర్తవ్యాలను నెరవేర్చేందుకు కాల్పుల విరమణ పాటించాలని తీర్మానం కోరింది. ఆక్రమిత తూర్పు జెరుసలేం లోనూ, మిగిలిన పాలస్తీనా ఆక్రమిత భూభాగంలోనూ ఇజ్రాయిల్ సాగిస్తున్న అక్రమ చర్యలపై చర్చించేందుకు ఐరాస 10వ అత్యవసర సమావేశం న్యూ యార్క్‌లో జరిగింది. అక్టోబర్‌లో ఐరాసలో ఇదే విధమైన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ సందర్భంగా జరిగిన ఓటింగ్‌కు భారత్ సహా 45 దేశాలు గైర్హాజరు ...2లో



అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులను విస్తరించాలి

గుర్తింపు కార్డు సమస్య ఉచిత ప్రయాణానికి ఆటంకం కాకూడదు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులను విస్తరించాలనీ, ఉచిత ప్రయాణానికి గుర్తింపు సమస్య అనేది ఆటంకంగా మారకూడదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పేర్కొంది. బుధవారం ...11లో

ఇండియా కూటమి బలపడాలి

- 3 రాష్ట్రాల్లో గెలుపు దేశానికే ప్రమాదం : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్

వివరాలు 11లో

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా ఆకునూరి మురళి?

- సభ్యుల నియామకంపైనా సర్కారు కసరత్తు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి
- వివాదాలకు తావులేకుండా ఉద్యోగాల భర్తీ
- నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరేలా నిర్ణయాలు



2లో వివరాలు

కాంగ్రెస్‌కు ఇప్పుడు తెలిసొస్తుంది

ఆ పార్టీ ప్రజలను మభ్యపెట్టింది : మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



అమలుకు సాధ్యం కాని అనేక హామీలను ఇవ్వటం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తద్వారా అది ప్రజలను మభ్యపెట్టిందని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి... 'ఆ బరువేంటో' దానికి తెలిసొస్తుందని ఎద్దేవా చేశారు. స్పీకర్ పదవికి నామినేషన్ల సందర్భంగా బుధవారం అసెంబ్లీకి విచ్చేసిన కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క రోజు కూడా పద్దులపై చర్చించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో పద్దులపై సమగ్ర చర్చ జరిగిందని వివరించారు. ప్రతీయేటా కాగ్ లెక్కలు ఇచ్చిందనీ, ఆడిట్ రిపోర్టులను శాసనసభకు సమర్పించామని గుర్తు చేశారు. పద్దులపై శ్వేతపత్రాలను విడుదల చేశామని తెలిపారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్ప చేసి, తమకు అప్పగించిందంటూ కాంగ్రెస్ నేతలు చెప్పటం హాస్యాస్పదమన్నారు. గవర్నర్ ప్రసంగంలో కూడా ఇదే పాత చింతకాయ పచ్చడి చెబుతారంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు చెందిన ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో 45 వేల ఉద్యోగాలిస్తామంటూ ప్రకటించారు.. ఇది ఎలా సాధ్యమంటూ ...11లో

గూడు.. గోడు

అందని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

ఇన్నాళ్లూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఎదురుచూసిన పేదలను చివరకు 'గృహలక్ష్మి' కూడా కరుణించలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన 'ఇందిరమ్మ ఇండ్ల' గ్యారంటీ పథకానికి కసరత్తు ప్రారంభించడంతో మళ్లీ పేదల సొంతింటి కలలు చిగురిస్తున్నాయి. గతంలో ఆర్అండ్‌బీలో విలీనం చేసిన గృహనిర్మాణ సంస్థను పునరుద్ధరించడంతోపాటు మిగిలిపోయిన రాజీవ్ స్వగృహాలనూ అమ్మే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మరోవైపు గూడు కోసం పోరుబాట పట్టిన పేదలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారు. వీరిని ఖాళీ చేయించేందుకు గతంలో పోలీసులు లాఠీలు ఝులిపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కేసులు నమోదు చేశారు. బెదిరించారు. అయినా పేదలు వెనుకడుగు వేయలేదు. ఇప్పటికీ అక్కడే ఉంటున్నారు. పట్టణ శివారులోని సర్కారు స్థలాల్లో వేలాదిగా జనం గుడిసెలు వేసుకుని తాత్కాలిక నివాసం ఏర్పరుచుకుంటున్న నేపథ్యంలో గోస పడుతున్న పేదల గూడుపై ప్రత్యేక కథనం..



కరుణించని 'గృహలక్ష్మి'

- ఎర్రజెండా నీడలో పోరుబాటపట్టిన నిరుపేదలు
- 'ఇందిరమ్మ ఇండ్ల' గ్యారంటీపైనే గంపెడాశలు
- ఆర్అండ్‌బీలో విలీనం చేసిన గృహనిర్మాణ శాఖ పునరుద్ధరణకు ప్రభుత్వం అడుగులు
- 'రాజీవ్‌స్వగృహ' అమ్మకానికీ ఆలోచనలు
- చిగురిస్తున్న పేదల ఆశలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా గత సర్కారు సుమారు 2లక్షల డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేస్తే అందులో 30శాతం కూడా పూర్తి చేయలేదు. పూర్తి చేసిన ఇండ్లలో సగం కూడా పంపిణీ చేయలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఇండ్లు లేని పేదలు సుమారు 2లక్షల మందికిపైగానే ఉన్నారనేది ఓ అంచనా. దీంతో కట్టిన ఇండ్లు పంచక, కొత్తగా ఇండ్ల నిర్మాణమూ చేపట్టక ఏండ్లుగా విసిగిపోయిన పేదలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఎర్రజెండా చేతబూని పోరుబాట పట్టారు. జగిత్యాల, కోరుట్ల, రామగుండం నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు సహా స్థానిక ప్రజాప్రతినిధులు దాడులకు దిగినా వెనుకడుగు వేయకుండా తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి టీనగర్, రాజారాం గుట్ట సమీపంలో సుమారు 6వేల మందికిపైగా పేదలు గుడిసెలు వేసుకుంటూ అక్కడే గడుపుతున్నారు. ప్రస్తుతం కొత్తగా కొలువుదీరిన ...11లో



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 61,800	▲ 110
22 క్యారెట్లు	- 56,650	▲ 100
కిలో వెండి	- 77,000	▼ 700



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 85
రిటైల్ (లైవ్)	రూ. 107
స్కిన్‌తో	రూ. 155
స్కిన్‌లెస్	రూ. 177

బిజినెస్

గ్రామీణ ఆదాయల్లో ఒత్తిడి

- పుంజుకోని ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల డిమాండ్
- పేరుకుపోతున నిల్వలు
- ఆందోళనలో కంపెనీలు



న్యూఢిల్లీ: గ్రామీణ ఆదాయాల్లో ఒత్తిడి నెలకొనడంతో ఇప్పటికీ ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల అమ్మకాల్లో డిమాండ్ కొరవడింది. ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్‌కు పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతున్నప్పటికీ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా డిమాండ్ పునరుద్ధరణ జరగలేదని బిజినెస్ స్టాండర్డ్ ఓ కథనంలో వెల్లడించింది. కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించిన ఎఫ్ఎంసిజి సమ్మిట్ అనంతరం ఈ వార్తను ప్రచురించింది. డెయిరీ, కాస్మోటిక్స్, పానియాలు, బేకరీ ఉత్పత్తులు, సబ్బులు, షాంపులు తదితర ఉత్పత్తులు ఎఫ్ఎంసిజి విభాగంలోకి వస్తాయి. డాబర్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహిత్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఎఫ్ఎంసిజి అమ్మకాల్లో రికవరీకి అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ.. గ్రామీణ డిమాండ్ ఇప్పటికీ పట్టణ మార్కెట్లలో వెనుకబడి ఉందని అన్నారు. పండుగల సీజన్ ఉన్నప్పటికీ నగదు లభ్యత సమస్యలు గ్రామీణ ప్రాంతాలను వేధిస్తున్నాయని మల్హోత్రా పేర్కొన్నారు.

కోవిడ్-19 మహమ్మారి నుండి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గింది. ఈ ప్రభావాన్ని దేశంలోని అతిపెద్ద ఎఫ్ఎంసిజి కంపెనీ హిందుస్తాన్ యూనిలీవర్ ఎత్తి చూపింది. రబీ పంట గ్రామీణ డిమాండ్‌లో పెరుగుదలను ప్రతిబింబిస్తుందని అదానీ విల్‌మార్‌కు చెందిన అంగ్షు మల్లిక్ పేర్కొన్నారు. గ్రామీణ మార్కెట్లు రికవరీ సంకేతాలను మాత్రం చూపిస్తున్నాయని మార్కెట్ పరిశోధన సంస్థ ఎన్ఐక్యూ నివేదిక పేర్కొంది. సెప్టెంబరు త్రైమాసికంలో వినియోగం మునుపటి సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉందని తెలిపింది. డిమాండ్ లేమీతో ఈ ఏడాది నవంబర్ చివరి నాటికి ఎఫ్ఎంసిజి కంపెనీల వద్ద, పంపిణీదారుల వద్ద సరుకుల నిల్వలు పెరిగాయని సమాచారం. దేశంలో చోటు చేసుకుంటున్న అధిక ధరలకు తోడు విద్యా, వైద్యం వ్యయాలు పెరిగిపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. మరోవైపు ఆదాయాలు పెరగక పోవడంతో అనేక రంగాల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపైన ప్రతికూల ప్రభావం చూపనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్ట్ వ్యవసాయంలోకి ఫ్రాంక్లిన్ ఇండస్ట్రీస్

Franklin Industries Limited

న్యూఢిల్లీ : వ్యవసాయ వస్తువుల వ్యాపారంలో ఉన్న ఫ్రాంక్లిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కొత్తగా కాంట్రాక్ట్ వ్యవసాయంలోకి ప్రవేశిస్తున్నట్టు ప్రటించింది. తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ గుజరాత్ కంపెనీ పేర్కొంది. తమ వ్యూహాత్మక విస్తరణ మార్కెట్ స్థితిని బలోపేతం చేయడమే కాకుండా వృద్ధి, లాభదాయకత కోసం కొత్త మార్గాలను సృష్టించడం ద్వారా తమ వాటాదారులకు విలువను జోడించాలని నిర్దేశించుకున్నట్లు వెల్లడించింది.

ఆల్‌టైం కనిష్టానికి రూపాయి



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో భారత రూపాయి విలువ వెలవెల పోతోంది. బుధవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 83.40కు పడపోయింది. ఇంతక్రితం సెషన్‌లో 83.38 వద్ద ముగిసిం ది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్షా నేపథ్యంలో రూపాయి విలువ తగ్గిందని ఫారెక్స్ నిపుణులు పేర్కొన్నారు. ఇంతక్రితం నవంబర్ 10న రూపాయి విలువ 83.42 కనిష్ఠ స్థాయిని తాకింది. డిసెంబర్‌లో మరింత తగ్గే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. రూపాయి విలువ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1.5 శాతం పతనాన్ని చవి చూసింది. గడిచిన నవంబర్‌లో 0.2 శాతం విలువ తగ్గింది.

భారత వృద్ధి 6.7 శాతంగా ఉండొచ్చు : ఏడీబీ



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 6.7 శాతం పెరగొచ్చని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) అంచనా వేసింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో 6.3 శాతంగా అంచనా వేసింది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి చోటు చేసుకోవడంతో ఏడీబీ తన అంచనాలను సమీక్షించింది. 2024-25లోనూ 6.7 శాతం వృద్ధి ఉండొచ్చని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మూలధన వ్యయాలు పెరగడం, ప్రయివేటు వినిమయం పుంజుకోవడం తదితర అంశాలు జీడీపీకి మద్దతు చేయవచ్చని ఏడీబీ విశ్లేషించింది.



మాజీమంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదు

గిరిజనుల భూములు కబ్జా చేశారని ఫిర్యాదు

- దాదాపు 47 ఎకరాల భూకబ్జాకు యత్నం..!
- శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు
- పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, 420 కేసులు నమోదు



నవతెలంగాణ-సిటీబ్యూరో/శామీర్‌పేట

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 33, 34, 35లోని సుమారు 47 ఎకరాల 18 గుంటల గిరిజనుల భూములను కబ్జా చేశారని పలువురు శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని అనుచరులు శ్రీనివాస్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శివుడు, స్నేహ రామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి నేహారెడ్డిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఎఫ్ఐఆర్ కాపీని బాధితులకు అందజేశారు. కానీ ఎఫ్ఐఆర్ కాపీలో చామకూర మల్లారెడ్డి అని ఇంటి పేరు లేకపోవడంతో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులు బుధవారం ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్..

ఎన్నికల ముందు అప్పటి మంత్రి మల్లారెడ్డి ఆదేశాలతో ఓ రోజు రాత్రి 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి అనుచరులపై తహసీల్దార్, రిజిస్ట్రర్ కలిసి ఆ భూమిని అక్రమంగా రిజిస్టర్ చేశారని బాధితులు ఆరోపించారు. ఈ మేరకు శామీర్‌పేట మండలం కేశవరం గ్రామానికి చెందిన కేతావత్ భిక్షపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్లు 33, 34, 35లో తమకు 47 ఎకరాల 18 గుంటల భూమి ఉందని, ఇది వారసత్వంగా అందిందని వివరించారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు తమ దగ్గరే ఉన్నాయని భిక్షపతి చెప్పారు. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి వాటిని మల్లారెడ్డి తన పేరు మీద బదలాయించుకున్నారని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు పేర్కొన్నారు. మాజీ మంత్రికి స్థానిక తహసీల్దార్ సహకరించి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దాంతో మల్లారెడ్డితోపాటు తహసీల్దార్‌పైనా పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపించిన పోలీసులు మల్లారెడ్డితోపాటు ఆయన సమీప బంధువు శ్రీనివాస్‌రెడ్డి, కేశవాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ భర్త గోనె హరిమోహన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శివుడు, స్నేహ రామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి స్నేహారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, 420 కేసు నమోదు చేశారు.

వివరాలు ఇలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో 47 ఎకరాల 18 గుంటల భూమి ఎస్టీ (లంబాడ)లకు ఉంది. ఈ భూమి బాధితుడు కేతావత్ భిక్షపతి నాయక్ కుటుంబీకులకు వారసత్వంగా వచ్చింది. అది భిక్షపతి తల్లి రాజీ పేరు మీద ఉంది. అయితే, 'మీ భూమి మీకు వస్తుందని' నమ్మించి నవంబర్ 3న శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శివుడు, చామకూర మల్లారెడ్డి, స్నేహరామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి స్నేహారెడ్డితోపాటు మరికొంత మంది కలిసి కుట్రతో తహసీల్దార్ కార్యాలయంలో తనతోపాటు కుటుంబీకులు ఏడుగురితో పీటీ సరెండర్ చేయించినట్టు బాధితుడు తెలిపారు. అదే రోజు తమకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పన డబ్బులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఇలా మల్లారెడ్డి అనుచరులు ఈ భూమిపై తమ హక్కులు కోల్పోయేలా చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను కోరారు.

పొగబాంబుల విసిరివేత సమస్యలకు పరిష్కారం కాదు : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటులో పొగబాంబుల విసిరివేత సమస్యలకు పరిష్కారం కాదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభలో ఇద్దరు వ్యక్తులు ప్రమాదం లేని పొగ సెల్సుతో ప్రవేశించడం భద్రతా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించాలనీ, నిరంకుశత్వం, నియంతృత్వం నశించాలనీ, జైభీం అంటూ వారు చేసిన నినాదాలు మానసిక ఆవేదనను తెలియజేస్తున్నాయని తెలిపారు. ఈ చర్య మిలిటెంట్ ఉగ్రవాద చర్య అని పేర్కొన్నారు. భద్రతా వైఫల్యంపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 370 ఆర్టికల్ రద్దు, కాశ్మీర్‌ను రెండు ముక్కలుగా విడగొట్టిన నిర్ణయంపై ఉన్నతస్థానం సైతం ప్రజాస్వామిక, ఫెడరల్ విలువలను గుర్తించలేకపోయిందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఉపాలాంటి చట్టాలు, రాజద్రోహ చట్టాలను మోపి ప్రతిపక్ష, ప్రజాస్వామ్య, మైనార్టీ గొంతు లేకుండా చేసే యత్నాలు సమాజంలో అసహనాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగం రాబోతుందన్న ఆందోళన నుంచి ఇలాంటి ఘటనలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. భగత్‌సింగ్, భటుకేశ్వర దత్తు బ్రిటీష్ నల్లచట్టాలకు వ్యతిరేకంగానే పార్లమెంటులో ప్రమాదరహిత పొగబాంబులు వేశారని పేర్కొన్నారు. ఇప్పుడే అదే పద్ధతి కనిపిస్తున్నదని తెలిపారు. ఇలాంటి చర్యలు ఫాసిస్టు పాలకులకు మరిన్ని కోరలు పెరగడానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ప్రజాఉద్యమం ద్వారానే పాలకుల ఫాసిస్టు, దురహంకార, దుర్నీతికర చట్టాలను, పద్ధతులను ఓడించగలుగుతామని తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా ఆకునూరి మురళి?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం దృష్టిసారించింది. పాత పాలకమండలి పనితీరుపై నిరుద్యోగ యువతలో తీవ్ర వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా పనిచేసే అధికారులను నియమించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. ముఖ్యమంత్రి కార్యదర్శులుగా ఐఏఎస్ అధికారి వి శేషాద్రి, ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసీంను నియమించారు. రాజకీయ ప్రమేయం లేకుండానే హైదరాబాద్ సీపీగా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్ సీపీగా అవినాశ్ మహంతి, రాచకొండ సీపీగా జి సుధీర్‌బాబును ప్రభుత్వం నియమించింది. దీంతో పైరవీలకు తావులేకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందులో భాగంగానే టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని నియమించే అవకాశమున్నట్టు చర్చ జరుగుతున్నది. ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఆయనకు విద్యా, ఉద్యోగాలు, సామాజిక అంశాలపై మురళికి పట్టుంది. ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగానికి సలహాదారులుగా పనిచేశారు.

ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక భూమిక పోషించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. అవినీతిని ప్రజలకు వివరించారు. విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం, వాటిని ఖర్చు చేయకపోవడం గురించి ప్రజల దృష్టికి తెచ్చారు. టీఎస్‌పీఎస్సీ వైఫల్యం, ప్రశ్నాపత్రాల లీకేజీ, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జాగో తెలంగాణ పేరుతో నిరుద్యోగుల బస్సుయాత్ర నిర్వహించారు. అందుకే ఆకునూరి మురళిని టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా నియమిస్తే నిరుద్యోగులకు మేలు జరుగుతుందనీ, పారదర్శకంగా నియామకాల ప్రక్రియ సాగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. దీంతోపాటు పాలకమండలి సభ్యుల నియామకంపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. పలువురి పేర్లను అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం యూపీఎస్సీతోపాటు ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరును అధ్యయనం చేసేందుకు అధికారుల బృందం సమాయత్తం అవుతున్నట్టు సమాచారం.

స్మితా సబర్వాల్‌ను కేంద్ర సర్వీసులకు పంపొద్దు : మురళి

ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను కేంద్ర సర్వీసులకు పంపొద్దని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో చేసినవన్నీ చేసి, కొత్త ప్రభుత్వం రాగానే కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లి తప్పించుకోవడం కొందరు ఐఏఎస్‌లకు ఫ్యాషన్ అయ్యిందని ఆరోపించారు. ఇలాంటి వారిని కేంద్ర సర్వీసులకు పంపొద్దని కోరారు. దేశంలో హెలికాప్టర్‌లో వెళ్లి పనులు పర్యవేక్షించే ఏకైక ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాలేనని పేర్కొంటూ సీఎం రేవంత్‌కు ట్యాగ్ చేస్తూ ఆయన ట్వీట్ చేశారు.

పార్లమెంటు తరహాలో తెలంగాణ అసెంబ్లీ

- ఒకే చోట రెండు భవనాలు
- ఉండేలా నిర్మాణం
- శాసనసభ ఆవరణలో కలియతిరిగిన సీఎం రేవంత్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ భవనం పార్లమెంటు తరహాలో ఉంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శాసనసభ, శాసనమండలి భవనాలు ఒకే దగ్గర ఉండేలా నిర్మాణం జరుగుతుందని చెప్పారు. అసెంబ్లీ, కౌన్సిల్ మినహా మరే ఇతర భవనాలు అసెంబ్లీ ప్రాంగణంలో ఉండవని తేల్చిచెప్పారు. ఇప్పుడు ఉన్న చెట్లను తొలగించకుండా మరింత గ్రీనరి పెంచాలని సూచించారు. అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రైల్వేగేటుకు ఆనుకుని ఉన్న ప్రహారీగోడ ఎత్తును పెంచాలని చెప్పారు. ఉభయ సభల సభ్యులు ఉదయం పూట వాకింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బుధవారం మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహచారి, ఇతర అధికారులతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో కలియతిరిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం లెజిస్లేచర్ కార్యాలయాల(ఎల్పీ ఆఫీసులు)ను పరిశీలించారు. జూబ్లీహాల్‌ను అలాగే ఉంచి, పాత అసెంబ్లీ భవనంలోకి కౌన్సిల్‌ను మార్చాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అసెంబ్లీ, కౌన్సిల్ భవనాలను పార్లమెంటు సెంట్రల్ హాల్ తరహాలో నిర్మాణం చేసేందుకు ప్రణాళికలు తయారవుతున్నాయి. ఈమేరకు ఇప్పటికే రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వ వైఖరిని తెలియజేశారు. దీనికి ఖర్చు రూ. 50 కోట్ల నుంచి రూ. 70 కోట్లు అవుతుందని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. కాగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ. 150 కోట్లతో అసెంబ్లీ, కౌన్సిల్ భవనాలను కలిపేలా నిర్మాణం చేయాలని భావించినా ఆచరణ రూపం దాల్చని సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు పాత అసెంబ్లీ భవనం అలాగే ఉంచుతూ, కొత్తగా శాసనమండలి భవనాన్ని నిర్మించనున్నారు. మధ్యలో సెంట్రల్ హాల్ నిర్మాణం సైతం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి తాజా కార్యాచరణ అసెంబ్లీ సమావేశాల అనంతరం చేపట్టే అవకాశాలు ఉన్నట్టు రోడ్లు, భవనాల శాఖ అధికారులు చెబుతున్నారు.

వ్యవసాయ కార్పొరేషన్లు సాంకేతికను అందిపుచ్చుకోవాలి

కార్పొరేషన్లకు మంత్రి తుమ్మల ఆదేశం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మారుతున్న పరిస్థితులకనుగుణంగా పోటీని తట్టుకునేలా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ అనుబంధ శాఖలపై తుమ్మల సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ 14 కార్పొరేషన్లకు చెందిన ఉన్నతాధికారులతో ఆయన సమావేశయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేషన్లు రైతులకు సేవలందించేందుకు అవసరమైన పద్ధతులను అవలంభించాలని సూచించారు. ఇతర దేశాల నుంచి అత్యాధునిక పద్ధతులను అందిపుచ్చుకుని రైతులకు లబ్ధిచేకూర్చేలా పని చేయాలని కోరారు. కార్పొరేషన్లు కేవలం వ్యాపార దృక్పథంతోనే పని చేయవద్దని సూచించారు. పాత పద్ధతులకు స్వస్తిపలికి సరికొత్త విధానాలతో రైతులోకానికి ఉపయుక్తంగా ఉండేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను అందిపుచ్చుకుని వాటిని సక్రమమైన పద్ధతుల్లో అమలు పరిచేలా కార్పొరేషన్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రయివేటు కంపెనీలకు లబ్ధిచేకూర్చే యంత్రాలు, ఎరువులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించొద్దని సూచించారు.

రైతు బంధు రూ. 640 కోట్ల జమ

రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో సోమవారం నుంచి జమ అవుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. 22 లక్షల మంది రైతుల అకౌంట్లలో రూ.640 కోట్లు జమ అయ్యాయి. ఈసారి పాత పద్ధతిలోనే రైతుబంధు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రైతు బంధు పథకంపై ఒకటిరెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ అవుతాయనీ, ఆ తర్వాత కొత్త వారికి రైతు బంధు వర్తిస్తుందన్నారు.

తక్షణమే కాల్పుల విరమణ

(మొదటిపేజి తరువాయి)

అయ్యాయి. అప్పుడు తీర్మానానికి అనుకూలంగా 120 ఓట్లు, వ్యతిరేకంగా 14 ఓట్లు వచ్చాయి. తాజా ఓటింగ్‌లో తీర్మానాన్ని వ్యతిరేకించిన దేశాల సంఖ్య 10కి తగ్గింది. అమెరికా, ఆస్ట్రియా, సెచియా, లైబేరియా, పసిఫిక్ భాగస్వామ్య దేశాలు తీర్మానాన్ని వ్యతిరేకించాయి. ఓటింగ్‌కు దూరంగా ఉన్న దేశాల సంఖ్య కూడా 45 నుండి 23కి తగ్గడం గమనార్హం. తీర్మానాన్ని అరబ్ గ్రూప్, ఇస్లామిక్ సహకార సంస్థ ప్రవేశపెట్టాయి. ఉక్రెయిన్‌పై దురాక్రమణను ఖండించిన దేశాల కంటే తీర్మానాన్ని ప్రవేశపెట్టిన దేశాల సంఖ్యే ఎక్కువగా ఉంది. తీర్మానంలో ఆస్ట్రియా, అమెరికా దేశాలు రెండు సవరణలు ప్రతిపాదించాయి. అయితే మూడింట రెండు వంతుల మంది సభ్యుల మద్దతు లభించకపోవడంతో వాటిని తీర్మానంలో చేర్చలేదు. గాజాలో మానవతావాద విపత్తు సంభవించిందని తీర్మానం తెలిపింది. పాలస్తీనా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించింది. అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి పాలస్తీనా, ఇజ్రాయిల్ పౌరులను కాపాడాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. బందీలందరినీ బేషరతుగా విడుదల చేయాలని, మానవతావాద సాయానికి అవకాశం ఇవ్వాలని తీర్మానం డిమాండ్ చేసింది.

గత తీర్మానం సందర్భంగా గైర్హాజరు అయిన 21 దేశాలు ఈసారి తీర్మానాన్ని సమర్థించాయి. వాటిలో సగం యూరోపియన్ యూనియన్ దేశాలే. గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే అమెరికాకు కీలక భాగస్వాములుగా ఉన్న కెనడా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటేశాయి. ఆసియా దేశాలలో ఫిలిప్పీన్స్ కూడా తీర్మానాన్ని సమర్థించింది. తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంపై భారత్ వివరణ ఇస్తూ అక్టోబర్ 7న జరిగిన ఉగ్ర దాడిని ప్రస్తావించింది. అయితే ఈసారి కూడా హమాస్‌పై స్పష్టత ఇవ్వలేదు. ఇదిలా ఉండగా ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో మరణించిన వారి సంఖ్య 18 వేలకు చేరింది.

తెలంగాణ ట్రైబల్ యూనివర్శిటీ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదించింది. బిల్లును కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రవేశపెట్టారు. వివిధ పార్టీల సభ్యులు చర్చలో పాల్గొన్నారు. సెంట్రల్ యూనివర్శిటీల (సవరణ) బిల్లు-2023ను మూజువాణి ఓటుతో ఆమోదించింది. చర్చకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానమిస్తూ, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం తెలంగాణలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు తప్పనిసరి అన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల (సవరణ) బిల్లును గతవారం లోక్‌సభ ఆమోదం పొందింది.

గవర్నర్, సీఎం బహిరంగంగా చర్చించుకోవాలి

- తమిళనాడు గవర్నర్ అంశంలో సుప్రీంకోర్టు మరోసారి సూచన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బిల్లుల ఆమోదానికి సంబంధించిన వివాదాలను బహిరంగ చర్చతో పరిష్కరించుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి, గవర్నర్‌లను అత్యున్నత న్యాయస్థానం మరోసారి ఆదేశించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులను ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిలుపుదల చేసిన గవర్నర్ చర్యపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం మరోసారి ఈ సూచనను ముందుకు తెచ్చింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను మళ్లీ రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు ఉందా? లేదా? అనే అంశంపై వివరణాత్మక వాదన వినిపించాలని తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది మను అభిషేక్‌సింఘ్వీ కోరారు. దీనికి స్పందించిన సీజేఐ డివై చంద్రచూడ్ 'జనవరిలోనే విచారిస్తాం. గవర్నర్‌ను కలిసేందుకు కూడా సీఎం సుముఖంగా ఉన్నారు. అది జరగనివ్వండి' అన్నారు. ఈ స్థితిలో వివాదాలను చర్చలతో పరిష్కరించుకోవాలన్న సూచనను మరోసారి ధర్మాసనం ముందుంచింది. అయితే చర్చలతో వివాదాలు పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదని మను అభిషేక్‌సింఘ్వీ అన్నారు. 'టీ మీద చర్చించడానికి ఏమీ ఉండదని నేను అనుకుంటున్నాను. టీ, పానీయం సమస్యకు పరిష్కారం చూపదు' అన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ సంబంధమైన అంశమని, బిల్లులను అసెంబ్లీ తనకు పంపిన తర్వాత గవర్నర్ దానిని రాష్ట్రపతికి పంపవచ్చా? టీ, లేదా ఏదో పానీయం ద్వారా పరిష్కరించబడే సమస్య కాదు (ప్రతిష్టంభనను ముగించడానికి చర్చలకు సీఎంను ఆహ్వానించాలని సీజేఐ గవర్నర్‌ను అభ్యర్థించారు) ఇది సమస్యను పరిష్కరించదు. ఇది పూర్తిగా రాజ్యాంగపరమైన అంశం' అన్నారు.

'ఏం చేయాలో అది చేస్తాం. కానీ, ముఖ్యమంత్రి, గవర్నర్‌లు సమావేశం కావడంలో ఇబ్బంది ఏమిటి? కాబట్టి, బహుశా సమస్యలు పరిష్కరించబడతాయా? ముఖ్యమంత్రి, గవర్నర్ మధ్య చర్చకు మార్గం ఎప్పుడూ తెరిచి ఉంచాలి. ఒకరితో ఒకరు మాట్లాడుకోనివ్వండి. వివాదాలను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవచ్చు. ప్రభుత్వ కార్యకలాపాలు ముందుకు సాగాలి' అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. పశ్చిమ బెంగాల్ యూనివర్సిటీ సమస్యను కోర్టు సూచనల మేరకు ముఖ్యమంత్రి, గవర్నర్‌లు పరిష్కరించారని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

వేధింపులకు షీటీమ్స్ అడ్డుకట్ట

● 15 రోజుల్లో 117 మంది ఆకతాయిల పట్టివేత ● అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్ ● డెకాయ్ ఆపరేషన్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

బస్టాండ్‌లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, రోడ్లు, కాలేజీలు, రద్దీ ప్రాంతాలు, చివరకు దేవాలయాలు, ఉత్సవాల్లోనూ పోకిరీల ఆగడాలు మితిమీరుతున్నాయి. అయితే, షీ బృందాలు ఎప్పటికప్పుడూ ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. బాధిత యువతులు, మహిళలకు 'మీ కోసం మేమున్నామని భరోసా' ఇస్తున్నాయి. 15 రోజుల్లో 117 మందిని రాచకొండ షీ టీమ్స్ అదుపులోకి తీసుకున్నాయి.

గత నెల నవంబర్ 16 నుంచి 30 వరకు 135 ఫిర్యాదులు షీ బృందాలకు అందాయి. ఫోన్ల ద్వారా వేధించినవి 24కాగా, వాట్సాప్ ద్వారా వేధించినవి 30, సోషల్‌మీడియా ద్వారా వేధించినవి 18, నేరుగా 63 మంది ఆకతాయిలు వేధింపులకు పాల్పడ్డారు. విచారణ చేపట్టిన షీ బృందాలు నాలుగు క్రిమినల్ కేసులు, 47 పెట్టి కేసులు నమోదు చేశాయి. మరో 68 మందికి కౌన్సెలింగ్ ఇచ్చాయి.

ఏడేండ్లుగా వేధిస్తున్న మీడియా వ్యక్తి అరెస్ట్

ఎల్‌బీ నగర్‌లో నివాసముంటున్న ఓ గృహిణి ప్రయివేటు కంపెనీలో పనిచేస్తోంది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఏడేండ్లుగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దాంతో అతని తల్లిదండ్రులకు విషయం చెప్పింది. అయితే, కొద్దిరోజులు బాగానే ఉన్న నిందితుడు, తిరిగి వేధించడం ప్రారంభించాడు. విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆమెను బెదిరించాడు. దీంతో బాధితురాలు ఎల్‌బీనగర్ షీ టీమ్స్‌ను సంప్రదించింది. వెంటనే స్పందించిన షీ బృందాలు నిందితున్ని అదుపులోకి తీసుకొని ఎల్‌బీనగర్ పోలీసు స్టేషన్‌లో అప్పగించి క్రిమినల్ కేసు నమోదు చేశారు.



'రాపిడో' ఆటో డ్రైవరు అరెస్టు

రామంతపూర్‌లో నివాసముండే బాధితురాలు నార్సింగ్ నుంచి రాపిడో ఆటోను బుక్ చేసుకుంది. ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో డ్రైవరు మార్గ మధ్యలో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో బాధితురాలు షీ టీమ్స్‌ను సంప్రదిం చగా.. వెంటనే స్పందించి నింది తున్ని అదుపులోకి తీసున్నారు.

ప్రేమించాలంటూ బాలికకు వేధింపులు

వనస్థలిపురంలో ఉండే 14 ఏండ్ల బాలిక 9వ తరగతి చదువుతోంది. ప్రతిరోజూ స్కూల్‌కు వెళ్లి వస్తుంటే, మార్గమధ్యలో ఓ బాలుడు 9 నెలల నుంచి ప్రేమించాలని వేధిస్తున్నాడు. దాంతో బాలిక తల్లిదండ్రులతో కలిసి షీ టీమ్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన షీ బృందాలు అతన్ని అరెస్టుచేసి కేసు నమోదు చేశాయి.

మల్కాజ్‌గిరిలో నివాసముండే 16 సంవత్సరాల బాలిక తమ అపార్ట్‌మెంట్‌లోకి పోతూ గేటు మూసేస్తుండగా, ఇంతలో గేటు ముందుకు బైక్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. అకస్మాత్తుగా తన ప్యాంట్ విప్పి ప్రయివేటు పార్ట్స్ ఆమెకు చూపించాడు. ఆమె వెంటనే ఇంట్లో చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు.

అవగాహన కార్యక్రమం

నవంబర్ 16 నుంచి 30 వరకు రాచకొండ షీ టీమ్స్ 47 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. మహిళా చట్టాలు, వారి హక్కులు, నేరాలపై దాదాపు 8275 మందికి అవగాహన కల్పించాయి.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి: డీసీపీ

బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తి లేదని డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. బాధితులు ముందుకొచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కోరారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీటీమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాచకొండ క్యాంప్ కార్యాలయంలో ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళలను, యువతులను వేధిస్తున్న 117 మందిని (మేజర్స్-47, మైనర్స్ -70) షీ టీమ్స్ అరెస్టు చేశాయని వివరించారు. షీబృందాలు మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయని, పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నామని తెలిపారు. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. బాధితులు షీ బృందాలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నేరుగా కానీ వాట్సాప్‌లో 8712662111లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీటీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ శాంతిప్రియ, రమ్యా, శ్యామల గౌరి తదితరులు పాల్గొన్నారు.

డెకాయ్ ఆపరేషన్

కుషాయిగూడ పరిధిల్లో షీ బృందాలు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాయి. రోడ్డుపై వెళ్తున్న మహిళలను, బాలికలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22 మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నాయి. ఎల్‌బీనగర్, వనస్థలిపురం, మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో సైతం షీ బృందాలు డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి ఆకతాయిలను అరెస్టు చేశాయి.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

- ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర నాయకులు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నేతృత్వంలో నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, ప్రజాస్వామిక వాతావరణం ఏర్పాటుకు పాటుపడాలని కోరారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలనీ, పదోన్నతుల సంక్షోభాన్ని పరిష్కరించాలని సూచించారు. జీవో నెంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. వేతనాలు, బకాయిలు సకాలంలో చెల్లించాలనీ, ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రుతూ లేఖను సీఎం రేవంత్‌రెడ్డికి సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య చావ రవితోపాటు కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు ఎ వెంకట్, ఎం రాజశేఖర్‌రెడ్డి, ఈ గాలయ్య ఎ సింహాచలం వై జ్ఞానమంజరి, పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి, మోడల్ స్కూల్ నాయకులు కొండయ్య, గురుకుల ఉపాధ్యాయ నాయకులు నర్సింహా, కేజీబీవీ రాష్ట్ర ప్రతినిధి విశాలాక్షి, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్ నాయక్, వెంకటప్ప, రఘుపాల్ తదితరులు పాల్గొన్నారు.

18న హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

- ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్, డీజీపీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 18న హైదరాబాద్‌కు రానున్నారు. ఐదు రోజుల పాటు ఆమె ఇక్కడ బస చేయనున్నారు. ఆమె ఈ నెల 23న తిరుగు ప్రయాణమవుతారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి వివిధ శాఖల అధికారులతో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లలో ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఆరోగ్య, రోడ్లు భవనాలు, మున్సిపల్, విద్యుత్, సంబంధిత శాఖలు బ్లూ బుక్ ప్రకారం ఫూల్‌ప్రూఫ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ రవి గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునిల్ శర్మ, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, వైద్యఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, సీనియర్ పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

బీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పోలే నిరంజన్



హైదరాబాద్ : ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకొని... వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పోలే నిరంజన్ అన్నారు. వారి కుటుంబాలకు ఉచితంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్‌టీయూ నగర కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆటో కార్మికులకు నెలకు రూ. 15000 వేల చొప్పున, ప్రతి ఆటో కార్మికుడికీ ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యతగా డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులలు, వికలాంగులు కూడా ఉచిత సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము వీరస్వామి, నల్గొండ నరేందర్, సర్పంచి వెంకన్న, శంకర్ గౌడ్, రామకష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏ ఏజెన్సీతో విచారణ అనేది తేలుస్తాం

కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ఎంపీ సభ్యత్వానికి రాజీనామా
- సోనియా, రాహుల్‌తో భేటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, మేడిగడ్డ కుంగిన ఘటనలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాలా? లేక రాష్ట్ర ఏజెన్సీలతో విచారణ చేయాలా? అన్నది సీఎంతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

మేడిగడ్డ అంశంలో డిజైన్, అమలు, నిర్వహణ, నిబద్ధతలో లోపాలున్నాయని విమర్శించారు. దీనికి జవాబుదారీ ఎవరన్నది తేలుస్తామని, ఇందులో అధికారుల పాత్ర ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సతీమణి, ఎమ్మెల్యే పద్మావతితో కలిసి ఉత్తమ్ బుధవారం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్ట్ విషయంలో అవినీతిని తేల్చి, పారదర్శకంగా ముందుకు వెళ్తామన్నారు. మొదట ఫైనల్ స్టేజ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను పూర్తిచేసి, తక్షణ ఆయకట్టునిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు చెప్పారు. పౌర సరఫరాల శాఖలోనూ జవాబుదారి తనం తెస్తామన్నారు. గరీబ్ కళ్యాణ్ యోజన కింద రాష్ట్రంలో పేదలకు పంచిన బియ్యం నాణ్యత లేకపోవడంతో 90 శాతం రీ సైకిలింగ్ అయ్యేవని చెప్పారు.

పౌర సరఫరాల శాఖలో ధాన్యం కొనుగోళ్లను మరింత పటిష్టం చేసి... రైతులకు మేలు చేస్తామని వెల్లడించారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టుల్లో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసినా, ఆశించిన ఫలితాలు, ప్రయోజనం మాత్రం రాలేదన్నారు.

ఎంపీ సభ్యత్వానికి రాజీనామా

హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నేపథ్యంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎంపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను కలిసి తన రాజీనామా లేఖను అందజేశారు. అనంతరం తన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతితో కలిసి... జన్ పథ్ 10లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్ర మంత్రివర్గంలో తనకు చోటు కల్పించినందుకు అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు

గత బీఆర్ఎస్ సర్కార్ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి, వాస్తవాలను దాచి తెలంగాణను అప్పుల్లో ముంచిందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఎంపీగా తాను అడిగిన ప్రశ్నలతోనే కార్పొరేషన్లు, పలు సంస్థల నుంచి బీఆర్ఎస్ సర్కార్ తీసుకొన్న అప్పులు వివరాలను బయటకు వచ్చాయన్నారు. గడిచిన నాలుగున్నర ఏండ్లలో దాదాపు లక్ష కోట్లు ఈ కార్పొరేషన్ల నుంచి అప్పు తీసుకుందన్నారు. ఇక రూ.67వేల కోట్ల అప్పులతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే... గడిచిన తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ సర్కార్ ఆ అప్పును ఏకంగా రూ.4.50లక్షల కోట్లకు పెంచిందన్నారు. దీంతో ప్రతి తెలంగాణ బిడ్డపై తలసరి అప్పు రూ.20 వేల నుంచి, రూ. లక్షకు పెరిగిందని ఫైర్ అయ్యారు. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి రూ.81వేల కోట్లు, పౌర సరఫరాల శాఖకు సంబంధించి రూ.56వేల కోట్లు అప్పులున్నాయని తేలిందని, ఇరిగేషన్‌కు సంబంధించి రూ.10వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు. ఎంపీగా తెలంగాణకు సంబంధించి ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు, రాష్ట్రంలో ట్రైబల్ రిజర్వేషన్ల పెంపు, బీబీ నగర్ ఏయిమ్స్ నిర్మాణం, ధాన్యం కొనుగోలు, తెలంగాణ బొగ్గు గనుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పలు ప్రశ్నలు లేవనెత్తినట్టు చెప్పారు.

నెగెటివ్ మైండ్‌సెట్ మారాలి..

లేకుంటే గట్టిగానే సమాధానం చెప్తాం

ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోగకరం

- సిద్దిపేటలో మార్నింగ్ వాక్ నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవ తెలంగాణ - సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో కూలుతుందని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, 110 సీట్లలో డిపాజిట్ రాని బీజేపీ నేతలు చెప్పడం సభ్య సమాజం అసహ్యించుకుంటోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, నెగిటివ్ మైండ్‌సెట్‌ను మార్చుకోకుంటే కాంగ్రెస్ వారికి గట్టిగా సమాధానం చెబుతుందని చెప్పారు. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం మంత్రి మార్నింగ్ వాక్ నిర్వహించి.. అక్కడికి వచ్చిన ప్రజలతో ముచ్చడించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని, ఎమ్మెల్యేలు పోతారని ప్రతిపక్షాలు అనడం వారి నెగటివ్ మైండ్‌సెట్‌ను బయట పెడుతోందన్నారు. రాజాసింగ్ 10 మంది ఎమ్మెల్యేలు పోతారని అనడం ఏమైనా జ్యోతిష్యం చదివారా అని ప్రశ్నించారు. ప్రొటెం స్పీకర్ విషయంలో కూడా మతపరమైన అంశాలు తీసుకురావడం సరికాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కూలాలి.. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్నారని, వారి కుట్రలు, వ్యూహం తమకు తెలుసునన్నారు. హుస్నాబాద్‌ను మోడ్రన్ నియోజకవర్గంగా మారుస్తామన్నారు. 'గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని కడతామని చెప్పిన గత ప్రభుత్వం 70 శాతం పనులైన సొరంగమార్గం, ప్రాజెక్టు కట్టనిర్మాణం వరకే పూర్తిచేసిందన్నారు. ఇరిగేషన్ పరంగా హుస్నాబాద్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. గండిపేట ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కేటాయించలేదని, తోటపల్లి ప్రాజెక్టు రద్దు చేశారని, అక్కడ భూ నిర్వాసితులకు ఏ విధంగా న్యాయం చేయాలో సీఎం స్థాయిలో సమీక్షించి వారికి సహకరిస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యను మాజీ ఎమ్మెల్యేలు జటిలం చేశారని, చర్చల ద్వారా సమస్య పరిష్కారం కానిది ఏదీ లేదన్నారు. రైతులంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే రైతులని అన్నారు.

తాము ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అర్హులకు ఇస్తామని అన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలోని 'డబుల్' ఇండ్లలో భూ నిర్వాసితులు ఉంటున్నారని, సీఎంతో చర్చించి అవి వారికే కేటాయించడమా లేదా ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన వారికా.. చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తీసుకురావడం మూలంగా వారికి ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు. పాత బస్టాండులో మంత్రి బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో కొంతసేపు ముచ్చటించారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు.. ఎక్కడికి వెళ్తున్నారు.. ఉచితంగా ప్రయాణం చేశారా.. వారికి ఎంత డబ్బు ఆదా అవుతుందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు పూజలు హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, గూడూరు శ్రీనివాస్, తాడూరి శ్రీనివాస్, సూర్య వర్మ గాడి పల్లి శ్రీనివాస్ రెడ్డి, కలీముద్దీన్, దాస అంజయ్య, అత్తు ఇమామ్, సతీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఆర్ఓ అయోధ్యరెడ్డి కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డికి సీఎం ముఖ్య ప్రజా సంబంధాల అధికారి బి.అయోధ్యరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిశారు. సీఎంకు పూలగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

మంత్రి సీతక్కకు సర్పంచుల సంఘం నేతల శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)కి రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు భూమన్న యాదవ్, మహిళా అధ్యక్షులు జూలూరు ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులు వెంకటేష్, రామేశ్వర్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆమెను వారు కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుచ్ఛగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించారు. ఐదేండ్లలో సర్పంచులు చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి సర్పంచులను మంత్రి సీతక్క అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించీ ఆరా తీశారు. త్వరలోనే సర్పంచుల సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామని మంత్రి హామీనిచ్చారు.

రేపు పటాన్‌చెరులో వెల్యూజోన్ హైపర్ మార్ట్ ప్రారంభం

- రానున్న నటుడు బాలకృష్ణ

హైదరాబాద్ : నగరంలోని పటాన్‌చెరులో ఏర్పాటుచేసిన నూతన వెల్యూజోన్ హైపర్ మార్ట్‌ను శుక్రవారం ప్రముఖ నటుడు బాలకృష్ణ ప్రారంభించనున్నారు. షాపింగ్ అనేది కేవలం వస్తువులను కొనుగోలు చేసే ప్రదేశం మాత్రమే కాకుండా ఆనందించడానికి ఒక అనుభవంగా దీన్ని రూపొందించినట్లు ఆ సంస్థ యాజమాన్యం ఓ ప్రకటనలో పేర్కొంది. తమ మాల్‌లోని అసంఖ్యాకమైన బ్రాండ్లపై 40 శాతం వరకు డిస్కౌంట్లను అందించనున్నట్లు, విభిన్నమైన ఆఫర్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. అందుబాటు ధరల్లో వినియోగదారులు మరిన్ని వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రోత్సహించేలా వాతావరణం ఉంటుందని అభిప్రాయపడింది. మాల్ ఆర్కిటెక్చర్, లేఅవుట్ విశాలమైన అనుభవం కోసం సృజనాత్మకంగా రూపొందించబడిందని పేర్కొంది. పార్కింగ్ సదుపాయాల నుంచి పిల్లలు ఆడుకునే ప్రదేశాల వరకు సాటిలేని అనుభవాన్ని మిగుల్చుతుందని తెలిపింది. తమ సంస్థకు అంబాసీడర్‌గా దిగ్గజ నటుడు నందమూరి బాలకృష్ణ విస్తృత ప్రచారం కల్పించనున్నారని వెల్లడించింది. వేల్యూ జోన్ రిటైల్ మార్కెట్‌లో విప్లవం సృష్టించనుందని తెలిపింది.

చేగువేరా సినిమాను ఆదరించండి

- డైరెక్టర్, హీరో సభవత్ బాలరాజు

నవతెలంగాణ-సిటీబ్యూరో/ముషీరాబాద్

ప్రపంచ విప్లవకారుడు.. యూత్ ఐకాన్ చేగువేరా బయోపిక్ సినిమా "చే.. లాంగ్ లీవ్"ను ఆదరించాలని డైరెక్టర్, హీరో సభవత్ బాలరాజు నాయక్ అన్నారు. భారతదేశంలో మొదటిసారిగా నిర్మించిన చేగువేరా బయోపిక్ సినిమా చే.. లాంగ్ లీవ్‌కు సంబంధించిన పోస్టర్‌ను డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చేగువేరా మూవీ డైరెక్టర్ బాలరాజు నాయక్ మాట్లాడుతూ.. చేగువేరా జీవితం ఆధారంగా తీసిన సినిమా ఈ నెల 15న తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 90 థియేటర్లలో విడుదల కాబోతోందని తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసి విజయాలను సాధించిన వ్యక్తి చేగువేరా అని, అలాంటి పోరాట యోధుడి జీవితం ఆధారంగా తీసిన సినిమాను విద్యార్థులు, యువత, ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సినిమాను అందరూ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో ఇలాంటి సినిమాలు తీయడం చాలా అరుదు అన్నారు. కార్యక్రమంలో సినిమా కో-డైరెక్టర్ వినయ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావేద్, హస్మి బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ రెడ్డి, లెనిన్, నాయకులు నాగేందర్, శ్రీమన్నా నాయక్, అజయ్, సాయికిరణ్, సూర్య పాల్గొన్నారు.

సంపాదకీయం

పాలన-ప్రక్షాళన

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి సరిగ్గా ఎనిమిది రోజులు. ఈ కాలంలో అనేక కీలక పరిణామాలు సైతం జరిగాయి. రేవంత్ సర్కారు వేగం పెంచుతున్నది. సీఎం, మంత్రులు బాధ్యతల్లోకి రాగానే సమీక్షలకు దిగారు. ప్రభుత్వ శాఖల్లో లోటు, పాట్లు, ఇతర పరిస్థితులను గుర్తించి, ఆకలింపు చేసుకుంటున్నారు. మేడిపండు చందంగా ఉంది వివిధ సర్కారీ శాఖల్లోని ప్రస్తుత పరిస్థితి. ఒక్కో శాఖను సమీక్ష చేస్తున్న క్రమంలో విస్తుగొల్పే నిజాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నేరవేర్చాలంటే ఐదేండ్ల ఈ సర్కారుకు, వచ్చే ఆరు నెలలు కత్తిమీద సాము కానుంది. అధికార పీఠాన్ని అధిష్టించడం ఒక ఎత్తయితే, జనానికి ఇచ్చిన హామీలను అమలు చేయడం మరో ఎత్తు. ఆరు గ్యారంటీల్లో రెండింటికి ఇప్పటికే పచ్చ జెండా ఊపిన సర్కారు, మిగతా వాటిపైనా చురుగ్గానే పని చేస్తున్నది. గ్యారంటీల అమలుకు అవసరమైన నిధులనూ సమకూర్చుకోవాల్సిన బాధ్యత రేవంత్ సర్కారుదే. పరిపాలనను గాడీలో పెట్టడం ద్వారా మ్యానిఫెస్టోకు ఊపిరిపోసే యత్నంలో ఉంది.

> కేసీఆర్ ఏలుబడిలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఖాతాల్లో పడ్డాయనేది పచ్చి నిజం. యూపీఎస్సీతోపాటు ఇతర రాష్ట్రాల సర్వీసు కమిషన్ల పనితీరు అధ్యయనం చేసి టీఎస్‌పీఎస్సీని గాడిన పెట్టాలని సీఎం ఆలోచనలా ఉంది. ఎన్నికలకు ఐదారు నెలల ముందువచ్చిన నోటిఫికేషన్లు, డీఎస్సీ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లాయి. ఇప్పడా సంస్థను బలోపేతం చేయడం ద్వారా వారిలో వెలుగులు నింపడం తక్షణ కర్తవ్యంగా ఉండాలి. సీఎం రేవంత్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్‌చేసి నిధుల పరంగా సహకరించాలని కోరడం మంచి ప్రయత్నం.

పాలనా పగ్గాలు చేత బట్టిందో లేదో అప్పుడే స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ, పార్లమెంటు ఎన్నికలు సీఎంకు సవాళ్లు విసురుతున్నాయి. టీపీసీసీ చీఫ్ కూడా కావడంతో బాధ్యత ఆయనపైనే ఎక్కువగా ఉంది. గ్యారంటీల అమల్లో ఏ మాత్రం తడబడినా కత్తితెగి మెడమీద పడుతుంది. పరిపాలన ఏ ఒక్కరో,ఇద్దరో చేసేది కాదు. ప్రభుత్వం అంటేనే సామూహిక యజ్ఞం. సీఎం, మంత్రులు శాఖలను సమగ్రంగా సమీక్షిస్తూనే, మరోవైపు భవిష్యత్తు కార్యాచరణను వెంటనే ప్రకటిస్తుండటం మేలుచేసేదే. బీఆర్ఎస్ సర్కారు సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మెన్లను ఒక్క కలం పోటుతో ఇంటికి సాగనంపి, ప్రజాసమస్యలు, సామాజిక పరిస్థితులపై అవగాహన ఉన్న ఉన్నతాధికారులతో సీఎంవోను ,పోలీస్‌శాఖను పటిష్టం చేస్తున్నారు. వచ్చిరాగానే ఆర్థిక, విద్యుత్ శాఖల అంతుతేల్చేపనిలో పడ్డారు. ప్రభుత్వాలు అప్పులు చేయడం సాధారణమే అయినా, అవి పారదర్శకత



లేకుండా గందరగోళంగా ఉన్నాయనేది తాజా సర్కారు సమీక్షల సారాంశం. కరెంటు శాఖలో రూ. 81 వేల కోట్ల అప్పులుంటే, పౌరసరఫరాల శాఖలో రూ.52 వేల కోట్లు. ఇలా మొత్తం ప్రభుత్వ అప్పు రూ. 5.5 లక్షల కోట్లుగా ఉందని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కే స్వయానా చెప్పడం గమనార్హం.

కాళేశ్వరం ప్రాజెక్టు రొక్కం కాగ్ లెక్కల ప్రకారం రూ. 1.26 లక్షల కోట్లు. ఇప్పుడు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయడానికి కావాల్సిన సొమ్ము అక్షరాలా రూ.60వేల కోట్లు. మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పేర రెండింటిని ఆచరణలోకి తెచ్చిన ప్రభుత్వం, యాసంగి పంట పెట్టుబడికి రైతుబంధుకు నిధులు విడుదలకు ఆదేశాలివ్వడమూ శుభ పరిణామమే. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలూ తక్షణ కర్తవ్యం కూడా. అప్పులు, నష్టాలు, బకాయిలకు సంబంధించి శ్వేతపత్రాలు ప్రకటిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవాలను జనానికి చెప్పాలనేది అందులోని అంతర్యం. కేసీఆర్ ఏలుబడిలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఖాతాల్లో పడ్డాయనేది పచ్చి నిజం. యూపీఎస్సీతో పాటు ఇతర రాష్ట్రాల సర్వీసు కమిషన్ల పనితీరు అధ్యయనం చేసి టీఎస్‌పీఎస్సీని గాడిన పెట్టాలని సీఎం ఆలోచనలా ఉంది. ఎన్నికలకు ఐదారు నెలల ముందువచ్చిన నోటిఫికేషన్లు, డీఎస్సీ నిరుద్యోగుల ఆశలపై నీళ్లచల్లాయి. ఇప్పుడా సంస్థను బలోపేతం చేయడం ద్వారా వారిలో వెలుగులు నింపడం తక్షణ కర్తవ్యంగా ఉండాలి. సీఎం రేవంత్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్‌చేసి నిధుల పరంగా సహకరించాలని కోరడం మంచి ప్రయత్నం.

కాగా గత తొమ్మిదేండ్ల కాలంలో కేంద్రం, రాష్ట్రానికి జాతీయ రహదారులు, ఇతరాల కోసం రూ.1.20 లక్షల కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ, కేవలం రూ.20 వేల కోట్ల పనులే ఇచ్చింది. మిగతా రూ. లక్ష కోట్ల పనులకు నిధులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టింది. అలాగే హక్కుగా రావాల్సిన రూ. 20వేల కోట్ల జీఎస్టీ సొమ్మునూ రాబట్టాలి. కంచెను బద్దలుకొట్టడం ద్వారా ప్రగతి భవన్, ప్రజలకు స్వేచ్ఛావాయువును అందించింది. విద్యార్థులు, యువత భవిష్యత్‌ను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ ముఠాల పీచమణచాలి. హైదరాబాద్ ఆహారకల్తీకి కేంద్రంగా మారిందనే వార్తలపై గట్టిగానే స్పందించాలి. గ్యాస్‌సిలిండర్ రూ.500 హామీపై జనానికి ఉన్న ఆశలెన్నో. ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతిపత్రాల రూపంలో వస్తున్న సమస్యలనూ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి. జనం ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగితేనే 'పాలకులం కాదు.. సేవకులం' అని సీఎం రేవంత్‌రెడ్డి ఎల్బీ స్టేడియం వేదికగా చెప్పిన మాటకు సార్థకత.

ఆర్థిక వృద్ధి ఎగుమతులపై ఆధారపడితే వచ్చే చిక్కులు



ప్రభాత్ పట్నాయక్

దేశ ఎగుమతులను పెంచి తద్వారా ఆర్థికవృద్ధి సాధించడం అనే వ్యూహంపై ఆర్థికవేత్తల నడుమ గత ఏభై ఏళ్ళుగా చర్చ నడుస్తూనే వుంది. తూర్పు ఆసియా 'పులులు' సాధించిన 'అద్భుతాల'ను భారతదేశం వంటి నత్తనడకన వృద్ధి సాధిస్తున్న దేశాలతో పోల్చి 'ముడుచుకుపోయే' అభివృద్ధి వ్యూహం అనుసరించడమే మన వృద్ధిరేటు పెరగకపోవడానికి కారణం అని ప్రపంచ బ్యాంక్ వ్యాఖ్యానించింది. ఈ మొత్తం చర్చలో వాస్తవ జీవితానికి సంబంధించి కీలకపాత్ర పోషించే ఒక విషయాన్ని మాత్రం విస్మరించారు.

ఒక ఆర్థిక వ్యవస్థలో స్థూల డిమాండ్‌లో భాగంగా ఉండే వివిధ ఖర్చులలో కొన్ని పద్దులు స్వయం ప్రతిపత్తితో ఉంటాయి. తక్కిన ఖర్చులు మొత్తం డిమాండ్ ఏ మేరకు పెరిగితే ఆ మేరకు అవి కూడా పెరుగుతాయి. ఎగుమతులు, ప్రభుత్వ వ్యయం స్వయంప్రతిపత్తి కలిగిన ఖర్చులు (ఎగుమతుల ఖర్చు అంటే ఎగుమతి చేసే సరుకులను ఉత్పత్తి చేయడం కోసం చేసే ఖర్చు. ఇది మన దేశానికి వెలుపల ఉండే డిమాండ్ బట్టి ఉంటుంది తప్ప మన దేశపు డిమాండ్ మీద కాదు). సరుకుల విని మయం కోసం చేసే ఖర్చు వినిమయదారుల ఆదాయాల మీద ఆధారపడి వుంటుంది. ఐతే, కొన్ని సందర్భాలలో ఆదాయాలతో నిమిత్తం లేకుండా కూడా వినిమయ ఖర్చు ఉంటుంది. ఉదాహరణకు ఇంతవరకూ వినియోగదారులకు మార్కెట్‌లో లభించని ఏదైనా వస్తువు ఇప్పుడు మార్కెట్‌లో ఒక్కసారి లభిస్తూ వుంటే, దానిని కొనుగోలు చేయడానికి అందరూ సిద్ధపడతారు.

ఒక ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌లో వృద్ధి, దానితోబాటు ఉత్పత్తిలో వృద్ధి స్వయంప్రతిపత్తి ఉన్న ఖర్చుల పెరుగుదల మీద ఆధారపడి వుంటుంది. నయా ఉదారవాద విధానాలను అమలు చేసే ఆర్థిక వ్యవస్థలో దేశాల ఎల్లలను అధిగమించి ద్రవ్య పెట్టుబడి సంచరిస్తూ వుంటుంది. అందుచేత అది ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల మీద అనేక రకాలుగా ఒత్తిడులు తెచ్చి తాను విధించే పరిమితులకు లోబడి వ్యవహరించాలని ఒప్పిస్తుంది. జిడిపిలో ఒకానొక పరిమితిని దాటి ద్రవ్యలోటు ఉండరాదు అన్నది అటువంటి ఒక షరతు. అప్పుడు ఆ దేశం తన ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను పెంచడం కోసం చేయగల ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకోడానికి చిక్కులెదురౌతాయి. సంపన్నులపై విధించే పన్నులను పెంచి తద్వారా లభించే అదనపు ఆదాయంతో ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకోవచ్చు. కాని అందువలన ద్రవ్యలోటు పెరుగుతుంది. ద్రవ్యలోటు ఒకానొక పరిమితికి మించరాదన్న షరతు ఉంది కనుక సంపన్నుల మీద విధించే పన్నులను పెంచగల శక్తిని ప్రభుత్వం కోల్పోతుంది. మరి డిమాండ్ పెంచడానికి, తద్వారా వృద్ధిరేటు పెంచడానికి ఎగుమతులను పెంచడం మినహా మరో దారిలేదు. అందుచేత నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ ఎగుమతుల వృద్ధి మీద ఆధారపడి నడిచే వ్యవస్థగా ఉంటుంది. ఐతే నయా ఉదారవాద విధానాల చట్రానికి లోబడకుండా కూడా ప్రభుత్వం తన ఎగుమతులను పెంచి తద్వారా వృద్ధి సాధించవచ్చు. అటువంటి వృద్ధి సాధించడంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించి ఎగుమతులు పెరగడానికి తోడ్పడవచ్చు. చాలామంది తూర్పు ఆసియా దేశాల్లో జరిగిందిదే అని వాదిస్తారు.

ఎగుమతులను పెంచుకోవడం ద్వారా వృద్ధి సాధించడం అనే వ్యూహాన్ని అమలు చేసే దేశాల్లో రెండు రకాలు ఉంటాయి. ఆ తేడాను మనం చూడాలి. మొదటి కేసులో ఒకానొక దేశం ఒక పథకం ప్రకారం తన ఎగుమతులను పెంచుకుంటూ, విదేశీ వాణిజ్యంలో మిగులును క్రమంగా పెంచుకుంటూపోవచ్చు. తద్వారా తన విదేశీ మారక నిల్వలను పెంచుకుంటూ పోవచ్చు. ఇందుకు చైనా ఒక ప్రధాన ఉదాహరణ. అటువంటి దేశాల విషయంలో, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఏవైనా ప్రతికూల మార్పులు చోటుచేసుకున్నా, వాటి ప్రభావం ఆ విదేశీ వ్యాపారం ద్వారా సమకూరిన నిల్వలు తగ్గడం వరకే పరిమితంగా ఉంటుంది. అందుచేత అటువంటి దేశాలు ఆ ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితులను తట్టుకుని తేలికగానే బయటపడగలుగుతాయి.

> ఎగుమతులను పెంచుకోవడం ద్వారా వృద్ధి సాధించడం అనే వ్యూహాన్ని అమలు చేసే దేశాల్లో రెండు రకాలు ఉంటాయి. ఆ తేడాను మనం చూడాలి. మొదటి కేసులో ఒకానొక దేశం ఒక పథకం ప్రకారం తన ఎగుమతులను పెంచుకుంటూ, విదేశీ వాణిజ్యంలో మిగులును క్రమంగా పెంచుకుంటూపోవచ్చు. తద్వారా తన విదేశీ మారక నిల్వలను పెంచుకుంటూ పోవచ్చు. ఇందుకు చైనా ఒక ప్రధాన ఉదాహరణ. అటువంటి దేశాల విషయంలో, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఏవైనా ప్రతి కూల మార్పులు చోటు చేసుకున్నా, వాటి ప్రభావం ఆ విదేశీ వ్యాపారం ద్వారా సమకూరిన నిల్వలు తగ్గడం వరకే పరిమితంగా ఉంటుంది. అందుచేత అటువంటి దేశాలు ఆ ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితులను తట్టుకుని తేలికగానే బయటపడగలుగుతాయి.

ఐతే, చాలా దేశాలు రెండో కోవకు చెందుతాయి. అవి నిరంతరం విదేశీ వ్యాపారంలో లోటును కలిగివుంటాయి. ఆ లోటును భర్తీ చేయడానికి ప్రయివేటు ద్రవ్య పెట్టుబడుల ప్రవాహం మీద ఆధార పడతాయి. ఒకవేళ విదేశీ మారకద్రవ్య నిల్వలలో మిగులును ఎప్పుడైనా సాధించినా, అందుకోసం అవి ప్రయివేటు రుణదాతల నుండి రుణాలు తీసుకుంటాయి. మన దేశం ఈ కోవకే చెందుతుంది. దక్షిణాసియా దేశాలన్నీ దాదాపు ఇదే కోవలో ఉంటాయి. మూడో ప్రపంచ దేశాల్లో చాలా దేశాలూ ఈ కోవలో ఉంటాయి.

ఇటువంటి దేశాల విషయంలో విదేశీ వ్యాపార ఖాతాలో లోటు రకరకాల బాహ్య కారణాల వలన పెరగవచ్చు. కరోనా కాలంలో టూరిస్టుల రాక తగ్గిపోయినందువలన శ్రీలంకలో విదేశీ మారక ఆదాయం ఒక్కసారిగా పడిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా దిగుమతుల ధరలు పెరిగిపోవడం, ప్రపంచవ్యాప్త మాంద్యం కారణంగా ఎగుమతులకు ధరలు పడిపోవడం జరిగి బంగ్లాదేశ్ చిక్కుల్లో పడింది. అటువంటప్పుడు ఆ దేశానికి పెట్టుబడులను పంపించేవారు, ముఖ్యంగా రుణదాతలు వెనుకాడతారు. దాని వలన ఆ దేశపు చిక్కులు మరింత ఎక్కువ అవుతాయి. విదేశీ వ్యాపార లోటు మరింత పెరిగిపోతుంది. అప్పుడు దేశంలో ఉన్న ఆ కాస్త విదేశీ పెట్టుబడులు కూడా బయటకు ప్రవహించనారంభిస్తాయి.

పెట్టుబడులు పెట్టిన, లేదా రుణాలు ఇచ్చిన ప్రయివేటు పెట్టుబడిదారులు విదేశీ వ్యాపార లోటు పెరుగుతూంటే దాని వలన మన దేశ కరెన్సీ విలువ తగ్గుతుంది అని అంచనా వేస్తారు. అప్పుడు వారి పెట్టుబడులకు లభించే ప్రతిఫలం విలువ తగ్గిపోతుంది. అందుచేత తమ పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటారు. అందువల్ల విదేశీ మారక ద్రవ్య లభ్యత మరింత పెద్ద సమస్యగా అయిపోతుంది. ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా మొత్తం మార్కెట్ శక్తులకే విడిచిపెడితే విదేశీ మారక నిల్వల విషయంలో ఎప్పటికైనా సమతూకం సాధించడం సాధ్యమేనా అన్నది సందేహమే. కాని అటువంటి పరిస్థితి ఉత్పన్నం కాగానే ఆ దేశం ఐఎంఎఫ్ వద్దకు పోయి రుణం తీసుకుంటుంది. అప్పుడు ప్రయివేటు పెట్టుబడిదారులలో కొంత భరోసా ఏర్పడి వారి పెట్టుబడులను వెనక్కి తీసేసుకోకుండా కొనసాగిస్తారు. ఐతే తాను రుణం ఇవ్వడానికి ఐఎంఎఫ్ చాలా పెద్ద మూల్యం కోరుతుంది. సంక్షేమానికి చేసే ఖర్చులో కోతలు విధించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలని, దేశ ఆస్తులను ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులకు అప్పజెప్పాలని (దీనినే విజాతీయీకరణ అని ముద్దుగా అంటారు)- ఇలాంటి షరతులను విధిస్తుంది.

విదేశీ మారక నిల్వలలో లోటు పెరగగానే ప్రయివేటు మదుపుదారులు హడావుడి పడిపోయి తమ పెట్టుబడులను వెనక్కి తీసేసుకోవడం వలన ఆ లోటు భారీగా పెరిగిపోవడం అనేది ఒక స్వల్పకాల వ్యవధిలో జరిగే పరిణామం. ఆ దెబ్బకి దేశం ఐఎంఎఫ్ ఉక్కు పిడికిలిలోకి వెళ్ళిపోతుంది. అంతవరకూ 'అద్భుతాలను' చూపించిన దేశాలు కాస్తా ఒక్కసారి 'బిచ్చగాళ్ళు'గా దిగజారిపోయినది ఇందుకే. కేవలం ఎగుమతులపైనే ఆధారపడి ఆర్థికవృద్ధి సాధించాలనే వ్యూహంతో ఎదురయే చిక్కులివే. ఒకసారి ఆ వ్యూహంతో మన దేశం గనుక అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దురాశాపూరిత కాంక్షల వలలో పడితే ఇక మన గతి అంతే.

ఈ పరిస్థితి మన ఇరుగు పొరుగు దేశాలలో తలెత్తడం మనం చూస్తున్నాం. బంగ్లాదేశ్, శ్రీలంక ఒకానొక దశలో మానవాభివృద్ధి సూచికలలో మనతో పోల్చుకున్నప్పుడు చాలా పురోగతిని కనపరిచాయి. కాని ఇప్పుడు 'బిచ్చగాళ్ల' స్థితికి వచ్చాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో కొనసాగుతున్నప్పుడు పలు మూడవ ప్రపంచ దేశాల ఎగుమతులు దెబ్బ తింటాయి. అప్పుడు 'బిచ్చగాళ్లుగా దిగజారే దేశాల జాబితా పెరిగిపోతుంది. మన దేశ ఆర్థిక వ్యవస్థ సైజు పెద్దది అయి



వుండొచ్చు. మన విదేశీ మారక నిల్వలు భారీగానే ఉండివుండవచ్చు (నిజానికి ఆ నిల్వలలో ఎక్కువ భాగం విదేశీ వ్యాపారంలోని మిగులు వలన ఏర్పడినవి కావు, ప్రయివేటు పెట్టుబడులు, రుణాల ద్వారా ఏర్పడినవే). అయినా, మనదేశం ఈ ప్రమాదానికి అతీతం ఏమీ కాదు. ఒకే ఒక్క ఊరట కలిగించే అంశం ఏమంటే మన ఆహార ధాన్య నిల్వల స్వయంసమృద్ధి (అది కూడా తలసరి వినియోగం పడిపోయినందువలన). ఇక ప్రస్తుత అంతర్జాతీయ సంబంధాల నేపథ్యంలో ఒకవైపు ఆంక్షలు ఉన్నా మనని రష్యా వంటి ఆంక్షలకు గురైన దేశాల నుండి దిగుమతులు తెచ్చుకోడానికి సామ్రాజ్యవాదులు అభ్యంతరాలు పెట్టడం లేదు. నిజానికి రైతులు గనుక మోడీ నల్ల వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టనట్లైతే, మన ఆహార స్వయం సమృద్ధి కాస్తా ముప్పులో పడివుండేది. ఆ ముప్పు మన దేశానికి తప్పించినందుకు మనం ఆ రైతులకు ధన్యవాదాలు చెప్పాలి.

ఒక దేశం నుండి ద్రవ్య పెట్టుబడులు బయటకుపోడానికి ఒక్క అంతర్జాతీయ వాణిజ్య పరిస్థితులే కారణం కానక్కరలేదు. ఒక దేశంలో పాలక పార్టీ ఓడిపోయి మరొకటి వచ్చిందనుకోండి. లేదా ఒక దేశంలోని మంత్రివర్గ పొందిక మారిం దనుకోండి. అటువంటి సందర్భాలు కూడా ఒక్కోసారి ద్రవ్య పెట్టుబడులు బైటకు పోడానికి కారణం అవుతాయి. అటువంటిది జరిగినప్పుడు ఆ దేశపు కరెన్సీ మారక విలువ తగ్గిపోతుంది. దానితో ఆ ప్రయివేటు పెట్టుబడులు మరింత ఎక్కువగా బయటకు పోతాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ప్రవాహ వలయంలోకి ఒకసారి దేశం ప్రవేశించాక ఇటువంటి ప్రమాదాలకు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ గురవుతుంది. ఎగుమతుల పెంపు ద్వారా వృద్ధి సాధించాలనుకుంటే ఆ వలయంలోకి ప్రవేశించకా తప్పదు, ప్రమాదాలకు గురికాకనూ తప్పదు. పోనీ దిగుమతులను తగ్గించుకుందామా అంటే, ఒకసారి అంతర్జాతీయ మార్కెట్‌తో ముడిపడ్డాక దిగుమతులను కుదించుకుంటే ఎగుమతులను పెంచే పోటీలో వెనుకబడిపోతాం.

> మన విదేశీ మారక నిల్వలు భారీగానే ఉండివుండవచ్చు (నిజానికి ఆ నిల్వలలో ఎక్కువ భాగం విదేశీ వ్యాపారంలోని మిగులు వలన ఏర్పడినవి కావు, ప్రయివేటు పెట్టుబడులు, రుణాల ద్వారా ఏర్పడినవే). అయినా, మనదేశం ఈ ప్రమాదానికి అతీతం ఏమీ కాదు. ఒకే ఒక్క ఊరట కలిగించే అంశం ఏమంటే మన ఆహార ధాన్య నిల్వల స్వయంసమృద్ధి (అది కూడా తలసరి వినియోగం పడిపోయినందువలన). ఇక ప్రస్తుత అంతర్జాతీయ సంబంధాల నేపథ్యంలో ఒకవైపు ఆంక్షలు ఉన్నా మనని రష్యా వంటి ఆంక్షలకు గురైన దేశాల నుండి దిగుమతులు తెచ్చుకోడానికి సామ్రాజ్యవాదులు అభ్యంతరాలు పెట్టడం లేదు. నిజానికి రైతులు గనుక మోడీ నల్ల వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టనట్లైతే, మన ఆహార స్వయం సమృద్ధి కాస్తా ముప్పులో పడివుండేది.

ఇటీవల అర్జెంటీనా దేశానికి మితవాద రాజకీయవేత్త జేవియర్ మిల్లర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఆ దేశాన్ని తీవ్ర స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం (150 శాతం) దెబ్బ తీసింది. గత ప్రభుత్వం (పెరొన్ ప్రభుత్వం) ఈ తీవ్ర స్థాయి ద్రవ్యోల్బణానికి కారణం అని ప్రజలు భావించారు. మితవాద మీడియా యావత్తూ పెరొన్ ప్రభుత్వపు విధానాలను ఏకి పారేయడమే గాక ఆ విధానాలు వామపక్ష విధానాలయినందువల్లనే ఆ పరిస్థితి దాపురించిందంటూ ప్రచారం అందుకున్నాయి. కాని అంతకన్నా సత్యదూరమైనది ఇంకొకటి లేదు. వాస్తవానికి ఆ దుస్థితికి పెరొన్ ప్రభుత్వ వామపక్ష విధానాలు కారణం కాదు. అర్జెం టినాలోని బడా ధనవంతులంతా తమ పెట్టుబడులను బైటకు తరలించుకుపోవడం అసలు కారణం. అలా తరలించడంతో కరెన్సీ మారకవిలువ పడిపోయి ద్రవ్యోల్బణానికి దారి తీసింది. ఇప్పుడు మరో ప్రభుత్వం అక్కడ వచ్చింది. ఈ ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దేందుకు ఐఎంఎఫ్ రుణం తీసుకుని దేశాన్ని నయా ఉదారవాద సంకెళ్ళతో కట్టిపడేయవచ్చు. కాని ఆ రుణం తిరిగి చెల్లించాల్సిన సమయం వచ్చినప్పుడు మళ్ళీ విదేశీ చెల్లింపుల్లో లోటు తలెత్తవచ్చునన్న ముందస్తు అంచనాతో మళ్ళీ పెట్టుబడులు బయటకు భారీగా తరలిపోతాయి. అప్పుడు చెల్లింపుల లోటు మరింత పెరుగుతుంది. ద్రవ్యోల్బణం మళ్ళీ విజృంభిస్తుంది.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో ఎగుమతులను పెంచడం ద్వారా వృద్ధి అనే వ్యూహాన్ని అమలు చేశారు. ఆ కాలంలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయి వుంది. ఆ సమయంలో మూడవ ప్రపంచ దేశాలలో దిగుమతులకు ప్రత్యామ్నాయాలను రూపొందించుకునే విధానాలు చేపట్టారు. దాంతో ఎగుమతును పెంచుకోవడం అనే వ్యూహం పూర్తిగా దెబ్బ తినిపోయింది. దెబ్బతిన్న ఆ విధానమే ఇప్పుడు మళ్ళీ, మరొక ప్రపంచ ఆర్థిక సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లో నయాఉదారవాద వ్యవస్థ ద్వారా మన ముందుకు వచ్చింది. అందుచేత ఆ విధానాన్ని తిరస్కరించాలనే చర్చ కూడా ఇప్పుడు మన ఎజెండాలో చేరింది.

(స్వేచ్ఛానుసరణ)



చరిత్ర పాదాలు

ఎన్ని పాద ముద్రల్ని
చరిత్ర కొరకు
దాచుకున్నాయో రస్తాలు
ఎన్ని బొబ్బల్ని ముద్దాడాయో
ఎన్నెన్ని రక్త గాయాలని
గుండెల్లో భద్ర పరచుకున్నాయో
సూర్యుడు కూడా శత్రువై
కాల్చిన సలాకల్ని
సూటిగా శరీరంలో
గుచ్చుతున్నప్పుడు
నీటి చెలమల్లా పర్చుకున్న
మరీచికల్నిచూసి
కన్నీళ్ల
ఎండిన పెదవుల్ని తడిపినప్పుడు
సెగలై బుసలు కొడుతున్నాయి రోడ్లు
నడుస్తున్న వలస కార్మికులే
తన జన్మనిచ్చిన
మాతృమూర్తులని తెలిసి
చీరుకు పోయిన పాదాలని ఎంతగా
ముద్దాడాయో
నిదురించే అమ్మానాన్నకి
చెల్లికి రాత్రంతా మేల్కొని
కాపలా కాసి
ఉదయం చల్లగా
గుండెల్ని పరిచి
ఆహ్వానించాయో
అమ్మా భారతీ !
వందే భారత్ అంటూ
'వందే మాతరం' అంటూ
పాలకులు నీ బిడ్డని దగా చేస్తున్న
దృశ్యం చూస్తున్నావా
చెమట చుక్కల తడి ఆరక ముందే
పేదరికాన్ని అపహాస్యం చేస్తున్న
సవ్వడి వింటున్నావా
ప్రాజెక్టులు కట్టిన చేతులు
చుక్క నీటి కోసం
పరితపిస్తునాయి
మిద్దెలు మేడలుకట్టిన మనుషులు
ఆకుచాటు నీడ కోసం భగ్నమౌతున్నారు
మళ్లీ ఈ అంతర్గత
పార తంత్ర విముక్తి కోసం
జాగ్రెరహో నినాదం తప్పని సరేమో!

- ఈతకోట సుబ్బారావు
94405 29785

ప్రత్యామ్నాయ విధానాలతోనే దీటైన ప్రతిఘటన

ఓటమి నుంచి తీసుకోవాల్సిన పాఠామిదే!


ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో బీజేపీ ఎలా గెలుపొందినదీ అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తేటతెల్లం చేశాయి. మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి మళ్లీ రావడమనేది బీజేపీ సాధించిన ఒక ప్రధాన విజయం. మధ్యలో 15 మాసాల పాటు కాంగ్రెస్ అధికారంలో వున్న సమయాన్ని మినహాయిస్తే దాదాపు రెండు దశాబ్దాల పాటు బీజేపీ మధ్యప్రదేశ్‌ను పాలించింది. శివరాజ్ చౌహాన్ ప్రభుత్వం ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొనడమే కాకుండా కాంగ్రెస్‌కు పోలైన ఓట్ల కన్నా దాదాపు 8 శాతం ఓట్లు ఎక్కువగా (48.55 శాతం) సంపాదించుకోగలిగింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలను బీజేపీ గద్దె దించగలిగింది. ఛత్తీస్‌గఢ్‌లో గత ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం పాలైంది. ఈసారి అక్కడ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వేసినప్పటికీ బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడించగలిగింది. మొత్తంగా 90 సీట్లలో 54 సీట్లను సంపాదించుకోగలిగింది. గత ఎన్నికలతో పోలిస్తే తన ఓట్ల వాటాను 13.3 శాతం పెంచుకుంది.

రాజస్థాన్‌లో, అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం గణనీయమైన సంక్షేమ పథకాలు అనేకం చేపట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో కన్నా మెరుగైన పాలన వుందని కూడా భావించారు. అయినా, కాంగ్రెస్‌ను బీజేపీ పక్కకు నెట్టగలిగింది. పోలింగ్ జరిగిన 199 సీట్లకు గానూ 115 సీట్లను సాధించగలిగింది. బీజేపీ సాధించిన ఈ విజయాన్ని, కాంగ్రెస్ పరాజయాన్ని ఎలా పరిగణనలోకి తీసుకోవాలి? ఈ ఫలితాలకు రాజకీయ విశ్లేషకులు అనేక కారణాలను ఆపాదిస్తున్నారు. అయితే, అన్నింటికంటే ఒకే ఒక్క వాస్తవాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సి వుంది. బీజేపీ విజయం సాధించిన ఈ మూడు రాష్ట్రాల్లోనూ హిందుత్వ ప్రభావంతో ఓటర్లు సంఘటితమయ్యారనేది స్పష్టమవుతోంది. 2019 ఎన్నికల సమయంలో కనిపించినట్లుగా పాన్-హిందూ గుర్తింపును సష్టించడంలో బీజేపీ విజయం సాధించింది. ఇది, ఉత్తర, పశ్చిమ భారతంలో ఇంతకంటే ఎక్కువగానే వుంటుంది.

ఈ వాస్తవాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనడంలో అసక్తత, పైగా ఈ హిందుత్వ సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ఎదుర్కొని, అధిగమించగల ఒక్క సైద్ధాంతిక వేదికను, రాజకీయ కథనాన్ని రూపొందించేందుకు కసరత్తు చేయ పోవడం కాంగ్రెస్ మౌలిక వైఫల్యంగా వుంది. ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, "సైద్ధాంతిక పోరాటం కొనసాగుతుంది." అని వ్యాఖ్యానించారు. కానీ ఇదే అసలైన సమస్యగా వుంది. హిందుత్వకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎక్కడ సైద్ధాంతిక పోరాటం జరుపుతోంది?

పైగా దీనికి విరుద్ధంగా, హిందుత్వ పట్ల మెతక ధోరణి ప్రదర్శిస్తూ వచ్చారు. ఈ మృదు హిందుత్వ ధోరణిని ప్రధానంగా అమలు చేసిన నేత పిపిసి చీఫ్, మధ్యప్రదేశ్ ఎన్నికల పోరులో కాంగ్రెస్‌కు ముందుండి నడిపించిన మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్. హిందుత్వ తురుపు ముక్కను క్రమం తప్పకుండా అనుకరించడంలో, మత దురభిమానం కలిగిన బాబాలు, స్వామిజీలను పెంచి పోషించడంలో ఆర్ఎస్ఎస్-బీజేపీని సైతం పక్కకు నెట్టివేయగల వ్యక్తి. 2019 ఆగస్టులో అయోధ్యలో రామాలయానికి పునాది వేసిన రోజున కాంగ్రెస్ కార్యాలయాలన్నింటిలో హనుమాన్ చాలీసాను పఠించాలంటూ కమల్‌నాథ్ పిలుపిచ్చారు. ఇటీవలే, బజరంగ్ సేనను కాంగ్రెస్‌తో విలీనం చేసిన కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలోనే జరిగింది. హిందూ రాష్ట్రం ఏర్పాటు అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. మధ్యప్రదేశ్‌లో హిందుత్వ సైద్ధాంతిక భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు ఆర్ఎస్ఎస్, సమాజంలోని అన్ని రంగాలు, వర్గాల్లో ఒక పద్ధతి ప్రకారం పనిచేసింది. అక్కడ కాంగ్రెస్ అనుసరించిన వైఖరి గణనీయమైన వర్గాల్లో హిందుత్వ వాదనను మరింత బలోపేతం చేయడానికి మాత్రమే ఉపయోగపడింది.

ఛత్తీస్‌గఢ్‌లో కూడా, ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ తన హిందూ మత గుర్తింపును చాటింపు వేసు కుంటూ, రామ్ వన్ గమన్ పథ్‌ను నిర్మించడం వంటి ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తూ వచ్చారు. ఈ వైఖరి ఫలితంగా, మధ్యప్రదేశ్, ఛత్తీసగఢ్‌లలో ఆర్ఎస్ఎస్, ఇతర హిందుత్వ సంస్థలు సమాజంలోని పలు వర్గాలను మతం వైపునకు పురిగొల్పేలా చేయడానికి, మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడానికి స్వేచ్ఛ కలిగింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో గిరిజనులకు కేటాయించిన సీట్లలో బీజేపీ ప్రధానంగా ప్రయోజనం పొందిందని ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయి. 2018 ఎన్నికల్లో, 76 ఎస్‌టి సీట్లకు గానూ కేవలం 19 సీట్లలోనే బీజేపీ గెలుపొందింది. ఈసారి ఆ సంఖ్య



> తెలంగాణలో కాంగ్రెస్ నిర్ణయాత్మక విజయం రెండు పదవీ కాలాలు పనిచేసిన టీఆర్ఎస్/బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తుడిచి పెట్టడానికి దారితీసింది. నిలకడలేని కె.చంద్రశేఖర రావు నాయకత్వ వ్యవహార శైలే బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమని భావించాల్సి వుంటుంది. ఆయన ఒంటెత్తు పోకడలతో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)కి గల విశిష్టమైన తెలంగాణ గుర్తింపును చేజేతులారా పాడుచేసుకున్నారు. పైగా ఒకపక్క బీఆర్ఎస్ పట్ల తెలంగాణలో అసంతృప్తి పెరుగుతుంటే మరోపక్క పార్టీకి అఖిల భారత స్వభావాన్ని ఆపాదించడం కోసం మహారాష్ట్ర, ఒడిషా, ఇతర చోట్ల తప్పటడుగులు పడ్డాయి. ఆరు మాసాల క్రితం వరకూ కూడా, బీజేపీ పట్టును సాధించుకుంటే బీఆర్ఎస్‌కు ప్రధాన సవాలు దారుగా ఆవిర్భవిస్తుందన్నట్లు కనిపించింది.

44కి పెరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో 29ఎస్‌టి సీట్లకు గానూ బీజేపీ 17 సీట్లను కైవసం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో 47 సీట్లకు గానూ 27 సీట్లలో విజయం సాధించింది. వన్‌వాసి కల్యాణ్ ఆశ్రమం వంటి ఆర్ఎస్ఎస్ సంస్థలు చేపట్టిన ఆదివాసీల హిందూయీకరణ క్రమం నిరంతరంగా కొనసాగడమే గిరిజన ప్రాంతాల్లో బీజేపీ లాభపడడానికి గల కారణాల్లో ఒకటిగా వుంది.

పైగా, ఛత్తీస్‌గఢ్‌లో కొన్ని ప్రాంతాల్లో క్రైస్తవ ఆదివాసీలపై సంఘటిత దాడులు కూడా జరుగుతున్నాయి. క్రైస్తవ ఆదివాసీల హక్కులను కాపాడేందుకు బాఘెల్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. కులగణన నిర్వహిస్తామంటూ కాంగ్రెస్ చేసిన హామీ మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఒబిసిల్లో పెద్దగా ఎలాంటి ప్రభావాన్ని కలిగించలేదని పలువురు పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఒబిసి ప్రాతిపదిక రాజకీయాలు, రాజకీయ పార్టీలు పెద్దగా పెరగలేదన్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇది ఊహించిందే. పైగా, పోలింగ్ అనంతర సర్వేలు చూసినట్లైతే, ఒబిసిల్లో గణనీయమైన వర్గం ఇప్పటికే, పాన్ హిందూ గుర్తింపును మరింత సంఘటితపరచాలని భావిస్తున్న బీజేపీతో వుంది.

హిందూ జాతీయవాద ఓటింగ్ బ్లాక్, బీజేపీకి అంతర్లీన ప్రయోజనాన్ని అందించింది. ఈ బ్లాక్‌కు ఇతర ఓట్లు వచ్చే చర్యలను కలుపుకోవాల్సిన అవసరం వుంది. సంక్షేమ పథకాలు, మధ్యప్రదేశ్‌లో లాడ్లి బెహనా పథకం తరహాలో నగదు బదిలీలు, సూక్ష్మ స్థాయిలో కులాలవారీగా ఎన్నికల ప్రచారం వంటి వాటి ద్వారా లబ్దిదారులందరినీ ఒకటి చేయడం అటువంటి చర్యల్లో ఒకటిగా వుంది. రాజస్థాన్‌లో ఎన్నికల విజయం సాధించడంలో రెండో అంశం చాలా కీలక పాత్ర పోషించింది. కులాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేసేందుకు బీజేపీ అనుసరించిన ప్రక్రియ ఫలితాలను అందించింది.అదీకాకుండా, ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎవరినీ కలుపుకోకుండా ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించడం కూడా ముందు చూపు లేకుండా చేసిన చర్యగా రుజువైంది. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ప్రధాన పోటీ వుండగా, మధ్యప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ వంటి పార్టీలతో, ఇంకా ఇతర చిన్న పార్టీలతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకోడానికి కాంగ్రెస్ తిరస్కరించడం ఈ రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక శక్తులను ఒక చోటకు తీసుకురాకుండా నిరోధించింది.

తెలంగాణలో కాంగ్రెస్ నిర్ణయాత్మక విజయం రెండు పదవీ కాలాలు పనిచేసిన టీఆర్ఎస్/బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తుడిచి పెట్టడానికి దారితీసింది. నిలకడలేని కె.చంద్రశేఖర రావు నాయకత్వ వ్యవహార శైలే బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమని భావించాల్సి వుంటుంది. ఆయన ఒంటెత్తు పోకడలతో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)కి గల విశిష్టమైన తెలంగాణ గుర్తింపును చేజేతులారా పాడుచేసుకున్నారు. పైగా ఒకపక్క బీఆర్ఎస్ పట్ల తెలంగాణలో అసంతృప్తి పెరుగుతుంటే మరోపక్క పార్టీకి అఖిల భారత స్వభావాన్ని ఆపాదించడం కోసం మహారాష్ట్ర, ఒడిషా, ఇతర చోట్ల తప్పటడుగులు పడ్డాయి. ఆరు మాసాల క్రితం వరకూ కూడా, బీజేపీ పట్టును సాధించుకుంటే బీఆర్ఎస్‌కు ప్రధాన సవాలు దారుగా ఆవిర్భవిస్తుందన్నట్లు కనిపించింది.

అయితే, మే మాసంలో కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో మొత్తంగా పరిస్థితి మారిపోయింది. బీఆర్ఎస్ వ్యతిరేక శక్తులన్నింటినీ కాంగ్రెస్ కూడగట్ట నారంభించింది. కాంగ్రెస్ ఇంతటి ఘన విజయాన్ని అందుకునేవరకు ఆ పరిస్థితి కొనసాగింది. అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశమేమంటే బీజేపీ తన పరిస్థితిని గణనీయంగా మెరుగుపరుచుకుంది. 2018లో ఒక సీటు వుండగా, ఇప్పుడు 8సీట్లకు ఎగబాక గలిగింది. ఓటు వాటాను కూడా 7 శాతం నుండి 13.9శాతం వరకు పెంచుకుంది. ఇక మిజోరాంలో మూడు దశాబ్దాల మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) పాలన ముగిసింది. కొత్తగా ఏర్పడిన జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం) విజ యం సాధించింది. అసెంబ్లీలో 40సీట్లకు గానూ 27సీట్లను గెలుచుకుంది. ఎన్‌డిఎలో భాగమైన ఎంఎన్ఎఫ్ మాదిరిగా కాకుండా, తాము ఏ జాతీయ స్థాయి అలయన్స్‌లోనూ చేరేది లేదని జెడ్‌పిఎం ముఖ్యమంత్రి అభ్యర్థి లాల్దుహోమా ప్రకటించారు.

మరికొద్ది మాసాల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇటీవల జరిగిన ఈ మూడు హిందీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించకపోవడం ఇటీవల కాలంలో రెండుసార్లు జరిగింది. 2014, 2019 ఎన్నికల్లో ఇలాగే జరిగింది. కాంగ్రెస్, ఇతర ప్రధాన ప్రతిపక్షాలు ఈ ఓటమి నుండి సరైన గుణపాఠాలను నేర్చుకుని, ప్రత్యామ్నాయ రాజకీయ, సైద్ధాంతిక, ఆర్థిక కూటమిగా తయారయ్యేందుకు, అలాగే బీజేపీ వ్యతిరేక ఓట్లను సమర్థవంతంగా ఒక్కచోటకు చేర్చడానికి సరైన చర్యలు తీసుకోవాల్సి వుంది. అప్పుడే 2024కు అసలైన పోరాటం ఆరంభమవుతుంది.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు


పట్టుకున్న బియ్యం వద్ద తహసీల్దార్, ఎస్సై

నవతెలంగాణ - వీణవంక

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తిరుమల్‌రావు, ఎస్సై ఎండీ ఆసీఫ్ హెచ్చరించారు. మండల కేంద్రం నుండి వేరే ప్రాంతానికి తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల ప్రజల నుండి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు చెప్పారు. మండల కేంద్రానికి చెందిన కడమంచి యాదగిరి, ఉబిది నరేష్, పర్థం అనిల్, పర్థం శ్రీనివాస్ బియ్యాన్ని తరలిస్తుండగా వారి వద్ద నుండి సుమారు 50క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్టు తెలిపారు. కాగా వారిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడులల్లో డీటీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ నాగరాజు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది పురస్కారం అందుకున్న ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్


అవార్డు అందుకుంటున్న రవికుమార్

నవతెలంగాణ - కరీంనగర్

హైదరాబాద్‌లో గ్రేటర్ వరంగల్ జిల్లా ఏఎన్ఎస్ 24 టీవీ ఆధ్వర్యంలో కాకతీయ మహానంది పురస్కార్ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళారంగానికి, సామాజిక సేవలు చేస్తున్న ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్ చేస్తున్న కళా రంగానికి చేస్తున్న సేవలు, సామాజిక సేవలు గుర్తించి మహానంది పురస్కారం రవికుమార్‌కు ఏఎంఎస్ మేనేజింగ్ డైరెక్టర్ అనుమండ్ల నాగరాజు వనపర్తి పద్మ ఆధ్వర్యంలో అందుకున్నారు. అనంతరం బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ భవన్‌లో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా మహానంది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈపీఓ శ్రీనివాసరావు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ తాతాజీ, వేములవాడ ఎక్సైజ్ సర్కిల్ రాము, కరీంనగర్ జిల్లా కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి నగేష్ గౌడ్, సబ్ ఇన్‌స్పెక్టర్ యూనియన్ నాయకులు నుగ్గిళ్ళ కిషన్, ఎక్స్ఛేంజ్ యూనియన్ చైర్మెన్ సుధాకర్ గౌడ్, యూనియన్ నాయకులు తదితరులు ఎక్సైజ్ ఉద్యోగులు రవికుమార్‌ను అభినందించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తూ సామాజిక సేవ కళా రంగం చేస్తున్న రవికుమార్ ఎక్సైజ్ శాఖకు గర్వ కారణమని అన్నారు. నగేష్ గౌడ్ మాట్లాడుతూ.. రవికుమార్‌కు మహానంది పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రవికుమార్ మాట్లాడుతూ.. మహానంది పురస్కారం నాకు మరింత బాధ్యత తెచ్చిపెట్టిందని తెలిపారు.

దూకుడు

పాలనలో మార్క్ చూపేందుకు కొత్త ఎమ్మెల్యేల ఆరాటం

అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టిన ఎమ్మెల్యేలు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం రోజు నుంచి నేటి వరకు తమదైన మార్క్ చూపేందుకు ఆరాటపడుతున్నారు. ప్రభుత్వ శాఖలు, అధికారయంత్రాంగంపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. స్థానిక సమస్యలు, పార్టీ శ్రేణుల ఫిర్యాదులపై దృష్టిసారిస్తున్నారు. ఇప్పటికే గుడ్‌మార్నింగ్ కోరుట్ల పేరుతో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఉదయమే జనం మధ్య తిరుగుతుండగా.. ముంపు గ్రామాలు, సాగునీటి సమస్యలపై చొప్పదండి ఎమ్మెల్యే 'మేడిపల్లి' విస్తృతంగా పర్యటించారు. ఇక తొలి రోజు అసెంబ్లీకి అడుగుపెట్టిన సందర్భంగా సింగరేణి కార్మికుని వేషధారణలో ఆకట్టుకున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ నియోజకవర్గంలో కలియతిరుగుతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఎన్నికైన 13నియోజకవర్గాల్లోని 8 మంది కొత్త ఎమ్మెల్యేలు నియోజకవర్గంపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

- ప్రభుత్వ శాఖలు.. యంత్రాంగంపై పట్టు కోసం ప్రయత్నం
- స్థానిక సమస్యలు, శ్రేణుల ఫిర్యాదులపై దృష్టిసారింపు
- అడిగిన సమాచారం ఇచ్చేందుకు అధికారుల అప్రమత్తం
- 'గుడ్ మార్నింగ్ కోరుట్ల' పేరుతో డాక్టర్ సంజయ్ పర్యటన
- ముంపు గ్రామాలకు భరోసానిచ్చిన చొప్పదండి ఎమ్మెల్యే 'మేడిపల్లి'
- 'నారాయణపూర్'కు నీటివిడుదలకు సత్వర ఆదేశాలు
- 'గని' కార్మికుని వేషధారణతో తొలిరోజే ఆకట్టుకున్న మక్కాన్‌సింగ్

కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గంలో వచ్చే ఐదేండ్లలో స్పెషల్ మార్క్ చూపేందుకు బిజీ అయ్యారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టిసారించారు. రాష్ట్ర సర్కారు పథకాలతోపాటు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూనే గత సర్కారులోని ఎమ్మెల్యేల పని తీరు, అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్నారు. ప్రధానంగా తమ వద్దకు వస్తున్న సమస్యలు, ఇంతకు ముందు తమ దృష్టిలో ఉన్న వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ క్రమంలో కావాల్సిన సమాచారం కోసం అధికారులను ఆదేశిస్తుండగా.. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ఇదే సమయంలో గతంలో విపక్షంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యేలకు సరిగా స్పందించని అధికారుల్లో గుబులు మొదలైంది. గత ఎమ్మెల్యేలతో సన్నిహితంగా మెదిలిన వారి చిట్టా తయారు చేస్తుండగా.. మారిన ప్రభుత్వంలో తమ ఉద్యోగాలూ బదిలీ అవుతాయనే చర్చ సాగుతోంది. ప్రధానంగా పోలీసు, రెవెన్యూ, పంచాయతీ శాఖలతోపాటు నియోజకవర్గంలోని మున్సిపల్ అధికారులపైనే తమ శ్రేణుల నుంచి ఫిర్యాదులు ఉన్నాయని చెప్పొచ్చు. దీంతోపాటు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు, నిధుల ఖర్చుపైనా సమీక్షించేందుకు కొత్త ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు. అయితే కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిలో కోరుట్ల, హుజూరాబాద్ శాసనసభ్యులు డాక్టర్ సంజయ్, పాడికౌశిక్‌రెడ్డి తప్ప మిగిలిన వేములవాడ, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, హుస్నాబాద్, మానకొండూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గతంలో ప్రతిపక్ష పాత్ర పోషించి విధానపరమైన లోపాలు ఎత్తిచూపిన నాయకులే కావడం గమనార్హం. ఇక వచ్చే ఐదేండ్లలో స్థానికంగా పట్టు పెంచుకుని ముందుకు సాగేందుకు ఆరాటపడుతున్నారు.

'గుడ్ మార్నింగ్ కోరుట్ల'తో...


కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల జిల్లాలోని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'గుడ్ మార్నింగ్ కోరుట్ల' పేరుతో ఉదయం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలో ఈనెల 12న పర్యటించిన ఆయన తన కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ప్రకటించారు. రోజూ ఒక గ్రామంలో పర్యటించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

నియోజకవర్గంలో కలియతిరుగుతూ....


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రెండుసార్లు ఓడి ఇటీవల ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన విషయం తెలిసిందే. దీంతో రెండుపర్యాయాలు నియోజకవర్గం సమస్యలపై నిరంతరం పోరాడిన విపక్ష నేతల్లో ఒకరిగా పేరున్న నేతగానే చెప్పవచ్చు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణం స్వీకారం చేసిన మర్నాడు నుంచి నియోజకవర్గంలో కలియతిరుగుతున్నారు. కరీంనగర్ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన మేడిపల్లి ఎల్లంపల్లిప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కయు నీటి విడుదల చేసి పంటలకు నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండేండ్ల క్రితం భారీ వర్షాలకు కట్టతెగిపోయి మరమ్మతుకు నోచుకోని గంగాధర ఎల్లమ్మ చెరువును పునరుద్ధరించాలని చెప్పారు. ఇలా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో యాసంగి పంటను సాగు చేసేందుకు సిద్ధమైన రైతులకు సరిపడా నీటి సరఫరా చేయాలని తెలిపారు. ఇదే సమయంలో ఆర్టీసీ అధికారులతోనూ మాట్లాడుతూ గంగాధర, రామడుగు మండలాల్లోని పలు గ్రామాల్లో బస్సులు నడపాలని ఆదేశించారు.

వాహనదారులకు మరింత మెరుగైన సేవలు

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్



నవతెలంగాణ - తిమ్మాపూర్ : వాహనదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ అధికారులకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ ఆదేశించారు. రవాణా శాఖ కార్యాలయాలలోని హెల్ప్‌డెస్క్ లను మరింత పటిష్ట పరచాలని, టి ఆప్ ఫోలియో ద్వారా జరిగే ఆన్ లైన్ సేవలపై వాహన దారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాల వారీగా, ఎంవిఐ వారిగా సాధించిన ఆదాయ లక్ష్యాన్ని సమీక్షించారు. కరీంనగర్ జిల్లా రూ.90కోట్లా 81లక్షలు, పెద్దపల్లి జిల్లా 50కోట్లా 50లక్షలు, జగిత్యాల జిల్లా 37కోట్లా 53లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లా 24కోట్లా 4లక్షలు మొత్తం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రూ.202కోట్లా 88లక్షలు ఆదాయాన్ని సాధించినట్టు తెలిపారు. సొంత భవనాలు లేని కార్యాలయ అధికారులు సంబంధిత కలెక్టర్‌ను సంప్రదించి స్థలం పొందేలా కృషిచేయాలని సూచించారు. రహదారి భద్రతపై రాబోయే రోజుల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేయాలన్నారు. వాహనదారులు త్రైమాసిక పన్నులు చెల్లించాలని, లేని పక్షంలో తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానా విధించడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాలుగు జిల్లాల రవాణా శాఖ అధికారులు రంగారావు, కొండల్‌రావు, నాగలక్ష్మి, వంశీధర్, గౌస్ పాషా, మసూద్‌అలీ, సిరాజుర్ రహ్మాన్, అల్లె శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, భీంసింగ్, రవి కుమార్, రంజిత్, వెంకటరమణ, కిశోర్, చంద్రరెడ్డి, రజనిదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వార్డెన్లను సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

నవతెలంగాణ - కరీంనగర్

నిబంధనలు పాటించని ఎస్సీ సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లను సస్పెండ్ చేయాలని, ఎస్సీ డీడీ సంక్షేమ హాస్టల్స్‌ను పర్యవేక్షణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. బుధవారం నగరంలో మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు కనీసం సమయ పాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు మెనూ పాటించడం లేదని తెలిపారు. హాస్టల్‌లో కనీసం స్కావెంజర్ లేక మరుగుదొడ్లను శుభ్రం చేయక విద్యార్థులను అనేక ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఇంతవరకు కూడా దుప్పట్లు పంపిణీ చేయలేదని వారు తెలిపారు. దోమతెరలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రస్తుతం చలికాలం కనుక విద్యార్థులకు గ్రీజర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెనూ పాటించి పౌష్టికాహారం పెట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే హాస్టల్‌లోని విద్యార్థులతో డీడీ కార్యాలయం ముట్టడి చేసి సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వార్డెన్లను సస్పెండ్ చేసేంత వరకు పోరాటాలకు సన్నద్ధం మవుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తిప్పారపు రోహిత్, వినీషా, నాయకులు రత్నం సురేష్, ప్రవీణ్, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు పారమిత విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ - కరీంనగర్

నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి డి.ప్రణవ్ తేజ, 8వ తరగతి చదువుతున్న పి.మధుహాసిని అండర్-14 బాల బాలికల విభాగంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్ జిల్లా తొర్రూరులో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలలో ప్రణవ్ తేజ, మధుహాసిని అత్యధిక ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించింది. జాతీయస్థాయి పోటీలలో డిసెంబర్ 14 నుంచి 16 వరకు గుజరాత్ రాష్ట్రంలోని నందియాడ్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, సమన్వయకర్తలు, పీఈటీ వేణు, రాజశేఖర్, సాగర్ అభినందించారు.

సబ్ రిజిస్ట్రార్‌ను సన్మానించిన దస్తావేజు లేఖరులు

నవతెలంగాణ - తిమ్మాపూర్



తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన ఎస్.రాజేష్‌ను తిమ్మాపూర్ దస్తావేజు లేఖరులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు దుర్సెట్టి రమేష్, ముసవీర్, నాగరాజు, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, జనార్ధన్, చంద్రమౌళి, మక్బుద్ అలి, రాజకుమార్, రంగు సుమన్, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వికలాంగులు స్ఫూర్తి ప్రదాతలు

కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



నవతెలంగాణ - కరీంనగర్

సమాజంలో వికలాంగులు సాధారణ పౌరులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మహిళా, శిశ, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి వికలాంగుల ఆటల పోటీలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని అవయవాలు సక్రమంగా పని చేసే వ్యక్తులు విజయాలను సాధిస్తే, ప్రతికూలతలను అధిగమిస్తూ అసమాన విజయాలను సాధించే వికలాంగులు ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని అన్నారు. వికలాంగుల తల్లిదండ్రుల కన్న టీచర్లు, గార్డియన్లు పిల్లలకు తోడుగా నిలిచి వారికి సకాలంలో సరైన ప్రోత్సాహాన్ని అందిస్తూ ముందుకు నడిపిస్తున్న వారందరిని కలెక్టర్ అభినందించారు. జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొన్న వారందరు రాష్ట్ర స్థాయిలో కూడా అద్భుతమైన విజయాలను సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. అంధులు ఆడే చెస్ పోటీలను వీక్షించిన కలెక్టర్ వారి ఆటతీరును తన చరవాణిలో వీడియో తీసుకోవడంతో పాటు



వారి ప్రతిభను అభినందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి వికలాంగుల ఆటల పోటీలలో శారీరక వైకల్య సమస్యలను అధిగమించి ఉత్సాహంగా పాల్గొంటున్న వారందరిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, క్రీడాభివృద్ధి అధికారి రాజవీర్, డీఆర్డీఓ శ్రీలత, వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద, కమల, ఏసీడీపీవోలు సౌందర్య, అరవింద, వికలాంగుల సంఘాల బాధ్యులు జక్కం సంపత్, వెన్నం శ్రీనివాస్, కొత్తూరు స్వామి, ఐలి లింగమూర్తి, శ్రీవాణి, మంచాల రాజేందర్, కైరి అంజయ్య గౌడ్, జాపాల బిక్షపతి పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన రవాణాశాఖ అధికారులు

నవతెలంగాణ - తిమ్మాపూర్


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవాణా శాఖ అధికారులు

తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తొలిసారి కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన పొన్నం ప్రభాకర్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల రవాణా శాఖా అధికారులు రంగారావు, కొండల్‌రావు, నాగలక్ష్మి, వంశీధర్, గౌస్ పాషా, మసూద్ అలీ, అల్లె శ్రీనివాస్, ఉమామహేశ్వర్‌రావు, సిరాజుర్ రహ్మాన్, రవి కుమార్, భీం సింగ్, వెంకట రమణ, రంజిత్, కిశోర్ చంద్రరెడ్డి, రజనీ దేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అవార్డు అందుకున్న రెనే హాస్పిటల్

నవతెలంగాణ-కరీంనగర్


అవార్డు అందుకుంటున్న రెనే హాస్పిటల్ చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి

వరల్డ్ వైడ్ అచీవర్స్ న్యూఢిల్లీ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన హెల్త్ కేర్ అచ్చివర్స్ అవార్డ్స్-2023 కార్యక్రమంలో బెస్ట్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్‌గా కరీంనగర్‌లోని రెనే హాస్పిటల్ అవార్డు అందుకుంది. న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ అవార్డును కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎస్‌పి సింగ్ బాగే చేతుల మీదుగా రెనే హాస్పిటల్ చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి అందుకున్నారు. వరల్డ్ ఆచివర్స్ సంస్థ నిర్వహించే ఈ కార్యక్రమంలో ఈసారి బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ విభాగంలో కరీంనగర్ రెనే హాస్పిటల్‌ను ఎంపిక చేసినందుకు ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉన్నతమైన వైద్య సేవలను అందించాలన్న మా లక్ష్యానికి ఇలాంటి అవార్డులు ఎంతో ప్రోత్సాహాన్ని కలుగజేస్తాయని తెలిపారు. ఈ అవార్డు సాధించడంలో తోడ్పడిన రెనే హాస్పిటల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాంఘీక సంక్షేమ మంత్రి రాందాస్ అతవాలే, న్యూఢిల్లీ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్, అహ్మదాబాద్ (వెస్ట్) పార్లమెంట్ సభ్యుడు కీరిట్ ప్రేమ్ జీ భాయ్ సోలంకి, వరల్డ్ అచివర్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తేజస్ విద్యార్థులు



విద్యార్థులతో చైర్మెన్

నవతెలంగాణ - కొత్తపల్లి : కరీంనగర్‌లోని లయోలా కళాశాలలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ సెలక్షన్‌లో కొత్తపల్లిలోని 'తేజస్ జూనియర్ కళాశాల' విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ కళాశాల చైర్మెన్ సీహెచ్.సతీష్ రావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కే.శ్రీకర్ అండర్-19, ఎస్.ఓం ప్రసాద్, ఎండీ.అలిమొద్దీన్, ఎం.సాయి కిరణ్ లను, ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విజయం



నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : శాతవాహన విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలలో మొత్తం పది కళాశాలల జట్లు పాల్గొన్నాయి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జట్టు తంగళ్ళపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల జట్టుపై 25-14 తేడాతో గెలిచింది. ఈ సందర్భంగా శాతవాహన విశ్వవిద్యాలయ మహిళా జట్టును అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక అయినా విద్యార్థుల పేర్లను కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ తెలిపారు. విజేతగా నిలిచిన జట్టును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీధర్‌రావు, డాక్టర్ బి.రజనీదేవి, కే.సతీష్ కుమార్, బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

దళారి మూవీ పోస్టర్ విడుదల



నవతెలంగాణ - గన్నేరువరం : దళారి చిత్రం ఈ నెల 15న విడుదల కానున్న సందర్భంగా మండలంలోని కాసీంపేట శ్రీ మానసదేవి ఆలయంలో ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయిశర్మ, సర్పంచ్ గంప మల్లేశ్వరివెంకన్న ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. దళారి మూవీ సక్సెస్ కావాలని చిత్రంలో నటించిన యాక్టర్ రాజ్ కోటి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాకు చెందిన దళారి మూవీ డైరెక్టర్ కాచిడి గోపాల్‌రెడ్డి, ప్రొడ్యూసర్ ఎడవల్లి వెంకటరెడ్డి, ఆకృతి క్రియేషన్ నిర్మించిన దళారి చిత్రాన్ని మండల ప్రజలు చూడాలని, ఈ సినిమాలో మండల కేంద్రానికి చెందిన రాజ్ కోటి నటించడం చాలా సంతోషకరమని గంప వెంకన్న అన్నారు. సినిమాకి లైన్ ప్రొడ్యూసర్‌గా అనిల్‌రెడ్డి చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తేళ్ల రవీందర్, మ్యాదరి శ్రీనివాస్, రాజు, ఆంజనేయులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మగ్గం శిక్షణ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ -కొడిమ్యాల



మండల కేంద్రంలో నాబార్డ్ సహకారంతో ఐఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత మగ్గం శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం ఉంటుందని, శిక్షణ పూర్తయిన వెంటనే సరిఫికేట్‌తో పాటు 15 రోజులకు కలిపి రూ.750 స్టైఫండ్ ఇస్తున్నట్టు తెలిపారు. జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల ఉన్న సభ్యులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల సర్పంచ్ ఏలేటి మమత నరసింహారెడ్డి, పర్లపల్లి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు జమ్మలపూరి రాజేశ్వరి,సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనర్సిం గారావు, సెర్ప్ అదనపు డిఆర్డిఓ సుధీర్ కుమార్ , జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు మల్లేశం ,వెంకటేష్, విజయభారతి, కొడిమ్యాల మండల ఇన్‌చార్జి ఏపీఎం రాజు,సీసీలు పద్మ,శ్రీనివాస, వీరకుమార్, స్వరూప పాల్గొన్నారు.

సమ్మెతో నిలిచిన తపాలా సేవలు



నిరసన తెలుపుతున్న తపాల ఉద్యోగులు

నవతెలంగాణ-మంథని

గ్రామీణ తపాలా ఉద్యోగులు (జీడీఎస్) తమ సమస్యల సాధనకు బుధవారం సమ్మె బాట పట్టారు. ఫలితంగా తపాలా సేవలు నిలిచాయి. గతంలోనూ ప్రభుత్వ పరంగా ఇచ్చిన కొన్ని హామీల్లోనూ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోక పోవడంతో తిరిగి సమ్మెకు పూనుకున్నారు. మంథని తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులు సమ్మెకు దిగారు. తమ సమస్యలు అయిన సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని, 8 గంటల పని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా 12/24/36 అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు, ఉద్యోగులకు రూ. 5లక్షల ఇన్సూరెన్స్, రూ.5లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని వారు కోరారు. ముఖ్యంగా కమలేశ్ చందర్ కమిటీ సిఫారసు అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తదితర డిమాండ్లతో తపాలా ఉద్యోగులు నిరసనకు దిగారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ ఐకాస కమిటీగా ఏర్పడి నిరవధిక సమ్మెకు దిగాయి. ఈ కార్యక్రమంలో ఏఐడీజీఎస్‌యూ సెక్రటరీ కుడుదుల కిష్టయ్య, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాజీపేట్‌లో క్షుద్ర పూజల కలకలం

నవతెలంగాణ-రాయికల్



శాస్త్ర, సాంకేతిక రంగాలను అందిపు చ్చుకోవడంలో ప్రపంచం ముందుకు సాగుతున్న తరుణంలో కొంతమంది క్షుద్ర పూజలు చేయడం కలకలం రేపుతుంది. గ్రామాల్లో మూఢనమ్మకాలు మాత్రం ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. క్షుద్ర పూజల పేరుతో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలోని మామిడిపల్లి లక్ష్మణ్ ఇంటి వాకిట్లో మంగళవారం రాత్రి క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. .లక్ష్మణ్ మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి సమీప గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటి వాకిట్లో అడుగుపెట్టగానే తనకాలి చెప్పు లోతుగా వెళ్లడాన్ని గమనించిన లక్ష్మణ్ కట్టేతో అటు ఇటు మట్టిని పెకిలించి చూడగా ఓ కవర్లో నల్లటి బట్టలో ఏదోపెట్టి కట్టినట్లు కనబడడంతో బయటకు తీసి చూడగా ఒక నిమ్మకాయకు గుండు పిన్నులు గుచ్చి,రెండు బొమ్మలు, గాజులు, ఖర్జూరాలు, కుడుక, మల్లెపూలు నల్లటి వస్త్రంలో చుట్టి మంత్ర,తంత్రాలు చేసినట్లుగా ఆనవాళ్లు కనిపించడంతో భయాందోళనకు గురైన లక్ష్మణ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గతంలోనూ గ్రామానికి గత్తర సోకిందని, గ్రామస్తులు జ్వరంతో మరణిస్తున్నారని, గ్రామ నడిబొడ్డున క్షుద్ర పూజలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఘటనపై అధికారులు విచారణ జరిపి మూఢనమ్మకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కి విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటి అకాడమీకి చెందిన 8వ తరగతి విద్యార్థిని సంజన ఈనెల 8 నుంచి 12 వరకు హైదరాబాద్‌లోని సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్‌లో నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ స్టేట్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించింది. అలాగే వచ్చే ఏడాది జనవరి 8 నుంచి 13వరకు రాజస్థాన్‌లోని బర్మార్‌లో నిర్వహించే 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌కి ఎంపికైనట్టు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపిక అయిన విద్యార్థిని సంజనను పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ రావు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థినుల విజ్ఞాన విహార యాత్ర

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. వైజాగ్ బీచ్, కైలాస గిరి, అరకు కనుమల ప్రకృతి అందాలు, బొర్రా గుహలు, సింహా చలం, అన్నవరం ఆలయాన్ని సందర్శించారు. చదువుతో పాటు, పర్యాటక ప్రాంతాల విజ్ఞానం తెలుసుకొని మానసికొల్లాసం పొందారని కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్ కుమార్ తెలిపారు.

వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రిగా అవకాశం కల్పిస్తే అట్టడుగు వర్గాలకు న్యాయం చేస్తారని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ అన్నారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడూరు శ్రీమన్నారాయణతో పాటు సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కందుకూరి సత్యనారాయణ, యువజన నాయకులు సందీప్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా మార్చాలి



వినతి పత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని కల్లూరు రోడ్డులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది మాట్లాడుతూ.. ప్రజలు పబ్లిక్ టాయిలెట్‌లను ఉపయోగించుకొని పట్టణాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా మార్చాలని కోరామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్

సుల్తానాబాద్ మండలంలోని చిన్న బొంకూర్ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను సర్పంచ్ ఆర్నకొండ రాజు బుధవారం అందజేశారు.

ఎమ్మెల్యేని కలిసిన డీఎస్పీ

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మురుగు కాలువను శుభ్రం చేసేదెప్పుడు.?

నవతెలంగాణ-రాయికల్



పట్టణంలోని 9వ వార్డులో గతకొన్ని రోజులుగా మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో చెత్త, చెదారంతో నిండిన మురుగు వల్ల డ్రైనేజీలు దుర్గం దాన్ని వేద జల్లడంతో పాటు దోమల బెడద తప్పడం లేదని స్థానికులు వాపోతు న్నారు. పాలకులు, అధికారులు స్పందించి మురికి కాలువల్లోని చెత్త, చెదారాన్ని తొలగిం చాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా చెత్త డబ్బాలు

- అంచనలకు మించి కొనుగోలు
- రాయికల్ ఫిల్టర్ బెడ్‌లో పడేసిన చెత్త సేకరణ డబ్బాలు
- సుమారు రూ.6 లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండి



నవతెలంగాణ-రాయికల్

ఇంటితోపాటు పరిసరాల శుభ్రత కోసం తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేయాలని, చెత్తసేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు గత ప్రభుత్వం గ్రామాల, పట్టణాల వారిగా తడి, పొడి చెత్త డబ్బాల ఇంటింటి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాయికల్ పట్టణంలోని ఫిల్టర్ బెడ్డులో పంపిణీ చేయగా మిగిలిన చెత్త డబ్బాలను పడేశారు. అధికారుల ప్రణాళిక లోపంతో రెండుసార్లు చెత్త డబ్బాలను కొనుగోలు చేయడం ద్వారా వాటిని ఫిల్టర్ బెడ్డులో నిరుపయోగంగా పడేసి ప్రభుత్వ ఆదాయాన్ని వృథా చేస్తున్నారని పలువులు పేర్కొన్నారు.

కొనుగోళ్ల సమయంలో విధుల్లో చేరలేదు

చెత్త డబ్బాల కొనుగోళ్ళు,వెచ్చించిన నిధుల వివరాలను గురించి మున్సిపల్ మేనేజర్ వెంకటిని నవతెలంగణ వివరణ కోరగా తాను అపుడు విధుల్లోకి చేరలేదని, పంపిణీ చేయగా మిగిలిన చెత్త డబ్బాలు దాచేందుకు స్థలం లేకపోవడంతో ఫిల్టర్ బెడ్‌లో ఉంచినట్టు తెలిపారు.

దబ్బాలను చెత్తలో వేయకుండా పంపిణీ చేయాలి



పట్టణంలోని కొన్ని వార్డులలో చెత్త డబ్బాలు పంపిణీ చేయలేదు. కానీ అధికారులు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఇలా చెత్త డబ్బాలను ఫిల్టర్ బెడ్‌లో మూలాన పడేయడం వల్ల కొన్ని రోజులకు ప్లాటిక్ డబ్బాలు నాణ్యత తగ్గిపోయి పగుళ్ళు ఏర్పడి ఇవి కూడా చెత్తలో కలిసి డంపింగ్ యార్డుకు తరలించే బదులుగా ప్రతి ఇంటికి డబ్బాలు అందజేయాలి.

-(కాసవేణి రాజేష్-గ్రామస్తుడు)

అంచనాలకు మించి కొనుగోళ్లు



పట్టణంలో మొదటి విడతలో 4200 చెత్త డబ్బాలను పంపిణి చేశారు. సుమారు 800 డబ్బాలు సరి పోకపోవడంతో అధికారులు మరో 4200 డబ్బాలకు ఆర్డర్ చేశారు. రెండవ విడతలో పంపిణి చేయగా మిగిలిన డబ్బాలను అప్పుడే కాం ట్రాక్టర్‌కు తిరిగిపంపితే నిధులు వృథా అవ్వకుండా ఉండేది. ప్రస్తుతం మిగిలిన డబ్బాలను నిరుపయోగంగా ఉంచారు. పట్టణ ప్రజలు ఎంతో కష్టపడి పన్నులు కడితే అధికారులు నిర్లక్ష్య ధోరణితో లక్షల సొమ్ము ఇలా వృథా చేయడం సరికాదు.

-11వ వార్డు కౌన్సిలర్-మ్యాకల అనురాధ)

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటరు జాబితా

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లిటౌన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజ్మమిల్‌ఖాన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కట్టుదిట్టంగా ఓటరు జాబితా సవరణ చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జనవరి 1, 2024 ప్రామాణికంగా తీసుకుని 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఓటరు జాబితా సవరణ 2024కు ముందు పోలింగ్ కేంద్రంలో 1450 కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా పోలింగ్ కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురైతే వాటికి సంబంధించి సంపూర్ణ సమాచారం అందించాలని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఓటరు జాబితా సవరణ 2024లో భాగంగా జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, జనవరి 22 వరకు సదరు జాబితాపై అభ్యంతరాలను, నూతన ఓటరు దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 2 లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రతినిధి శశిభూషణ్, బీజేపీ ప్రతినిధి పొలసాని సంపత్‌రావు, బీఎస్పీ ప్రతినిధి ఆర్.శారద, టీడీపీ ప్రతినిధి అక్కపాక తిరుపతి, బీఆర్‌ఎస్ ప్రతినిధి ఉప్పు రాజ్ కుమార్, సీపీఐ(ఎం) ప్రతినిధి సిపెల్లి రవీందర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతి బుధవారం ప్రభుత్వ విద్యాసంస్థల తనిఖీ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఉత్సాహపరుస్తూ పాఠశాలల్లో విద్య, భోజన వసతులను పరిశీలించేందుకు లంచ్ అండ్ లెర్న్ బుధవారం కార్యక్రమాన్ని రూపొందించామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం రంగంపల్లిలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో పర్యటించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థినీలతో కలిసి లైన్ లో నిలబడి మధ్యాహ్న భోజనం చేశారు.

జీవన్‌రెడ్డిని కలిసిన పీఆర్టీయూ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని జగిత్యాల కేంద్రంలో పీఆర్టీయూ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాళ్ళ అమర్ నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీని కోరారు. జీవన్‌రెడ్డి మాట్లాడూత.. గత ప్రభుత్వ హయంలో విద్యావవస్థను విస్మరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే కాలంలో విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చేపట్టే ఉన్నతి, తొలిమెట్టు లాంటి కార్యక్రమాలపై సమీక్ష చేసి చర్యలు చేపడుతుందన్నారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు త్వరలోనే ఒక కమిటీ వేస్తుందని చెప్పారు. జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు తప్ప కుండా న్యాయం చేస్తామని, పాత 10 ఉమ్మడి జిల్లాలను 10 జోన్లుగా ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. అలాగే ఉద్యోగి స్థానికతకు తాము చదువుకున్న 1 నుంచి 7 తరగతులను ప్రామాణికంగా కాకుండా, 4,10 తరగతులను ప్రామాణికంగా తీసుకునే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మానస ఎక్సెలెన్స్‌లో సైన్స్ ఫెయిర్ మేనియా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జిల్లా కేంద్రంలోని మానస ఎక్సెన్స్‌లో 6,7,8వ తరగతులకు చెందిన విద్యార్థులు 505 రకాల ఎగ్జిబిట్స్‌తో ఘనంగా "సైన్స్ ఫ్యూజన్ ఫిస్టా డిసెంబర్ 2023' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఈవో జి.గాయత్రి, ఎన్‌సీఎస్‌ఈ అకడమిక్ కో ఆర్డినేటర్ ఏమ్.రాజశేఖర్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం వలన విద్యార్థులలో దాగి ఉన్న అంతర్గత సృజనాత్మకతను, హేతుబద్ధ ఆలోచనలను వెలికి తీయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సూక్ష్మ నీటి పారుదల, మానవ పరిణామం, ఆయుర్వేద ప్రాముఖ్యత, సూర్య, చంద్ర గ్రహణాలు అపోహలు నిజాలు, కాలాలు వాటి ప్రాముఖ్యత, పాస్కల్స్ సూత్రం దాని అనువర్తనాలు, న్యూటన్ సూత్రం యొక్క ఉపయోగాలు మొదలగు వాటిపై తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజిత రావు, డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికారావు, సుమన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .

పెద్దపల్లి ఎమ్మెల్యేకు అర్చకుల ఆశీర్వదం

నవతెలంగాణ-సుల్తానాబాద్‌రూరల్

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావును నియోజకవర్గ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేకు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగని సరయ్య గౌడ్, తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్ శర్మ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నవీన్ శర్మ, కాండూరి వాసు, పర్వతగిరి గురుమూర్తి, కాండూరి దామో దర చార్యులు, శిరంగం వెంకటచారి, వెంకటేశ్వర శర్మ, భాస్కర శర్మ, సంతోష్ శర్మ, రమేష్ శర్మ, రాజు శర్మ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బుగ్గారం



పరామర్శిస్తున్న నాయకులు

బుగ్గారం మండల కేంద్రానికి చెందిన కప్పల సంతోష్, కప్పల పోషన్న ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. వారి కుటుంబాన్ని పరామర్శి రూ.5వేల ఆర్థిక సాయం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దనవేణి శంకర్, మాజీ సర్పంచ్ మసర్తి రాజిరెడ్డి,మాజీ ఎంపీటీసీ నగునూరి రామగౌడ్, గ్రామ శాఖ కొడిమ్యాల రాజన్న,సిగిరి అంజిత్ కుమార్, తాడేపు లింగన్న,రెంటం శ్రీధర్,భారతపు మహేష్,నగునూరి నర్సగౌడ్, దసర్తి పోసన్న, నక్క శంకర్,నగునూరి తిరుపతి,వినయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సందర్శించి వాటర్ గీడ్ అధికారులతో సమీక్షించారు. అంతకుముందు వాటర్ గ్రిడ్ ద్వారా ఎక్కడెక్కడికి నీటి సరఫరా జరుగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ గ్రిడ్ ప్లాంటును ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పడుతున్న చిన్న చిన్న సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కముటం భారతి రమేష్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, నాయకులు నేమూరి సత్యనారాయణ, కంఠం రమేష్, మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య, దేశెట్టి జీవన్, ఆరేళ్ల రాజాగౌడ్, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-కథలాపూర్

వేములవాడ ఎమ్మెల్యేగా ఎన్నిక మొదటి సారి మండలానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కలిగోట నుంచి మండల కేంద్రం వరకు భారీ ర్యాలీ తీసి మండల కేంద్రంలో గజ మాలతో స్వాగతం పలికారు. అనంతరం పెగ్గర్ల గ్రామంలో దేవ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యప్ప పడపూజ, అన్నదానం కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు ఎండి అజీమ్, నాయకులు కల్లేడ గంగాధర్, శ్రీహరి, లింగంగౌడ్, గడ్డం స్వామిరెడ్డి, వాకిటి రాజరెడ్డి, చింతకుంట సర్పంచ్ కూన సులోచన శ్రీనివాస్, చారి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉపాధ్యాయులు



వినతి పత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కథలాపూర్

వేములవాడ ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటి సారి మండల కేంద్రానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు టీఎస్ యూటీఎఫ్ జిల్లా, మండల కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తిరుకోవెలా శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ కలిసి ఉపాధ్యాయులకు రాల్సిన డీఏ, పీఆర్‌సీ బకా యిల విడుదల, సీపీఎస్ రద్దు, పదోన్నతులు, బదిలీలు చేపట్టేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాలిద్ పాషా, ఉడుగుల వెంకటస్వామి, మల్లేశం, పూర్ణ, నాగేశ్వర్ తది తరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగును తొలి దశలో నివారించాలి



మొక్క జొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నవతెలంగాణ- కథలాపూర్

మండలంలో మొక్కజొన్న, పెసరు, వరి నారుమడి వేసినప్పుడు కత్తెర పురుగులు ఆకులను చీల్చి మొక్కను నాశనం చేశాయని వాటిని తుది దశలో నివారించాలని వ్యవసాయ అధికారి యోగిత తెలిపారు. మండలంలోని కథలాపూర్ గ్రామంలో మొక్కజొన్న పంటను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కత్తెర పురుగులు సోకిన ఆకులలో రంధ్రాలు ఏర్పడు తాయని, నివారణకు ఎకరాలకు 10 కిలోల తౌడు, 2కిలోల బెల్లం, కలిపి ఒక రోజు పులింపించి మరుసటి రోజు విశ్రమన్ని 3 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి. దీని ద్వారా కత్తెర పురుగు నివారించవచ్చు అని చెప్పారు. ఆమె వెంట ఏఈఓ వినీత సుష్మా శీ షమీనా వైష్ణవి, రైతులు పాల్గొన్నారు .

సదాసీదాగా సర్వసభ్య సమావేశం




మాట్లాడుతున్న ఎంపీపీ బాదినేని రాజమణి

నవతెలంగాణ-బుగ్గారం

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాదినేని రాజమణి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం సదాసీదాగా జరిగింది. గత సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సైతం పరిష్కరించకపోవడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెల్గొండ సర్పంచ్ గాదే తిరుపతి మాట్లాడుతూ.. గ్రామంలోని 623 సర్వే నెంబర్‌లో గల సుమారుగా 350 ఎకరాల భూమి కబ్జాకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా మద్దునూర్ సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ.. కరోనా సమయం నుంచి ఇబ్బందులు పడుతున్నామని, మరో 6 నెలలు పదవి కాలం పొడిగించాలని కోరుతూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీడీవో తిరుపతి, సీనియర్ అసిస్టెంట్‌రాణి, మండల కో ఆప్షన్ నెంబర్ అబ్దుల్ రెహమాన్,మండల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

నవతెలంగాణ-కోరుట్ల



తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనీల్, ఎంపీపీ తోట నారాయణ, మాదాపూర్ సర్పంచ్ దారిశెట్టి రాజేష్, కౌన్సిలర్‌లు, మోర్తాడ్ లక్ష్మినారాయణ, నాయకులు సజ్జు, గుడ్ల మనోహర్, గ్రామాల సర్పంచ్‌లు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

తుప్పు ట్రాక్టర్.. తప్పు ఎవరిదో?


నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్

- సొసైటీలకు నష్టం..
- రైతులకు చేకూరని ప్రయోజనం

నవతెలంగాణ - చందుర్తి

సొసైటీ అంటే రైతుల అవసరాల సేవలో పనిచేసేది. అందులో భాగంగా రైతుల సేవలు దృష్టిలో పెట్టుకొని ఒక వైపు రైతు సేవతోపాటు సొసైటీ ఆర్థికంగా ఎదగడానికి 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సొసైటీలకు ఉమ్మడి జిల్లలో ఎనిమిది ట్రాక్టర్లను అందించింది. అందులో చందుర్తి సొసైటీకి రూ.5లక్షలతో ట్రాక్టర్‌ను అందించింది. కానీ ఆ ట్రాక్టర్లు నిరుపయోగంగా మూలనపడి తుప్పు పట్టిపోతున్నాయి.

ట్రాక్టర్‌తో రైతులకు ప్రయోజనాలు

సొసైటీ పరిధిలోని రైతులకు ఎరువులను సరఫరా చేసి రైతుల వద్ద అద్దె తీసుకోవాలి, మరోవైపు వ్యవసాయ సాగు చేసుకోవడానికి దుక్కి దున్నడం కోసం రైతులకు కిరాయి ఇవ్వాలి. రైతుల వద్ద వచ్చిన డబ్బులను సొసైటీలో జమ చేయాలి. ఇలా సంఘాలు అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుంది. కానీ కొందరు గతంలో ట్రాక్టర్‌ను కిరాయికి తీసుకెళ్లి రెండు సంవత్సరాలు వ్యవసాయ పనులకు వాడుకొని రూ.2లక్షల వరకు అద్దె ఎగనామం పెట్టినాట్లుగా సొసైటీ సభ్యులు తెలిపారు. దీంతో సొసైటీలకు భారీగా నష్టం వాటిల్లింది. ఏది ఏమైనా తుప్పు పడుతున్న ట్రాక్టర్‌ల పరిస్థితికి తప్పు ఎవరిదోనని రైతులు చర్చించుకుంటున్నారు.

గతంలో అద్దె ఎగ్గొట్టారు..


ప్రభుత్వం 2012లో ట్రాక్టర్‌ను సహకార సంఘానికి అందించింది. మొదట్లో ట్రాక్టర్‌ను కొందరి రైతులకు కిరాయికి ఇచ్చాము. కానీ రైతులు కిరాయి డబ్బులు ఇవ్వక పోవడంతో తమకు డ్రైవర్ వ్యవహార ఖర్చులు అదనంగా సంస్థపై భారం పడ్డాయి. అందుకే అద్దె ఇవ్వడం లేదు.

- గంగారరెడ్డి, సొసైటీ సీఈవో

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు..

ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు..

నవతెలంగాణ - వేములవాడ


మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన కాపీ



చేపడుతున్న అక్రమ నిర్మాణం

మున్సిపల్ పట్టణ టౌన్ ప్లానింగ్ అక్రమాలకు అడ్డాగా మారుతోంది. కొందరు అధికారుల తీరు అక్రమార్కులకు కలిసొస్తోంది. ఇదే ముసుగులో యథేచ్ఛగా అక్రమ కట్టడాలకు తెరలేపారు. మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. పట్టణ టౌన్ ప్లానింగ్ అస్తవ్యస్తమవుతోంది. పట్టణంలోని కొన్ని భవనాలు, రేకులషెడ్లు టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు లేకుండా పుట్టుకొస్తున్నాయి.

వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ లో గల దేవసాని భాగ్యలక్ష్మి చెందిన స్థలంలో, స్థలం సర్వేనెంబర్ 887, డాక్యుమెంట్ నెంబర్ 63 46 /2015 విస్తీర్ణం 97.77 రాంపల్లి గంగాధర్ అనే వ్యక్తి కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేస్తున్నాడని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. ఓ ప్రజా ప్రతినిధి అండదండలతో ఈ అక్రమ నిర్మాణానికి చేపడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ ఫిర్యాదు వస్తే స్పందించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం అవినీతి, అక్రమాలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించం, చట్టపరమైన చర్య తీసుకుంటామని మాటలకే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్: మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ భరోసా ఇచ్చారు. దండు మునేవ్వ భర్త రమేష్ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో 12ఏండ్లుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల మరణించారన్నారు. కరీంనగర్‌లోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయానికి దరఖాస్తు చేసుకోగా ఇన్సూరెన్స్ డబ్బులు రూ.5లక్షల 39వేలతో పాటు మృతుడి భార్యకు ప్రతి నెల రూ.2,601, తన కూతురుకి రూ. 650 చొప్పున ప్రతినెల పింఛన్ ఇచ్చే ధృవీకరణ పత్రాలను బుధవారం అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫాసహత్ అలీ బేగ్, కౌన్సిల్ సభ్యులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సుకుమార్, ఉమర్, శేఖర్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తంగళ్ళపల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డబుల్ బెడ్ రూమ్ కేసీఆర్ నగర్ కాలనీకి చెందిన ఒగ్గు సాయిలు(60) బట్టలు కుట్టుకుంటు భార్య కమల, కూతురు అనూష, కొడుకు దిలీప్ లను పోషించుకుంటున్నాడు. మూడు నెలల క్రితం కొడుకు దిలీప్ అనారోగ్య కారణంగా మృతి చెందాడు. సాయిలు మానసికంగా కుంగిపోయాడు. బుధవారం సాయంత్రం పని నిమిత్తం సైకిల్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి వస్తుండగా మండేపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో సాయిలు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి ఎస్ఐ వెంకటేశ్వర్లు చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్యరాణి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తినాలని, వ్యాయామం, యోగా లాంటి చేయాలని, ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదువుతారని, ఆరోగ్యమే మహాభాగ్యమని మెడికల్ అధికారిణి డా. సంధ్యారాణి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాష్ట్రీయ బాలల స్వస్థ్య కార్యక్రమం టీం (ఆర్‌బిఎస్‌కె), జాతీయ సేవా పథకం (ఎన్ఎస్-ఎస్) ఆధ్వర్యంలో హెల్త్ చెకప్ (ఆరోగ్యం పరిశీలన) కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల బరువులను, ఎత్తును కొలిచారు. జనరల్ చెకప్, హెచ్‌బి టెస్ట్, మొదలగు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు భోజనం చేయాలని, శరీరంను ఆరోగ్యంగా ఉంచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచిగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు, రాష్ట్రీయ బాలల స్వస్థ్య కార్యక్రమం టీం సభ్యులు డా. సాయిచంద్ర, డా. సంధ్యారాణి, ఫార్మాసిస్టు అంజలి, కళాశాల అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, ఆర్ గీత, చిలుక ప్రవళిక, కొడిముంజ సాగర్, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కె. దేవేందర్, ఎండి తాజోద్దీన్, లక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతో ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్ల ధర్నా...


ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మహిళలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతో ఉపాధి కొల్పోయామని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సిరిసిల్ల - కామారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఆటో యూనియన్ డ్రైవర్లు సుమారు 100 ఆటోలతో రోడ్డుపై బైఠాయించి 35 నిమిషాల పాటు ధర్నా చేశారు. మహిళలకు బస్సులలో ఉచితంగా ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేసి మాకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆటో యూనియన్ డ్రైవర్లు చేస్తున్న ధర్నాను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు పొన్నం శ్రీనివాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షులు కట్టెల బాలయ్య, ఉపాధ్యక్షులు జెల్ల రవి, మస్యూరి లక్ష్మణ్, ధర్వేష్‌లతో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ముస్తాబాద్ :



స్థానిక బస్టాండ్ వద్ద మండలంలోని ఆయా గ్రామాల ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని ఆటో డ్రైవర్లను ప్రభుత్వం అణిచి వేయడం సరికాదన్నారు. ప్రతిరోజు తమకు రూ.5వందలు కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఉన్నత విద్యాభ్యాసం చేసినా ఉద్యోగాలు రాక ఆటో డ్రైవర్లుగా మారామన్నారు. ప్రభుత్వం తమ కష్టాలను పట్టించుకొని వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి జీవోను రద్దు చేయాలని కోరారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతుకు న్యాయం చేయాలి

విద్యార్థి, ప్రజా సంఘాల డిమాండ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్


మాట్లాడుతున్న విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు

సాగు చేసుకుంటున్న భూమిని అధికారులు లాక్కుంటున్నారని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతుకు న్యాయం చేయాలని విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చికిత్స పొందుతున్న బాధితుడితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల నందం 15ఏండ్ల కిందట నక్సలైట్గా కొనసాగి, అప్పటి ప్రభుత్వం హాయంలో లొంగిపోవడం జరిగిందన్నారు. జీవనోపాధి కొరకు ప్రభుత్వం అదే గ్రామంలో 1ఎకరం 20గుంటలను అందజేసిందని, నాటి నుండి నేటి వరకు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడన్నారు. కానీ ఇటీవల రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని, అటవీ శాఖ అధికారులకు చెందినదని కంచే వేయడానికి ప్రయత్నించగా మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా భూమిని లాక్కుంటామని అధికారులపై చర్యలు తీసుకొని బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. విద్యార్థి ప్రజా సంఘాలు నాయకులు లంబడ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు సరేష్ నాయక్, డీవైఎఫ్ఐ నాయకులు మల్లారపు అరుణ్, గంతుల మహేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లారపూ ప్రశాంత్, అనీల్, మనోజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అంగురీ రంజిత్, ప్రణీత్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్, దళిత యువజన సంఘంల నాయకులు సద్దాం రాజు కుమార్ స్వామి సుమన్ ఉన్నారు.

అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారు

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : రాజన్నసిరిసిల్ల జిల్లా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలు అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మా ఎమ్మెల్యే అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించాలని ఆరోపించడం అన్యాయం అన్నారు. నియోజకవర్గం అభివృద్ధిపై మంత్రిని ప్రశ్నించడం ప్రజల పక్షాన అప్పుడు మాకు హక్కు ఉండేదన్నారు. ఇప్పుడు నేరుగా పరిపాలించే బాధ్యతలో ఉన్నాం కాబట్టి తప్పకుండా ప్రజలకు సేవ చేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తన స్థాయికి మించి మాట్లాడుతున్నారని గతంలో జరిగిన సంఘటనలన్ని ఆగయ్య గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు గుండాటి రాంరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సూడిది రాజేందర్, మండల యూత్ అధ్యక్షులు బానోతు రాజునాయక్‌లు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంభీరావుపేట : కేకే మహేందర్ రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ అన్నారు. బుధవారం పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కేకే మహేందర్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రజలు ఎవరికి ఆశీర్వదించారో అందరికీ తెలుసునని గత ఎన్నికల్లో 90వేల మెజారిటీ తోటి గెలిచిన కేటీఆర్ మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేవలం 28వేల ఓట్లకే పరిమితం చేశారన్నారు. 13వ ప్యాకేజీ కింద ఉన్న మల్లన్నసాగర్ రంగనాయకసాగర్ ప్రాజెక్టులు పూర్తయినప్పటికిని తొమ్మిదవ ప్యాకేజీ కింద ఉన్న ఎగువ మానేరు ఎందుకు పూర్తి కాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల రామచంద్రారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుర్రం రాజు గౌడ్, గంభీరావుపేట పట్టణ శాఖ అధ్యక్షుడు పాపా గారి రాజు గౌడ్ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో ముస్తాబాద్...

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శరత్‌రావు



నవతెలంగాణ - ముస్తాబాద్

గడిచిన ఐదేండ్లుగా ముస్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాలను ప్రగతి పథంలోకి తీసుకెళ్తున్నట్లు ఎంపీపీ శరత్‌రావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శరత్‌రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీలు, శ్మశాన వాటికలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, కంపోస్టు ఎరువుల షెడ్లను సొంత డబ్బులు పెట్టుకొని నిర్మించామన్నారు. ఇప్పటికీ కూడా పూర్తిస్థాయిలో బిల్లులు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ముస్తాబాద్ సర్పంచ్ సుమతి మాట్లాడుతూ మహిళా గ్రూపు వారికి పావులా డబ్బులు రావడం లేదన్నారు. అధికారులు చొరవ తీసుకొని ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రుణమాఫీ కాని రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఎంపీపీ శరత్ రావు మాట్లాడుతూ ముస్తాబాద్ మండలాన్ని మాతో సాధ్యమైనంత వరకు ప్రగతి పథంలోకి తీసుకెళ్లామన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం ఇంతకుముందే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. త్వరలోనే సర్పంచులకు బిల్లులు వచ్చేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మహిళలకు పావుల వడ్డీ, రైతులకు రుణమాఫీ వచ్చేలా చూస్తామని తెలిపారు. అందరిని కలుపుకొని మండల అభివృద్ధి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీవో రమాదేవి పాల్గొన్నారు.

రైతు జీవితంతో అధికారుల చెలగాటం

సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి

నవతెలంగాణ - కోనరావుపేట : రైతుల జీవితంలో అధికారులు చెలగాటం ఆడుతున్నారని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రైతులకు ఆత్మహత్యలే దిక్కయ్యాయని ఆవేదవ వ్యక్తం చేశారు. గతంలో గత్యంతరం లేక వెట్టి చాకిరి విముక్తి కోసం తుపాకులు పట్టి పోరాడిన కొంత మంది అన్నలు అప్పటి ప్రభుత్వం పిలుపు మేరకు లొంగి పోయారన్నారు. జనజీవన స్రవంతిలో కలిసిన అన్నలకు(నక్సలైట్లకు) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం భూమి పట్టాలు పంపిణీ చేసిందన్నారు. నేడు తెలంగాణ ప్రభుత్వంలో మాత్రం అవే భూములను మళ్లీ తిసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. దీంతో అమాయక దళితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొండాపూర్ గ్రామవాసి దళిత బిడ్డ మల్యాల నందం సంఘటననే దీనికి నిదర్శనమన్నారు. గతంలో జన జీవన స్రవంతిలో కలిసిన మల్యాల నందంకు గతంలో 116 సర్వే నంబర్‌లో ఎకరంన్నర భూమి ఇచ్చారన్నారు. కాగా నేడు మళ్లీ ఆ భూమి లాక్కోవటంతో తన జీవన ఆధారం పోతుందనే ఆందోళనతో అధికారుల ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడటం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారం యంత్రాంగం వెంటనే స్పందించి నందం సాగు చేసుకుంటున్న భూమిని ఆయనకు ఇవ్వాలని, రూ.50 వేలు లంచం అడిగిన సర్వేయర్లతోపాటు మిగతా అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చందన



నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కల్లూరి చందనను నియమించారు. ఈ మేరకు బుధవారం ఆ విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఉత్తర్వులు అందజేశారు. కాగా చందన గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేశారు. శాసనసభ ఎన్నికలకు ముందు తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ఆమెకు మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవి అప్పగించింది చందనను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ వెల్ముల స్వరూప మడుపు శ్రీదేవి ఆడెపు చంద్రకళతోపాటు కాంగ్రెస్ నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

స్థాయి సంఘ సమావేశాల్లో అభివృద్ధిపై సమీక్ష


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అరుణ

నవతెలంగాణ - సిరిసిల్ల

బుధవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన జిల్లా స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు జడ్పీ చైర్ పర్సన్ అధ్యక్షత వహించగా, వ్యవసాయం పై వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మహిళా సంక్షేమంపై తంగలపల్లి జడ్పీటిసి పూర్మాని మంజుల, సాంఘిక సంక్షేమంపై బోయినపల్లి జడ్పీటీసీ కత్తెరపాక ఉమ స్టాండింగ్ కమిటీలకు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అధికారులు సంబంధిత శాఖల నివేదికలు చదివి వినిపించారు. శాఖలపై సమగ్ర చర్చ జరిగింది. జడ్పీ చైర్ పర్సన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జడ్పీటిసి లు గట్ల మీనయ్య, మ్యాకల రవి, నాగం కుమార్, కోమిరి షెట్టి విజయ, గుండం నర్సయ్య, కో ఆప్షన్ సభ్యులు అహ్మద్, ముఖ్యకార్యనిర్వహణ అధికారి గౌతమ్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పేరుతో ఇసుకను తరలించారు

కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప


సమావేశంలో మాట్లాడుతున్న గోనె ఎల్లప్ప

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల పేరుతో కోట్లు విలువ చేసే ఇసుకను తరలించారని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప ఆరోపించారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం హయాంలో ఇసుక, ల్యాండ్, బతుకమ్మ చీరల మాఫియా జరిగిందన్నారు. అభివృద్ధి పేరుతో ఇసుకను తరలించారని, ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ వైపు ప్రజలు చూస్తున్నారని, ప్రస్తుత జరిగిన సిరిసిల్ల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ తగ్గిందన్నారు. మరోసారి కేకే మహేందర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో చేనేత సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గాజుల సాగర్, నాయకులు శ్రీరాముల వెంకటేశం, ధూబాల వెంకటేశం, మార్గం లక్ష్మణ్, బాలరాజు, స్వర్గం రాజు, అన్నల్దాస్ భాను ఉన్నారు.

గులాబీ పురుగు నివారణపై అవగాహన



నవతెలంగాణ - రుద్రంగి : రుద్రంగి మండలం దెగవత్ తండా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ,ఆధ్వర్యంలో రైతులతో శాస్త్రవేత్తలు క్షేత్ర దినోత్సవం, అవగాహన సదస్సులో భాగంగా శాస్త్రవేత్త డా.ఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగు లక్షణాలు, నివారణలపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు వేసవిలో లోతు దుక్కులు చేయడం పంట మార్పిడి చేయడం, గుడ్డు పువ్వులను ఏరి నాశనం చేయాలన్నారు. లింగాకర్షక బుట్టలను ఎకరాకు 8పెట్టుకోవాలని, జీవ నియంత్రణ కారిని ట్రైకోగ్రామ టాఏడియా బ్రాక్టే 4 కార్డ్స్ ను ఒక్క ఎకరాకు, వేప కషాయం 5మి లీ ఒక్క లీటర్ నీటి కి కలిపి పిచకారీ చేయాలని, గులాబీ రంగు పురుగు నివారణకు రసాయన మందులను ప్రొఫెనో పాస్ 2 మి.లీ లేదా క్వినాల్ ఫస్ 2 మి. లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా ప్రోపనో ఫాస్ం సైపర్ మెత్రిన్ 2 మి.లీ లేదా క్లోరో పైరిఫాస్ం సైపర్ మేత్రిన్ 2 మి లీ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పంటను 180-200 రోజుల పాటు మించ కుండా ఉంచి పంటను తీసి వేయాలన్నారు. డా కే మదన్ మోహన్ రెడ్డి కో ఆర్డినేటర్ గారు ప్రతి పంటలో వచ్చే గులాబీ రంగు పురుగు గురుంచి, యసంగి లో వివిధ రకాల పంటలపై వివరించారు. క్షేత్ర దినోత్సవం లో భాగంగా రైతుల పత్తి పంటను సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త కో ఆర్డినేటర్, ఎంపీపీ గంగం స్వరూపరాణి, వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, సర్పంచ్ సరిత-తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ శ్యాంసుందర్, వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-జగిత్యాల : పట్టణంలోని భాగ్యరాజ్ ఫంక్షన్ హాల్‌లో అర్బన్, రూరల్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరై భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ములాసపు లక్ష్మి, రాజేంద్రప్రసాద్, జడ్పీటీసీ మహేష్, నాయకులు పాల్గొన్నారు.

సమ్మెతో తపాలా సేవలకు అంతరాయం

రెండో రోజు తపాలా ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ - మెట్‌పల్లి

మెటపల్లి, ఇబ్రహీంపట్నం, ముత్యంపేట సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని తపాలా ఉద్యోగులు రెండో రోజు సమ్మె చేపట్టారు. తపాలా ఉద్యోగులకి సంబంధించిన సేవలను వర్క్ లోడ్‌లోకి తీసుకోవాలని, రిటైర్మెంట్ అయినా తపాలా ఉద్యోగికి రూ.5 లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. తమ న్యాయమైన సమస్యలని పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మీర్జా ఫారూఖ్ అలీ బైగ్, లక్ష్మణ్, అభి చరణ్, లక్ష్మ రెడ్డి, కిరణ్మయూరి, భూమేష్, శివలాల్, రమణ, రాంనారాయణ, కొండయ్య, రాజేశం ,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

నవతెలంగాణ - గోదావరిఖని: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను బుధవారం వారి నివాసంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన సందర్భంగా మల్లుభట్టి విక్రమార్కకు ఆయన శాలువా కప్పి, పూలబొకే అందజేసి సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం ఆయనతో కలిసి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అసెంబ్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా పలు విషయాలపై డిప్యూటీ సిఎంతో ఆయన చర్చించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి అసెంబ్లీని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పరిశీలించారు.

గాదే సుధాకర్‌ను అభినందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యేగా తన గెలుపునకు నికార్సయిన యువ రాజకీయ నాయకులే కారణం అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. పాలకుర్తి, అంతర్గాం మండల కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ గాదె సుధాకర్ పటేల్ 20ఏండ్లుగా తన గెలుపునకు ఎంతో కృషి చేశారని బుధవారం సన్మానించారు. అన్ని రకాలుగా అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకు వచ్చి తన గెలుపు కోసం పని చేసిన గాదె సుధాకర్ లాంటి రాజకీయ యువనాయకుల అవసరం సమాజానికి ఉందన్నారు.

సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-గోదావరిఖని: ఈ నెల 23న సింగరేణి ఆర్జీ 1లోని స్థానిక జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో నిర్వహించనున్న సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జీఎం చింతల శ్రీనివాస్ అధికారులకు ఆదేశించారు. గోదావరిఖనిలోని ఆర్జీ 1 జీఎం కార్యాలయంలో సింగరేణి ఆవిర్భావ వేడుకల నిర్వహణపై అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల ఉన్నతాధికారులతో బుధవారం సమీక్షించారు. శాఖల వారిగా కేటాయించిన వాటిని అధికారులందరూ సమన్వయంతో నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో ప్రత్యేక ఆకర్షణగా బొగ్గు తీయు యంత్రాల పనిముట్ల నమూనాలను ప్రదర్శించాలని, అటవీ పర్యావరణ, వైద్య సేవలు, సింగరేణి సేవా సమితి స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం రాంమోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మి నారాయణ, ఏజెంట్ బానోతు సైదులు, ఏజీఎం ఈఅండ్ఎం రాంమూర్తి, డీజీఎం ఫైనాన్స్ ఎస్.ధనలక్ష్మి, డీజీఎం సివిల్ నాగేశ్వర్ రావు, డీజీఎం క్వాలిటీ శ్రీధర్, డీజీఎం ఏరియా వర్క్ షాప్ మదన్ మోహన్, సర్వే అధికారి ప్రభాకర్, ఎస్టేట్ మేనేజర్ బాల సుబ్రమణ్యం, పర్చేస్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ రామగుండం సీజీఎంకు శుభాకాంక్షలు తెలిపిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

ఎన్టీపీసీ రామగుండం చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజాన్ పాండు జన్మదినం సందర్భంగా సీఐటీయూ అనుబంధ ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలబొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు ఎన్. బిక్షపతి, కార్యనిర్వక అధ్యక్షుడు భూమయ్య, ప్రధాన కార్యదర్శి ఈ.రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు ఆర్.



సాంబయ్య, రాసపల్లి సంపత్, కార్యదర్శులు సిహెచ్.శంకర్, ఆర్.కుమార్, కోశాధికారి జి.బిక్షపతి తదితరులున్నారు.

పెద్దపెల్లి ఎమ్మెల్యేను కలిసిన పాతపల్లి ఎల్లయ్య యాదవ్

నవతెలంగాణ-గోదావరిఖని:



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణా రావు వారి గృహంలో రామగుండం కాంగ్రెస్ నాయకులు పాతపల్లి ఎల్లయ్య యాదవ్ బుధవారం కలిశారు. నూతనంగా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు శాలువా కప్పి, బొకే అందజేసి, సన్మానించి, అభినం దనలు తెలిపారు. ఆయన వెంట నాయకులు సోమ ప్రశాంత్, లింగాల హరికృష్ణ పాల్గొన్నారు.

8 సిమెంట్ బెంచీల ఏర్పాటు

నవతెలంగాణ-గోదావరిఖని:



బెంచీలను ఏర్పాటు చేస్తున్న మిత్రులు

రామగుండం కార్పొరేషన్ 25వ డివిజన్‌కు చెందిన పైండ్ల శ్రీకాంత్ జ్ఞాపకార్థం అతని మిత్రులతో పాటు కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 25వ డివిజంతో పాటు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ప్రజలు కూర్చునేందుకు 8 సిమెంట్ బెంచీలను సమ కూర్చారు.కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత- రాజు, పైండ్ల బిక్షపతి, శ్రీనాథ్, బర్ల సంతోష్, రవి కాంత్, రంగు రాయమల్లు, అన్నారపు శ్రీకాంత్, శివ, వెంకటేష్, విజ్ఞ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాల



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల పట్టణానికి చెందిన రిపోర్టర్ వాసం రఘు తల్లి వాసం రాజేశ్వరి మరణించగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వారి ఇంటికి వెళ్లి మృదేహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. అనంతరం జగిత్యాలరూరల్ మండల చల్‌గల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ ఏఎంసీ డైరెక్టర్ మోహన్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మరి కొందర్ని పరామర్శించారు. వారి వెంట కౌన్సిలర్లు జుంబర్తి రాజుకుమార్, గుర్రం రాము నాయకులు గుమ్మల అంజయ్య ప్రతాప్, కౌన్సిలర్ గుగ్గిళ్ళ హరీష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసీఫ్, నాయకులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్

నవతెలంగాణ-జగిత్యాల



సన్మానిస్తున్న అధికారులు

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినందున జగిత్యాల కలెక్టరేట్‌లో జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారులు కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి రమేష్, అసోసియేటెడ్ అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, ఉపాధ్యక్షుడు విజయేందర్, విశ్వాస్ ప్రభు, కిరణ్, హనుమంతరావు, సంగి రాజేశ్వరి శైలజరాణి,సలీం, ప్రవీణ్ పాల్గొన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సాగర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి కలెక్టర్‌కు ఖమ్మంపల్లి సర్పంచ్ సముద్రాల రమేష్ బుధవారం ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌నైన తన అనుమతి లేకుండా ఈ నెల 8న ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సాగర్ పంచాయతీ పాలక వర్గ సమావేశం ఏర్పాటు చేశారని, ఈ విషయంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఈ వినతి ద్వారా పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను ఖమ్మంపల్లి సర్పంచ్ సముద్రాల రమేష్ కోరారు.

డ్రంకన్‌డైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కొద్ది రోజుల క్రితం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన బోయపోతు నరేష్‌కు మూడు రోజుల జైలు శిక్ష పడింది. ఈ మేరకు బుధవారం బోయపోతు నరేష్‌ను గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ దుర్వ వెంకటేష్ ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. దీంతో అతనికి జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించినటుల ట్రాఫిక్ సిఐ తెలిపారు.

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

గోదావరిఖనిలోని సింగరేణి ఆర్జీ 1 జీఎం ఆఫీస్ వద్ద బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చెన్నూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించి, ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన వివేక్ వెంకటస్వామికి శాలువా కప్పి, పూలబొకే అందజేసి సత్కరించి, అభినందనలు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో నాయకులు దీటి బాలరాజు, పెంచాల తిరుపతి, జనగామ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎస్‌ఐగా పదోన్నతి పొందిన ఎఎస్‌ఐకి సన్మానం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:



సన్మానిస్తున్న ఎస్ఐ

ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహించే చక్రపాణి ఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చక్రపాణి ఎస్ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల కల్పన

- పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

నవతెలంగాణ - పెద్దపల్లిటౌన్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో ఆయన ముచ్చటించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమయంలో ఇబ్బందులు ఎదురైన సందర్భంలో వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ సూచించారు. రైతులు ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్

కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు, టార్పాలిన్లు, క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైస్ మిల్లర్ల వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్రక్ షీట్‌లో జనరేట్ చేయాలన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, హార్టికల్చర్ జిల్లా అధికారి జగన్మోహన్ రెడ్డి, మార్కెటింగ్‌శాఖ, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులలో చర్చ జరగాలి

ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులలో చర్చ జరగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. రాఘవపూర్ గ్రామంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న వెంకటేశ్వర్‌రావు అనే రైతు పొలాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ కింద రూ.21,000 బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయని రైతు తెలిపారు. అనంతరం రాఘవపూర్‌లోని రైతు వేదికలో రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా చర్చించి మంచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా లాభదాయక పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించాలని కోరారు. మల్లారెడ్డి, వెంకటేశ్వర్ రావు కలెక్టర్‌ను సన్మానించారు. అనంతరం కలెక్టర్ ఎఫ్‌పిఓల ఏర్పాటుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్మోహన్‌రెడ్డి, వ్యవసాయ అధికారిని అలివేణి, వ్యవసాయ విస్తరణ అధికారులు స్పందన, శిరీష, సువర్ణ, శ్వేత, కల్పన, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధులు, రైతు మల్లారెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ ఫిల్టర్ బెడ్ త్వరలో ప్రారంభం

- ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరిస్తాం
- ఆదాయం ముఖ్యం కాదు.. ప్రజల ఆరోగ్యం ముఖ్యం
- ఆటో డ్రైవర్లను ఆదుకుంటాం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-రాయికల్

నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సాగు, తాగు నీరు, విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎంను కోరినట్టు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి పట్టణంలోని మంచి నీటి ఫిల్టర్ బెడ్‌ను, రామాజీపేట గ్రామంలోనీ పంపు హౌస్‌ను ఎమ్మెల్సీ పరిశీలించారు. ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు చేపట్టిన ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకానికి నిధులు కేటాయించి పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకం నిర్వహణ పునరుద్ధరణకు అవసరమైన ప్రతిపాదనలను తయారుచేసి ఇవ్వాలని ఇరిగేషన్



పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

అధికారులకు ఆదేశించారు. అనంతరం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తలపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నీరు సరఫరా చేస్తామని ప్రకటించినప్పటికీ నీరందలేదని, జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రాయికల్, బీర్పూర్, జగిత్యాల మండలం పొలాస ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకం గత దశాబ్దం కాలం నుండి వినియోగంలోకి తేలేకపోయారన్నారు. రాయికల్ ఫిల్టర్ బెడ్ సుమారు 5 మిలియన్ల నీటిని సరఫరా చేసే సామర్థ్యం ఉందని, ఫిల్టర్ బెడ్డు పునరుద్ధన కోసం ఇరిగేషన్ అధికారులకు నిధుల కేటాంపు కోసం అంచన రూపొందించాలని ఆదేశించామన్నారు. రాయికల్, బీర్పూర్, పొలాస మూడు ఫిల్టర్ బెడ్లు వేసవికాలం వరకు వినియోగంలోకి తీసుకు వచ్చి ప్రజలకు శుద్ధ జలం అందిస్తామన్నారు.

రాయికల్ ఫిల్టర్ బెడ్‌కు నీరందించేందుకు రామజిపేట్ గ్రామ చెరువులో నీరు నిల్వ ఉండేందుకు ఎస్సారెస్పీ కెనాల్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో 78 టీఎంసీల నీరు నిలువ ఉందని రబి పంట సాగుకు ఈనెల17 నుండి ఏప్రిల్ 15 వరకు నీటి విడుదలతో ఆరు లక్షల ఎకరాల పంట సాగుకు నీరందుతుందన్నారు. ధాన్యం సేకరణలో గత ప్రభుత్వం రైస్ మిల్లర్లతో ఒప్పందం చేసుకొని కోత విధించిందని ఇకనుండి రైస్ మిల్లర్ల ఆటలు చెల్లవున్నారు. మహిళల కోసం ఉచిత బస్సును ప్రవేశపెట్టిన పథకంతో ఆటోడ్రైవర్లకు నష్టం కలుగుతుందని డ్రైవర్లు తమ దృష్టికి తీసుకువచ్చారని ప్రభుత్వ పరంగా ఆటో డ్రైవర్లను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ,మండల అధ్యక్షులు మ్యాకల రమేష్, రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహిపాల్,నాయకులు గోపి రాజారెడ్డి, ఎద్దండి దివాకర్, బాపురపు నర్సయ్య,గన్నవరం ప్రభాకర్, పడిగెల రవీందర్‌రెడ్డి, ఇద్దం సుధీర్ రెడ్డి,కడకుంట్ల నరేష్,బత్తిని భూమయ్య,కాటి పెల్లి రాజశేఖర్, పొన్నం శ్రీకాంత్, పాల్గొన్నారు.

అలవెన్స్‌లపై ఇన్‌కమ్‌టాక్స్ కార్మికులకు తిరిగి రీయింబర్స్‌మెంట్ చేయిస్తాం

సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణిలో అలవెన్స్‌లపై ఇన్‌కమ్‌టాక్స్ కార్మికులకు తిరిగి రీయింబర్స్‌మెంట్ చేయిస్తామని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంపాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 11వ గనిలో ఆరెపల్లి రాజమౌళి అధ్యక్షతన బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్ల నుంచి 20 మంది కార్మికులు యూనియన్‌లో చేరగా, వారికి తుమ్మల రాజారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల

కార్మికులకు అలవెన్స్‌లపై ఇన్‌కమ్‌టాక్స్ తిరిగి రీయింబర్స్‌మెంట్ చేయాలని 2011 నుంచి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పోరాడుతుందన్నారు. కోల్ ఇండియాలో అధికారులు, కార్మికులు సింగరేణిలో అధికారులు కూడా రీయింబర్స్‌మెంట్ తీసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. అగ్రిమెంట్ జరిగిన నుంచి కార్మికులకు రీయింబర్స్‌మెంట్ చేయాలని పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. సీఐటీయూ గెలిస్తే అలవెన్స్‌లపై ఇన్‌కమ్‌టాక్స్ రీయింబర్స్‌మెంట్ ఏడాదికి ప్రతి కార్మికుడికి రూ.30 వేల నుండి రూ.60 వేల వరకు ప్రతి సంవత్సరం చెల్లించటం కోసం చర్యలు తీసుకుంటామని. యజమాన్యాన్ని ఒప్పించి ఇప్పిస్తామని కార్మికులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్జీ1 అధ్యక్ష కార్యదర్శులు మేదరి సారయ్య, మండే శ్రీనివాస్, జేల్లా గజేంద్ర, అరేపల్లి రాజమౌళి, ఆసరి మహేష్, ఎస్కే గౌస్, బొగ్గారం శ్రీనివాసరావు, జే మల్లేష్, రవితేజ, సిహెచ్ దేవేందర్, సాయి కృష్ణ, 20 మంది కార్యకర్తలు, ప్రజా నాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి

ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

నవతెలంగాణ-పెగడపల్లి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోలి శోభ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించాలన్నారు. మరోసారి జరిగే సర్వసభ్య సమావేశంలో ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, తహసీల్దార్ ఫారుక్, ఎంపీడీవో పుల్లయ్య, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, నంచర్ల సింగిల్ విండో చైర్మన్ మంత్రి వేణు, ఎంపీవో మహేందర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అడ్లూరి

నాయకుడిని కాదు నేను మీ సేవకుడిని.

నాయకుడిని కాదు నేను మీ సేవకుడినని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని వెల్మ సంక్షేమ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజా స్పందన సభలో నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను 100 రోజుల్లో పక్కాగా అమలు చేస్తామని, ప్రతి కార్యకర్త ఈ పథకాలను




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అడ్లూరి

లబ్ధిదారులకు చేరేలా కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్యాంపెనింగ్ జాయింట్ కన్వీనర్ గజ్జల స్వామి, ఎంపీటీసీలు కడారి సుప్రియ తిరుపతి, పూసాల శోభ తిరుపతి, సింగసాని విజయలక్ష్మి స్వామి, సర్పంచ్‌లు తాటిపర్తి శోభారాణి, ఇస్లావత్ రవి నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, ఉపాధ్యక్షుడు సంధి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు గోగురి సతీష్ రెడ్డి, తడగొండ రాజు, మాజీ మార్కెట్ చైర్మన్ ఓరగల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు అక్కినపెల్లి కుమార్,ఆకుల విష్ణు, తిరుపతి, ప్రశాంత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని గాంధీ నగర్‌లో నివాసముండే భద్రయ్య బుధవారం మరణించాడు. బుధవారం రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ భద్రయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు గాదం నందు, మేకల సమ్మయ్య యాదవ్ ఉన్నారు.



అందుబాటులో ఉంటా.. సమస్య ఉంటే సంప్రదించండి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

నవతెలంగాణ-మల్లాపూర్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం ఉన్నా.. లేకపోయినా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా, దుర్గమ్మ కాలనీ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఏమైనా సమస్యలు ఉంటే తనను ఫోను ద్వారా సంప్రదించాలని సూచించారు. మండల కేంద్రానికి చెందిన గొట్టిపర్తి రాజు ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లి అనారోగ్యానికి గురి కాగా వారి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం ఎమ్మెల్యే అందజేశారు. రాజును స్వదేశానికి తిరిగి రప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాజా శ్రీనివాస్, ఎంపీఓ జగదీష్, ఏవో లావణ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, ఈవో భూమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికార పీఠాన్ని చూసి ఫిరాయించే నాయకులను నమ్మకండి

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు వైవి రావు, మడ్డి ఎల్లా గౌడ్

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణిలో ప్రస్తుతం ఏడవ సారి జరుగుతున్న ఎన్నికల్లో అధికార పీఠాన్ని చూసి ఫిరాయించే నాయకులను నమ్మొద్దు అని, పైరవీలకే పరిమితమవుతారు తప్ప కార్మికులకు పని చేయరని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శులు వైవి రావు, మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కే.స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోశం, సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ అన్నారు. బుధవారం సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడికే 2వ గని, ఓసిపిగలలో జరిగిన ఏఐటియుసి గేట్ మీటింగ్‌లలో వారు పాల్గొని మాట్లాడుతూ అధికార రాజకీయాలకు అలవాటు పడిన అవినీతి నాయకులు ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఊసరవెల్లి రంగులు మార్చడం ఫిరాయింపులకు పాల్పడడం అలవాటుగా మారిందని, అలాంటి వారిని నమ్మితే మోసపోతామని, వారు పైరవీలకే పరిమితమవుతారని వారు ఉద్ఘాటించారు. జీడికే 2వ ఇంక్లైన్, ఓసిపి 5లో టీబీజీకేఎస్ యూనియన్‌కు చెందిన నాయకులు ఏలేశ్వరం సత్యనారాయణ, ఇ.రాజిరెడ్డిలతో పాటు వివిధ సంఘాలకు చెందిన దాదాపు 150 మంది యూనియన్‌లో చేరగా వారికివారు ఏఐటీయూసీ కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మాదన మహేష్, గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, గౌతం గోవర్ధన్, కే.కనకరాజ్, పర్లపెల్లి రామస్వామి, జి.ప్రభుదాస్, సి.హెచ్. తిరుపతి, రాయుడు శ్రీనివాస్, ఏ.సుధాకర్, ఎం.తిరుపతి, మిట్ట శంకర్, ఎస్ వెంకట్ రెడ్డి, సూర్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందిస్తాం

కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్

నవతెలంగాణ -మెట్‌పల్లి



మాట్లాడుతున్న బెజ్జరపు శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను అమలుప రచడానికి ప్రతి నియోజకవర్గానికి ఒక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్ అన్నారు. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు నాయకత్వంలో పని చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. కోరుట్ల నియోజకవర్గం లో ప్రభుత్వ పథకాలలు లబ్దిదారులకు అందేలా ప్రభుత్వ ఉద్యోగులందరూ కషిచేయాలనీ కోరారు. మెట్‌పల్లి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇల్లెందుల రాజు,జగిత్యాల జిల్లా సేవదల్ అధ్యక్షులు అందే మారుతి బాపూజీ, పట్టణ కార్యదర్శి కంబ సురేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ముత్తారం:



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందంను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలబొకే అందజేసి సన్మానించారు. కలిసిన వారిలో నాయకులు గోస్కుల రమేష్, అనవేన తిరుపతి, బొనగాని సాగర్ తదితరులున్నారు.

ఆటో, జీపు డ్రైవర్ల ఆందోళన

నవతెలంగాణ-మెట్‌పల్లి



:ధర్నా నిర్వహిస్తున్న ఆటో జీపు డ్రైవర్లు

ఆర్టీసీ బసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోతు న్నామని కోరుట్ల నియోజకవర్గంలోని మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన ఆటో, జీప్, టాక్సీ డ్రైవర్లు పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మధ్యలో పాత బస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.

NOTICE
IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE AT:: DHARMAPURI
E.P. No. 3 of 2023

Between:
Suddala Ramesh
... Decree Holder/Petitioner
AND
Singu Srinivas
...Judgment Debtor/Respondent

To
JDR: Singu Srinivas S/o Venkaiah age: 39years occ: Bussiness R/o H. No.3- 31/1.Rayapatnam village of Dharmapuri mandal of Jagtial District.

Whereas the above named Decree Holder/Petitioner have filed the above Exceution Petition and whereas in Several times notices were sent to you the Judgment Debtor/Respondent, but you are evading to receive the notices. The above case is stands posted on **12-01-2024 at 10:30 A.M.** for your appearance before the Hon'ble Court to counter and defense, if any, failing which the matter will be decided in your absence.

(By Order of the Court)
Sd/-
Bandela Ramesh
Advocate for Decree Holder/ Petitioner
Velgatoor-505526, Dist: Jagtial.

SUMMONS
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE. AT GODAVARIKHANI
O.S. No. 52 OF 2023

Between:
1. Madduri Shankaramma, and others.
...Plaintiffs
AND
1] Busa Laxmi @Saramma, others
...Defendants

To,
Busa Laxmi @ Saramma, W/o. Not Known, Age 48 yaers, Resident of Julapally Village of Kamanpur Mandal in Peddapalli.

That, the above named Petitioners has filed. **Suit to declare the plaintiffs as legal heir of the deceased Madduri Shankaraiah** against the Respondents/ defendants, if Respondents/ Defendants are having any interest in the above said matter make your appearance and claim your right in person or through a pleader on **25.01.2024 at 10.30 am** before the Hon'ble Senior Civil Judge at Godavarikhani, otherwise the case will be decided as per law.

// By order of the court //
NDH. 25.01.2024
Sd/-
Matla Bahnu Krishna
Advocate, Godavarikhani.

గుండ్లపల్లిలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ - గన్నేరువరం : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మొదటిసారిగా కరీంనగర్‌కు వస్తున్న క్రమంలో రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి వద్ద రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ బేతేల్లి సమతరాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంను భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం పలికిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్‌రెడ్డి, సర్పంచులు బేతల్లి సమతరాజేందర్‌రెడ్డి, చింతలపల్లి నరసింహారెడ్డి, ముసుకు కరుణాకర్‌రెడ్డి, దుడ్డు రేణుకమల్లేశం, ఎంపీటీసీ ఆటికం రాజేశంగౌడ్, నాయకులు చిటుకూరి అనంతరెడ్డి, కటకం తిరుపతి, బొడ్డు సునీల్, బద్దం సంపత్‌రెడ్డి, గుంటుక లింగయ్య, బుర్ర మల్లేశంగౌడ్, గుర్రం వాసుగౌడ్, చాడ సతీష్‌రెడ్డి, వంగల సత్యనారాయణరెడ్డి, కాల్వ కొమురయ్య, పరిపూర్ణాచారి, నేలపట్ల కనకయ్య, నాగపురి శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

చొప్పదండిగా సమస్యలు..

- అసంపూర్తిగా కుడి కాలువ తవ్వకాలు
- నీటి కోసం రైతుల ఎదురు చూపు
- మండలాల ఏర్పాటుపై కోటి ఆశలు
- నష్ట పరిహారం కోసం నిర్వాసితుల ఆందోళన
- నూన ఎమ్మెల్యే మేడిపల్లిపై జనం ఆశలు





అసంపూర్తిగా నిలిచిన కుడి వరద కాలువ

నవతెలంగాణ - గంగాధర

చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దండిగానే సమస్యలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో తమ కష్టాలు తీరుతాయని ఆశపడిన జనానికి నిరాశే మిగిలింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేతలకు చొప్పదండి జనం రెండు టర్ములు జైకొట్టగా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారు. దీంతో బీఆర్ఎస్ పక్షాన ఓ టర్ము బొడిగె శోభ, నిన్నటి వరకు సుంకె రవిశంకర్ ఎమ్మెల్యేలుగా కొనసాగగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మరో ఉద్యమ నేత, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యంకు పట్టం కట్టారు. చొప్పదండి నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎమ్మెల్యేగా ఎన్నికైన నాలుగవ వ్యక్తి మేడిపల్లి సత్యం. మంచి మెజార్టీతో ఎన్నికైన మేడిపల్లి సత్యంకు సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. నియోజకవర్గంలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, బోయినిపల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాల్లో పేరుకుపోయిన సమస్యలు మేడిపల్లి సత్యం సవాల్‌గా స్వీకరించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆరు మండలాల్లో సమస్యలను కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే సత్యం పరిష్కరిస్తారని జనం పెట్టుకున్న ఆశలు ఎప్పటి వరకు తీరుతాయో వేచి చూడాల్సిందే.

అసంపూర్తిగా నిలిచిన కుడి కాలువ తవ్వకాలు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపట్టిన కుడి వరద కాలువ తవ్వకం పనులు పదేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఎడమ వరద కాలువ తవ్వకం పనులు పూర్తయి పంటలకు సాగునీరు అందుతుంటే, కుడి కాలువ తవ్వకం పనులు అసంపూర్తిగా నిలిచి మెట్ట ప్రాంత రైతులు సాగునీరందక అల్లాడుతున్నారు. గంగాధర, నారాయణపూర్ జలాశయం నుండి గంగాధర, మధురానగర్ మీదుగా బోయినిపల్లి, వేములవాడ చెరువు వరకు కుడి కాలువ తవ్వకాలు చేపట్టిన అనేక చోట్ల పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఈ కాలువ తవ్వకం వల్ల గంగాధర, ఉప్పరమల్యాల, గర్శకుర్తి, స్తంభంపల్లి, బోయినపల్లి, వేములవాడ చెరువుల్లోకి ఎల్లంపల్లి ఎత్తిపోతల జలం చేరనుండగా, అనేక గ్రామాల్లోని వ్యవసాయ, తాగునీటి బావుల్లో భూగర్భ జలాల పెంపుతోపాటు పంటలకు నీరందనుంది. ఇద్దరు ఎమ్మెల్యే మారినా ఈ పనులు పూర్తి కాకపోగా, ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హయాంలోనైన పూర్తి అవుతాయనే ఆశల్లో జనం, రైతులు ఉన్నారు.

కొత్త మండలాల ఏర్పాటుపై కోటి ఆశలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి అవుతుందని ఆశలు పెట్టుకున్న గంగాధర మండలం గర్శకుర్తి, రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామాల జనానికి నిరాశే మిగిలింది. తాను గెలిస్తే నూటికి నూరు శాతం గర్శకుర్తి, గోపాల్‌రావుపేట గ్రామాలను కొత్త మండలాలుగా ఏర్పాటు చేస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేసిన వాగ్దానంపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు.

వరద కాలువలకు తూంలు ఏర్పాటు చేయాలి

చొప్పదండి, గంగాధర, రామడుగు, బోయినపల్లి మండలాల్లోని పలు గ్రామాల చెరువుల్లో నీరు నింపేందుకు వరద కాలువలకు తూంలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కుడి కాలువ తవ్వకం పనులు పూర్తైతే గంగాధర మండలం ఉప్పరమల్యాల, గర్శకుర్తి, బోయినిపల్లి మండలం బోయినపల్లి, స్తంభంపల్లి గ్రామాల్లో చెరువులు నింపడానికి తూంలను ఏర్పాటు చేయాల్సిందే. వరద కాలువ ఉన్నా తూంలు ఏర్పాటు చేయక చొప్పదండి మండలం గుమ్లాపూర్, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, మంగళపల్లి, రామడుగు మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు నిండక బావుల్లో భూగర్భ జలాలు పెంపు లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు డిమాండ్ చేస్తున్న తూం ఏర్పాటుపై మేడిపల్లి దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయా మండలాలు, గ్రామాల రైతులు మొరపెట్టుకుంటున్నారు.

నిర్వాసితుల ఎదురు చూపులు

పదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గంగాధర మండలం నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి (ఎన్), బోయినిపల్లి మండలం కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లితోపాటు మిడ్ మానేరు భూ నిర్వాసితులు నష్ట పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. నారాయణపూర్, మంగపేట గ్రామాలను ముంపు కింద గుర్తించి నష్ట పరిహారం అందించి పునరావాసం కల్పించాలనే ఆయా గ్రామాల ప్రజలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. మిడ్ మానేరులో ఇళ్ళు, భూములు కోల్పోయిన భూ నిర్వాసితులు సైతం యువతకు జీవన భృతి కల్పించాలని, మరింత నష్ట పరిహారం ఇవ్వాలనే డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వాగ్దానం చేసిన మేడిపల్లి నిర్వాసితులు ఆశలు పెట్టుకున్నారు.

రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలు..

గంగాధర మండలం పోతుగంటిపల్లి ప్రధాన రహదారి నుండి కాసారం మీదుగా గర్శకుర్తి వరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగానే ఉండి పోయింది. రామడుగు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. కొడిమ్యాల మండలం పోతారం ప్రాజెక్టుపై మత్తడి నిర్మాణం, మల్యాల మండలంలోనూ పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి.

రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గద బహూకరణ



నవతెలంగాణ - చొప్పదండి

తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మొదటిసారిగా కరీంనగర్ జిల్లా కేంద్రానికి బుధవారం వచ్చిన సందర్భంగా కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామిడి రాజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. గదను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు అందజేసి కలి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట నడిపెల్లి అశోక్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించిన నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న తుమ్మేటి

నవతెలంగాణ - జమ్మికుంట

రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ మొదటిసారిగా కరీంనగర్‌కు విచ్చేసిన సందర్భంగా ఆయన్ని జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు కలిసారు. శాలువా పూలమాలలతో మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, టీపీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ మెంబర్ సాయిని రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కసుబోసుల వెంకన్న, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొన్నగంటి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండ్ రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీ ప్రగతి విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ - రామడుగు : కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ తైక్వాండో పోటీలో మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి హైస్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ బుధవారం తెలిపారు. అండర్ 14, 25 కిలోల విభాగంలో ఆరోతరగతి విద్యార్థి బొజ్జ ప్రణయ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని, తైక్వాండో మాస్టర్ సంతోష్‌ను, పాఠశాల నిర్వాహకులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



నవతెలంగాణ - తిమ్మాపూర్ : చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కరీంనగర్ అక్షర లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, సుందగిరి పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఎడబోయిన రవీందర్‌రెడ్డి రూ.30వేల విలువగల వాటర్ ప్యూరిఫైయర్, కంప్యూటర్ సిపియు బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పావని కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జీల సంపత్ రవీందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయూసీని గెలిపించండి'



నవతెలంగాణ-గోదావరిఖని : ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గడియారం గుర్తుపై ఓటు వేసి ఐఎన్‌టీయూసీని భారీ మెజారిటీతో గెలిపించాలని యూనియ్ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లు నర్సింహారెడ్డి, ధర్మపురి కార్మికులను అభ్యర్థించారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 2ఏ నుంచి 30 మంది, ఏరియా వర్క్‌షాప్ నుంచి 20 మంది ఐఎన్‌టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యూనియన్ ఆర్జీ-1 ఉపాధ్యక్షులు సదానందం, 2ఏ గని కార్యదర్శి సదానందం, వర్క్ షాప్ ఫిట్ కార్యదర్శి పర్వేష్ ఉద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలలో సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జ్ వికాస్ కుమార్ యాదవ్, సెంట్రల్ జాయింట్ జనరల్ సెక్రెటరీ దేవులపల్లి రాజేందర్, సెంట్రల్ జాయింట్ జనరల్ సెక్రెటరీ ఆరేపల్లి శ్రీనివాస్, సెంట్రల్ సెక్రెటరీ బత్తుల పోచయ్య, సెంట్రల్ సెక్రెటరీ మల్లికార్జున్, మీడియా ఇన్‌చార్జి పోలు మహేష్ బాబు, బ్రాంచ్ కోఆర్డినేటర్ అన్వేష్, బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీని తొలగించి ఆటస్థలానికి కేటాయించాలి



పాఠశాల ఆవరణంలో ఉన్న నర్సరీ

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాల చాలాకాలంగా పిల్లలు లేక మూతపడింది. ఆ పాఠశాల ఆవరణలో గ్రామ పంచాయతీకి సంబంధించిన నర్సరీని నిర్వహిస్తున్నారు. పాఠశాల ఆవరణలో తమ ఏరియాలోని పిల్లలు ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్‌గా వాడుకునేందుకు అనుమతి గురించి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓకు స్థానికులు వినతిపత్రం ఇచ్చారు. సర్పంచ్ సొంత స్థలంలో నిర్వహించిన నర్సరీని అక్కడనుండి తొలగించి ఇండ్ల మధ్యలో గల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారని చెప్పారు. దీంతో పాములు, తేళ్ల తిరుగుతున్నాయని వాపోయారు. ఇండ్ల మధ్య నుంచి నర్సరీని తొలగించాలని సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి 2సంవత్సరాల నుండి రెండు మార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు సాంబయ్య, మధు, ఎండి రఫీ, ఎండి సలీం, రమేష్, సారయ్య, కృష్ణస్వామి, ఎండి రియాజ్ ఉన్నారు.

మహిళా సాధికారత దిశగా ఉచిత బస్సు ప్రయాణం

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - కరీంనగర్

మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు మహిళా సాధికారతను సాధించే దిశగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మహాలక్ష్మి పథకం ద్వారా టీఎస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచే కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. మొదటగా రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయం 10 లక్షల పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించి, అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని బస్సు ఎదుట జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఫోటో గుర్తింపు కార్డు ఆధారంగా జీరో చార్జీ టికెట్ ఇస్తారన్నారు. ఇది మహిళా సాధికారతకు దోహదపడడంతో పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణం వల్ల మహిళలకు రక్షణ ఉంటుందని అన్నారు. అనంతరం బస్సులో పిల్లలు, మహిళలు, థర్డ్ జండర్‌లతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కోర్ట్ చౌరస్తా, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, గీతాభవన్ మీదుగా బస్టాండ్ వరకు కలెక్టర్ ప్రయాణం చేశారు. కార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ మాధవి, జిల్లా వైద్యాధికారి కె.లలితాదేవి, డీడబ్లూఓ సరస్వతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, ఆర్టీసీ 1 డిపో డీఎం ఎల్.మల్లేషం, డిపో2 డీఎం వి.మల్లయ్య, వైద్యులు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రజనీకృష్ణ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని అభిందిస్తున్న చైర్మన్

నవతెలంగాణ - రామడుగు

మండలంలోని గోపాల్ రావుపేట అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థిని జి.సుధీష్ణ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీన తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన జూనియర్ బాలికల పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచి ఈ నెల 16 నుండి18 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సుధీష్ణను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంఘం మండల అధ్యక్షుడిగా డాక్టర్ వేముల అశోక్



నవతెలంగాణ - జమ్మికుంట

సమాజంలో కలలను ప్రోత్సహించి కళాకారులను సమాజానికి అందించడమే తమ లక్ష్యమని కరీంనగర్ జిల్లా సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు వైఎస్ శర్మ తెలిపారు. బుధవారం హుజురాబాద్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండల సాంస్కృతిక కళాకారుల సమాఖ్య నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ వేముల అశోక్ ఏకగ్రీవంగా, ఉపాధ్యక్షుడిగా రంగు లింగయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కళాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించి వారి ప్రతిభను బట్టి కళను చూపించే అవకాశం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల కొమురెల్లి, డైరెక్టర్ నర్సింగోజు రవీంద్రచారి, వీణవంక మండల గౌరవ అధ్యక్షుడు రామస్వామి, అధ్యక్షుడు గడ్డం నారాయణ, గోనెల సమ్మయ్య, దూలం సురేష్, శంకరపట్నం మండల అధ్యక్షుడు పడాల సత్తన్న, వల్బాపూర్ గ్రామ గౌరవ అధ్యక్షుడు రాజమౌళిగౌడ్, మాజీ సర్పంచ్ కొమురయ్య, నాంపల్లి కొమురయ్య పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



నవతెలంగాణ - జమ్మికుంట

హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్‌ను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండలం అర్నకొండ గ్రామానికి చెందిన తమ్మడి కొమురయ్య, పట్టణానికి చెందిన మాచర్ల హనుమంతు ఇటీవల మృతిచెందాడు. వారి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ గొల్ల సునందగట్టయ్య, యాదవ సంఘం మండల అధ్యక్షుడు రాపెల్లి ఐలయ్య, సిపెల్లి గంగయ్య, జహీర్, వార్డు సభ్యులు అశోక్, రాజయ్య ఉన్నారు.

సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న మల్లేష్



నవతెలంగాణ - రామడుగు

రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పోలీసు కానిస్టేబుల్ దాసరి మల్లేషం కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నకల్లో బాధ్యతగా విధులు నిర్వహించిన కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ దాసరి మల్లేషం కరీంనగర్ సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. లక్ష్మీపూర్ గ్రామస్తులు అభినందించారు.

గెలిచిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

తఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-కరీంనగర్

శాసనసభ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సీపీఐ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల్లో పెల్లుబుకిన అసంతృప్తి వల్ల ప్రజలు ఓట్ల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలు ఆకర్షణీయంగా ప్రవేశ పెట్టినప్పటికీ ప్రజలు పథకాలను చూసి అధికారం ఇవ్వలేదని, దొరల పాలన పోవాలని, ప్రజాస్వామ్య యువత పరిపాలన అందిస్తారనే నమ్మకంతో అట్టడుగున ఉన్న కాంగ్రెస్‌ను గెలిపించారని అన్నారు. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో కాంగ్రెస్ ప్రజలను విస్మరించవద్దని, ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు అందించాలని లేకపోతే ప్రజల పక్షాన సీపీఐ ప్రశ్నిస్తుందన్నారు. 60గజాల ఇండ్ల స్థలంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించిన వాటిని పంపిణీ చేయాలని, నిర్మాణ దశలో ఉన్న వాటిని పూర్తి చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని తెలిపారు. కార్మిక వర్గానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గత పాలకుల అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో కరీంనగర్ జిల్లాలో అనేక అక్రమాలు, భూ దందాలు, అవినీతి, అణచివేతలతో పరిపాలన కొనసాగించారని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆయనతో పాటు వారి అనుచరులు చెరువులు, కుంటలు, అసైన్డ్ భూములు కబ్జాలు చేశారని, ప్రభుత్వం పేదలకు ప్రభుత్వ భూమి ఇస్తే వాటిని కూడా గుంజుకున్నారని వాటన్నింటిపై సమగ్రమైన విచారణ జరిపించి భూ అక్రమన దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో మానేరు రివర్ కోసం 100 కోట్లతో ముందుగా టెండర్లు పిలిచినప్పటికీ అదనంగా 150 కోట్ల నుంచి 200 కోట్లకు పెంచారని, అక్కడి కాంట్రాక్టర్ వద్ద నుంచి శ్వేతా కన్స్ట్రక్షన్ వారు సబ్ కాంట్రాక్టు తీసుకొని పనులు చేస్తూ అందులో కూడా 150కోట్లకు పైగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రివర్ పక్కనే తనకు భూమి ఉందని, దాని పక్కనే ప్రభుత్వ భూమి కూడా ఉందని, దాన్ని కూడా ఆక్రమించారని, ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, అక్రమంగా అదనంగా పిలిచిన టెండర్లపై సమగ్రమైన విచారణ జరిపి ఆ సందర్భంగా నిర్మాణ పనుల కోసం విడుదల చేసిన డబ్బులను ప్రభుత్వం రికవరీ చేయాలని, అందుకు నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. వాటన్నింటిపై జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోనగిరి మహేందర్, బూడిద సదాశివ, నాయకులు న్యాలపట్ల రాజు, నునావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

15లోపు మెరిట్ జాబితాపై అభ్యంతరాలను తెలియజేయాలి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : ఈనెల 15లోపు మెరిట్ జాబితాపై అభ్యంతరాలను తెలుపాలని కరీంనగర్ వారధి సొసైటీ మెంబర్ సెక్రెటరీ జి. అంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఖాళీగా ఉన్న స్టోర్ కీపర్, స్టెనో టైపిస్ట్, రికార్డ్ క్లర్క్, రికార్డ్ అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ అటెండెంట్స్, డార్క్ రూం అసిస్టెంట్, డిజిటల్ ఇమేజింగ్ టెక్నాలజిస్ట్, రేడియోగ్రఫీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, సిటీ స్కాన్ టెక్నీషియన్, అనస్థీషియా టెక్నీషియన్, దోబి, ప్యాకర్స్, ఎలక్ట్రీషియన్ ఫోర్మెన్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసీ మెకానిక్, డ్రైవర్, థియేటర్ అసిస్టెంట్, గ్యాస్ ఆపరేటర్, వార్డ్ బాయ్, సబ్ స్టాఫ్ ఉద్యోగ ప్రకటనకు సంబంధించి వారధి సొసైటీ పెద్దపల్లి కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారు.. తిరస్కరించిన అభ్యర్థుల జాబితాను పోస్టుల వారీగా ఈనె 13 నుంచి ప్రదర్శిస్తున్నామని తెలిపారు. జాబితాలో అభ్యర్థుల వ్యక్తిగత, మార్కుల వివరాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత డాక్యుమెంట్లతో ఈనెల 15 సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు.

మొక్కు చెల్లించుకున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మల్లాపూర్ : కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గెలుపొందడం పట్ల మల్లాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు బిట్ల నరేష్, మచ్చర్ల దశ రెడ్డి వేములవాడ రాజరాజేశ్వర పుణ్యక్షేత్రంలో కోడెమొక్కులను బుధవారం చెల్లించుకున్నారు. డాక్టర్ సంజయ్ ఎమ్మెల్యేగా గెలు పొందాలని ఎన్నిక సమయంలో ముడుపు కట్టినట్టు తెలిపారు. భారీ మెజార్టీతో డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఎమ్మెల్యేగా గెలు పొందడంతో ఈ మొక్కులు చెల్లించుకున్నట్టు వారు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-మల్లాపూర్ : మండల కేంద్రానికి చెందిన గొట్టి పడత రాజు ఇటీవల బతుకుదెరువు నిమిత్తం సౌదీకి వలస వెళ్లాడు. అక్కడ రాజు అనారోగ్యం పాలవ్వగా తిరిగి స్వదేశానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబానికి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిట్యాల లక్ష్మణ్, మేకల సతీష్, కనికారపు సంజయ్, సంఘ గంగా రాజం ఆర్థిక సాయం అందజేశారు.

కిక్ బాక్సింగ్‌లో శ్రీ గ్లోబల్ హై స్కూల్ ప్రతిభ



నవతెలంగాణ-బుగ్గారం : రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో శ్రీ గ్లోబల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 14 లైట్ కాంటాక్ట్ ఫైట్ విభాగంలో శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్‌లను ఏడుగురు విద్యార్థులు సాధించారాని ప్రిన్సిపాల్ నక్క రాజు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కిక్ బాక్సింగ్ మాస్టర్ మామిడిపెల్లి గణేష్, కిక్ బాక్సింగ్ మాస్టర్ కస్తూరి ప్రవీణ్ కుమార్, కిక్ బాక్సింగ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

లింగాపూర్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచిగా హారిక



నవతెలంగాణ-పెగడపల్లి : పెగడపల్లి మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాల్సాని హారిక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ ఈరెల్లి శంకర్ గత నెల 15న గుండెపోటుతో మృతి చెందాడు. ఉపసర్పంచ్‌గా ఉన్న హారికను లింగాపూర్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా జిల్లా జిల్లా పంచాయతీ అధికారులు నియమించారు. ఆమె బుధవారం పంచాయతీ పాలకవర్గ సభ్యుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఎంపీటీసీ పూసాల శోభ తిరుపతి, ఉపసర్పంచ్ బొల్లారపు సురేష్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, తిమ్మాపూర్‌లో డిసెంబర్ 26 తేది నుండి హౌజ్ వైరింగ్ లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ తెలిపారు. 18 నుండి 45 సంవత్సరాలో లోపు (కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల) జిల్లాలకు చెందిన గ్రామీణ పురుషులు అర్హులని చెప్పారు. ఎస్ఎస్సి మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 5 ఫోటోలు, బ్యాంకు పాస్ బుక్ తీసుకొని శ్రీ చైతన్య విద్యా సంస్థలు, తిమ్మాపూర్ ,ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో అప్లికేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ 30 రోజులు అని, శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి ఉంటుందని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9849411002 నెంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు.

మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎంఎస్‌టీఎఫ్ నేతల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నేతృత్వంలో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎంఎస్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు బి కొండయ్య మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. 2013లో యూపీఏ హయాంలో మోడల్ స్కూళ్లు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుతం విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. కానీ నేటికీ అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఆ సమస్యల పరిష్కారం చేయాలని సీఎంను కోరారు. దానికి ముఖ్యమంత్రి స్పందిస్తూ.. తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సోమయ్య శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర విధాన సభ సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక కాబోతున్న గడ్డం ప్రసాద్‌ను తెలంగాణ రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి సోమయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు టి.బెన్సన్, జె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు మండలి చైర్మెన్ గుత్తా శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం శాసనమండలిలోని తన ఛాంబర్‌లో వారికి ఆయనే పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, కొండ సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ నామినేషన్ సందర్భంగా బుధవారం సీఎంతో పాటు పలువురు మంత్రులు అసెంబ్లీకి రాగా ఆయన అందరినీ పేరు పేరునా పలకరించారు. కొత్త ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందించాలని ఆకాంక్షించారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి గొంతునొప్పి

- యశోద ఆస్పత్రిలో చికిత్స..కవిత పరామర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన గొంతునొప్పితో తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. దీంతో ఆయన యశోద ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. ఎన్నికల సమయంలోనూ ఆయన తీవ్ర గొంతు నొప్పికి గురయిన విషయం తెలిసిందే. ఆయనకు పెద్దగా ప్రమాదమేమీ లేదని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బెంగళూరులో ఆరు చోట్ల ఎన్ఐఏ సోదాలు

బెంగళూరు: కర్నాటకలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) సోదాలను ముమ్మరం చేసింది. బెంగళూరులో దాదాపు ఆరు ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు పాల్పడేందుకు ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ కుట్ర పన్నిందన్న సమాచారంతోనే జాతీయ దర్యాప్తు సంస్థ ఈ దాడులు చేపడుతున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రోజులు క్రితం.. మహారాష్ట్ర, కర్నాటకల్లోని 44 ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు జరిపి.. ఐసిస్ మాడ్యూల్ నాయకుడితో సహా మొత్తం 15 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలోని పడఘా బోరివలీ, థాణె, పుణె.. అటు కర్నాటకలోని బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఏకకాలంలో ఎన్ఐఏ బందాలు సోదాలు నిర్వహించి భారీ మొత్తంలో లెక్కలోకి రాని నగదు, తుపాకులు, ఇతర ఆయుధాలు, కొన్ని పత్రాలు, స్మార్ట్ ఫోన్లు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్ ప్రమాణ స్వీకారం

భోపాల్ : మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ మంగూబాయ్ పటేల్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రులుగా రాజేంద్ర శుక్లా, జగదీశ్ దేవ్డా ప్రమాణం చేశారు. భోపాల్ పరేడ్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాతోపాటు మరికొందరు కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందు మోహన్ యాదవ్ భోపాల్‌లోని ఓ ఆలయంలో పూజలు నిర్వహించారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

- జంతర్ మంతర్‌లో బీసీ సంఘాల ఆందోళన

న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అలాగే బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రయివేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు పెట్టాలన్నారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన చేపట్టారు. ఎంపీలు బీద మస్తాన్ రావు, బడుగుల లింగయ్య యాదవ్, కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు, ఇతర నేతలు ఈ నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య ప్రసంగిస్తూ... అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టిన కేంద్రం, ఆ వర్గానికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు, బర్రెలు, పందులు, పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని శాశ్వత బిచ్చగాళ్లుగా మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్ల పై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. వెనకబడిన వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు.

నాడు అతి.. నేడు స్తుతి..

- వత్తాసు ఆఫీసర్లలో వణుకు
- మంత్రి తుమ్మల వ్యాఖ్యలతో టెన్షన్
- ఇప్పటికే క్లాసులు పీకుతున్న మంత్రులు
- ఓవరాక్షన్ ఆఫీసర్లకు హెచ్చరికలు..
- మంత్రుల మెప్పు కోసం ఎడతెగని యత్నాలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మళ్లీ బీఆర్‌ఎస్సే అధికారంలోకి వస్తుంది.. ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా వారే ఉంటారనే భావనతో కొందరు అధికారులు అప్పట్లో ఓవరాక్షన్ చేశారు. కానీ దానికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో వత్తాసు ఆఫీసర్లలో వణుకు మొదలైంది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏడో తేదీన కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మొత్తం 11 మందికి మంత్రివర్గంలో చోటు లభించింది. వీరిలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ, చేనేత, సహకారం, టెక్స్‌టైల్స్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిఇ.. ఈ ముగ్గురు అమాత్యులు ఖమ్మం జిల్లాకు చెందినవారు కావడంతో నాడు అతిచేసిన అధికారుల్లో ఆందోళన మొదలైంది. తమపై చర్యలుంటాయేమోనని అణగిమణగి వ్యవహరిస్తున్నారు. కొత్త మంత్రుల దృష్టిలో పడేందుకు నానా తంటాలు పడుతున్నారు. మెప్పు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. నాడు అతి చేసిన అధికారులే నేడు స్తుతి చేస్తున్న తీరును చూసి జనం విస్తుపోతున్నారు.

మంత్రి తుమ్మల సుతిమెత్తని హెచ్చరికలు..

"జిల్లా అధికారులు ఎంతో ఆప్యాయంగా.. అద్భుతంగా పనిచేసే రోజు వచ్చింది. గతంలో ఎవడన్న పనికిమాలినోడి ఒత్తిడి వల్ల మీరు కొన్ని తప్పులు చేసినా.. బాధపడొద్దు. ఆ పాపం వాళ్లది తప్ప మీది కాదని మాకు తెలుసు.. ఇప్పుడైనా సెటిల్‌మెంట్ చేసుకోండి.. ఎక్కడైనా తప్పుడు కేసులు పెట్టినా.. ఎవడైనా కబ్జాలు చేసినా.. బెదిరించినా సీపీ, కలెక్టర్ అవన్నీ సెట్ చేసుకోండి. మీరు ఇక్కడే ఉండాలి.. ఇక్కడే ప్రజలకు సేవ చేయాలి.. మీరు ఎప్పుడూ తెలంగాణలోనే ఉంటారు. ఖమ్మంలో ఉంటారా?.. కరీంనగర్‌లో ఉంటారా? ఎక్కడున్నా ప్రజా సేవ చేయడమే మన భాగ్యం. కానీ గత ఐదేండ్లలో కొన్ని తప్పులు జరిగినవని.. ఎన్నికల ప్రచారంలో తెలిసింది. అవన్నీ మీ దృష్టికి తీసుకు రమ్మని చెబుతాను. తప్పుడు కేసులున్నా.. కబ్జాలున్నా సెటిల్‌మెంట్ చేసే బాధ్యత మీ ఇద్దరిపైనే ఉంది." అని మొన్న ఆదివారం పాతబస్టాండ్‌లో





ఏర్పాటు చేసిన మీటింగ్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సుతిమెత్తగా అధికారులను హెచ్చరించారు.

నాటి తప్పిదాలతో నేడు ఆందోళన..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా దురుసుగా వ్యవహరించిన ఆఫీసర్లలో ఆందోళన మొదలైంది. ముఖ్యంగా 2018 ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున ఎమ్మెల్యేలుగా ఎన్నికై...ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలకు కొందరు అధికారులు కొమ్ముకాశారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి నెగ్గి నాటి ప్రభుత్వంలో రవాణాశాఖమంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్‌కుమార్ కనుసన్నల్లోనే కొందరు అధికారులు నడుచుకున్నారు. స్వపక్షమైనా.. విపక్షమైనా.. ఆయన చెప్పిందే వేదం అన్నట్టుగా కొందర్ని తీవ్రంగా వేధించారనే ఆరోపణలున్న అధికారుల్లో ఇప్పుడు టెన్షన్ మొదలైంది. ముఖ్యంగా ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం వంటి జనరల్ నియోజకవర్గాలతో పాటు సత్తుపల్లి, పినపాక తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు ఆఫీసర్లను తమ ఇష్టానుసారం వాడుకున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల సమయంలోనూ కొందరు అధికారులు 'కారు'పై మమకారం.. కాంగ్రెస్‌పై చీత్కారం ప్రదర్శించారనే అభియోగాలు ఎదుర్కొంటున్నారు. అప్పట్లో బీఆర్‌ఎస్‌లోనే ఉన్న తుమ్మల నాగేశ్వరరావు తన అనుచరులను ఇబ్బంది పెడుతున్న తీరును అప్పటి సీపీ తఫ్సీర్‌ఇక్బాల్, ఆ తర్వాత విష్ణు ఎస్ వారియర్ దృష్టికి రెండు, మూడు పర్యాయాలు తీసుకెళ్లారు. కానీ సంబంధిత అధికారులు పెడచెవిన పెట్టారు. తన మనుషులను వేధిస్తున్నట్టు నాడు బీఆర్‌ఎస్‌లోనే ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా తన అనుచరులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఆ కేసు ఏమైందో కూడా ఇప్పటి వరకూ తెలియదు. ఇలాంటి అనేక ఘటనలు నాటి ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్నాయి. వీటిపై ఇప్పుడు ఎలాంటి చర్యలుంటాయోనని సంబంధిత అధికారుల్లో ఆందోళన నెలకొంది.

నాడు లోపాలు ఎత్తిచూపినా కేసులే..

నాటి ప్రభుత్వ హయాంలో ఖమ్మంలో వివిధ నిర్మాణాలు చేపట్టారు. రూ.24 కోట్లతో నూతనంగా నిర్మించిన బస్టాండ్, రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన కార్పొరేషన్ భవనం, డబుల్‌బెడ్‌రూమ్‌లు కొద్దిపాటి వర్షానికే కురుస్తుండటాన్ని సీపీఐ(ఎం) నేతలు వై.విక్రమ్, వెంకన్న వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దాంతో వారిపై కేసులు నమోదయ్యాయి. లోకాయుక్తలో ఈ కేసు నడుస్తోంది. అలాగే కాంగ్రెస్ నేతలు ముస్తఫా, మిక్కిలినేని నరేంద్ర, ఆర్టీఐ యాక్టివిస్టు కోయిని వెంకన్నలపై పీడీ యాక్టులు నమోదు చేసి నెలల తరబడి జైళ్లలో ఉంచారు. చివరికి వివిధ యూట్యూబ్ చానల్స్‌కు నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాయిస్‌లు ఇచ్చిన ఆటోడ్రైవర్లు, తదితరులపైనా దాడులు చేయడమే కాకుండా.. తిరిగి వారిపైనే కేసులు పెట్టిన ఉదంతాలు ఉన్నాయి. దీనికి బాధ్యులైన అధికారులు తమపై ఎలాంటి చర్యలు ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు.

రెవెన్యూ, పోలీస్ అధికారుల్లోనూ టెన్షన్..

అక్రమ రిజిస్ట్రేషన్‌లు, కబ్జాలకు వత్తాసు పలికిన రెవెన్యూ అధికారులు కొందరు ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ వివిధ శాఖల బాధ్యతలు చూస్తున్నారు. రూ.కోట్ల అక్రమార్జనకు పాల్పడిన ఆ తహసీల్దార్లలో ఇప్పుడు టెన్షన్ నెలకొంది. ఎన్నికల సమయంలోనూ సంబంధిత ఆఫీసర్లు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. పాలేరు నియోజకవర్గంలోని రూరల్ పోలీసు ఉన్నతాధికారి, నేలకొండపల్లి, కూసుమంచి పోలీసు అధికారులు ఎన్నికల సమయంలో విపక్షాలతో వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ఆన్‌లైన్ ప్రక్రియ విషయంలో బీఆర్‌ఎస్ మినహా మిగిలిన పార్టీలను ఇబ్బందిపెట్టారనే ఆరోపణలున్నాయి. నేలకొండపల్లిలో సీజ్ చేసిన కాంగ్రెస్ నేత ప్రచార వాహనాన్ని రోజుల తరబడి ఇవ్వకుండా ఇబ్బందిపెట్టారని చెబుతున్నారు. ఇప్పుడు ఆ అధికారులు నూతన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దగ్గర మోకరిల్లుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పోలీసు, రెవెన్యూ అధికారులను పిలిపించి మంత్రి సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఇలా అప్పట్లో తప్పులు చేసిన అధికారులు ఇప్పుడు తీరని మనోవేదన చెందుతున్నారు.

ప్రతిపాదనలు ఘనం... పెట్టుబడులు స్వల్పం

ఇదీ జమ్మూకాశ్మీర్ పరిస్థితి

- వాస్తవాలు కప్పిపెడుతున్న కేంద్రం

శ్రీనగర్ : ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానానికి ఓ విషయాన్ని తెలియజేసింది. ఈ అధికరణ జమ్మూకాశ్మీర్ అభివృద్ధికి, పురోగతికి అవరోధంగా ఉన్నదని చెప్పింది. దీనిని రద్దు చేయాలని 2019 ఆగస్ట్ ఐదున పార్లమెంట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మొదలైందని తెలిపింది. అయితే కేంద్ర ప్రభుత్వ వాదనలో ఏ మాత్రం వాస్తవం లేదని గణాంకాలు రుజువు చేస్తున్నాయి.

జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం 2021 జనవరిలో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. గత మూడు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం 42 పారిశ్రామిక రంగాలలో రూ.84,544 కోట్ల విలువైన ప్రతిపాదనలు అందుకుంది. అయితే వీటిలో కార్యరూపం దాల్చినవి చాలా తక్కువ. ఇప్పటి వరకూ జమ్మూలో 266, కాశ్మీర్‌లో 148... మొత్తం 414 యూనిట్లు నమోదయ్యాయి. వీటి ద్వారా వచ్చిన పెట్టుబడులు కేవలం రూ.2,518 కోట్లు మాత్రమే.



జమ్మూకాశ్మీర్‌లో ఆతిథ్య రంగం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ అక్కడ హోటళ్ల ఏర్పాటుకు ఇప్పటి వరకూ కేవలం రూ.87 కోట్ల విలువ కలిగిన ప్రతిపాదనలు మాత్రమే వచ్చాయి. భూ సమస్య కారణంగా ఆశించిన స్థాయిలో పెట్టుబడిదారులు ముందుకు రావడం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

జీ-20 సదస్సు సందర్భంగా దేశానికి వచ్చిన విదేశీ ప్రతినిధులను ప్రభుత్వం కాశ్మీర్‌కు తీసికెళ్లి అక్కడ పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతగా అవకాశాలు ఉన్నాయో వివరించింది. అయినప్పటికీ ఆశించిన ఫలితం చేకూరలేదు. వాస్తవాలు ఇలా ఉంటే సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదన మరోలా ఉంది. 'తాము ఏమి కోల్పోయామో ప్రజలు ఇప్పుడు తెలుసుకుంటున్నారు. ఇప్పుడు పెట్టుబడులు వస్తున్నాయి. పోలీస్ వ్యవస్థ కేంద్రం అధీనంలో ఉండడంతో టూరిజం మొదలైంది. 16 లక్షల మంది పర్యాటకులు వచ్చారు' అని ఆయన చెప్పుకొచ్చారు.

విలువకు సంబంధించిన పెట్టుబడి ప్రతిపాదనల్లో 60% జమ్మూకు చెందినవి కాగా మిగిలినవి కాశ్మీర్‌కు చెందినవి. కానీ సంఖ్యాపరంగా చూస్తే జమ్మూకు 1,551 ప్రతిపాదనలు, కాశ్మీర్‌కు 4,566 ప్రాతిపాదనలు వచ్చాయి. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ఆశాభావంతో ఉంది. పెట్టుబడులకు సంబంధించి రూ.28,400 కోట్ల కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక పథకం ఇప్పటికే తన కోటాను పూర్తి చేసుకుంది. ఈ ప్రోత్సాహక పథకంలో అదనంగా రూ.75 వేల కోట్లు చేర్చాలన్న ప్రతిపాదన కేంద్రం వద్ద సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉంది.

పెట్టుబడిదారులకు అందజేసేందుకు జమ్మూకాశ్మీర్‌లో ప్రభుత్వ భూములేవీ ఖాళీగా లేవు. భూసేకరణ కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ అందుకు కొంత సమయం పడుతుంది. జమ్మూకాశ్మీర్‌లో జేఎస్‌డబ్ల్యూ, హెచ్‌ఎఫ్‌సీఎల్ వంటి కొన్ని బడా కంపెనీలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. ప్రారంభంలో అపోలో హాస్పిటల్స్ కొంత ఆసక్తి చూపినప్పటికీ ఆ తర్వాత వెనకడుగు వేసింది.

ఎన్ఐఆర్‌డీపీఆర్, జీబీపీఎన్ఐహెచ్‌ఈ మధ్య ఎంఓయూ

- గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో పరస్పర సహకారం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, వ్యవసాయ ఆధారిత జీవనోపాధి వ్యూహాలు, ఉపాధి కల్పనలో సంయుక్త భాగస్వామ్యంలో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) హైదరాబాద్, జీబీ పంత్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ మధ్య బుధవారం అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ రిజిస్ట్రార్ మనోజ్‌కుమార్, సహజ వనరుల నిర్వహణ, వాతావరణ మార్పు, విపత్తు నిర్వహణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ రవీంద్ర గావలి, ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్, ఉన్నతాధికారులు డాక్టర్ కేశవరావు, డాక్టర్ కతిరేసన్, ప్రొఫెసర్ సునీల్ నౌటియల్, డాక్టర్ రాకేశ్ కుమార్ సింగ్, డాక్టర్ జగదీశ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయాధారిత జీవనోపాధి వ్యూహాలు, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కార్యక్రమాలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి కల్పన తదితర అంశాల్లో ఈ రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేయనున్నాయి. డైరెక్టర్ జనరల్ నరేంద్ర కుమార్



మాట్లాడుతూ..వ్యవసాయ ఆధారిత జీవనోపాధి కార్యకలాపాలను ప్రోత్సహించడంలో రెండు సంస్థలూ కీలకమైనవని చెప్పారు. నరేగా, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ అమలు, గ్రామీణ ప్రాంతాల్లో కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, సాంకేతిక సహకారం, ఉపాధి కల్పన, జీవనోపాధి ఎంపికలు, షెడ్ మేనేజ్‌మెంట్, విలేజ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామ పంచాయతీలను ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాల్లో కలిసి పనిచేస్తామని చెప్పారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా మార్కెటింగ్ చేసి గ్రామీణ ప్రజలకు జీవనోపాధిని పెంచేందుకు మరింత సమన్వయంతో ముందుకెళ్తామని వివరించారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని..

- పంటచేనులోనే దంపతుల ఆత్మహత్యాయత్నం..
- భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

నవతెలంగాణ- కేసముద్రం రూరల్

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట.. తుఫాను ప్రభావంతో పాటు తెగుళ్లతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని పంట చేనులోనే దంపతులు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. వెంటనే వారిని చికిత్సకు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమం ఉంది. ఈ హృదయవిదారకర సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని క్యాంపు తండాలో జరిగింది. బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ వీరన్న(40), లలిత దంపతులకు వారసత్వంగా వచ్చిన మూడున్నర ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎకరంన్నర భూమిలో మిర్చి, ఎకరం భూమిలో పత్తి సాగు చేశారు. మిర్చికి గుబ్బ రోగం రాగా పంటను కాపాడుకోవడానికి అప్పులు తెచ్చి క్రిమిసంహారక మందులు పిచికారీ చేశారు. అయినప్పటికీ మిర్చి పంట చేతికి రాకపోగా, పత్తి పంట దిగుబడీ తగ్గిపోయింది. మరో వైపు మిగ్‌జాం తుఫాన్ కారణంగా చేతికి అందివచ్చిన వరి పంట వర్షానికి తడిసి మొలకెత్తింది. మిర్చి, పత్తి, వరి పంటలకు సుమారు రూ.3 లక్షల వరకు అప్పులు తీసుకవచ్చి పెట్టుబడి పెట్టారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులు తీర్చలేమని భావించిన దంపతులు మిర్చి తోట వద్ద ఈ నెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన పక్కపొలం రైతులు చికిత్స కోసం మహబూబాబాద్ ఏరియాస్పత్రికి తరలించారు. వీరన్న పరిస్థితి విషమించడంతో మహబూబాబాద్ నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. లలిత మహబూబాబాద్‌లో చికిత్స పొందుతుండగా, ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు. మృతుని తండ్రి లచ్చు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

ఆర్థిక పరిస్థితి సాకుతో హామీలు తుంగలో తొక్కొద్దు

- వాటిని అమలు చేయాల్సిందే : డీకే అరుణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సిందేననీ, వాటి అమలు కోసం తమ పార్టీ పోరాటం చేస్తుందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. మోడీ గ్యారంటీలకు, ఇతర పార్టీల గారడీ మాటలకున్న తేడా ప్రజలకు తెలుసు కాబట్టే మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిందన్నారు. మోడీనే మూడోసారి ప్రధాని అవుతారని చెప్పారు. రాహుల్ గాంధీకి సన్నిహితంగా ఉండే ఎంపీ సాహూ ఇంట్లో వందల కోట్ల రూపాయలు దొరకటం సిగ్గుచేటని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేననీ, ప్రొటెం స్పీకర్ ఎన్నికే దాని ఉదహరణ అని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిపై బీజేపీ పోరాటాలు చేసి వ్యతిరేకత తీసుకొస్తే కాంగ్రెస్ లబ్దిపొందిందన్నారు. తెలంగాణలో తమ పార్టీకి ఓట్లు, సీట్లు భారీ పెరిగాయనీ, భవిష్యత్ బీజేపీదేనని అన్నారు. ఉత్తర తెలంగాణలో తమ పార్టీ బాగా పుంజుకున్నదనీ, కామారెడ్డిలో తమ పార్టీ అభ్యర్థి మాజీ సీఎం, ప్రస్తుత సీఎంను ఓడించారని తెలిపారు. కిషన్‌రెడ్డి నాయకత్వంలోనే పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో రైతు ఖాతాల్లో రైతు బంధును వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించాలి

మంత్రికి వినతి



నవతెలంగాణ-భువనగిరిరూరల్

సర్పంచుల పదవీకాలం సంవత్సరం పొడిగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల ఫోరమ్ జిల్లా కార్యదర్శి ఎలిమినేటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు బుధవారం హైదరాబాద్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా కారణంగా అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. వాటిని పూర్తి చేసేందుకు సర్పంచ్ ఎన్నికలకు ఒక సంవత్సరం గడువు పెంచాలని కోరారు. ఎన్నికలు కారణంగా అనేక బిల్లులు పెండింగ్ పడ్డాయని, సంవత్సరం గడువు పెంచితే గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్‌లు నసం పద్మ కృష్ణగౌడ్, తాంగ్గేలా పల్లి కల్పన శ్రీనివాస్ చారి తదితరులున్నారు.

వీడీసీకి, మరో గ్రూపు మధ్య గొడవతో.. వేల్పూర్‌లో ఉద్రిక్తత



- 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-వేల్పూర్(కమ్మర్‌పల్లి)

ప్రహరీ విషయంలో వీడీసికి మరో గ్రూప్ మధ్య నెలకొన్న వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రహరీని కూల్చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. దాంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీటీ రోడ్డుకిరువైపులా 50 ఫీట్ల దూరంలో ప్రహరీ నిర్మించుకోవాల్సి ఉన్నా.. దాన్ని దిక్కరించి జీపీ అనుమతి లేకుండా ఓ గ్రూపు ప్రహరీ నిర్మించారని, ఆ గోడను తొలగించాలని డిమాండ్ చేశారు. అయితే గ్రామపంచాయతీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. పెద్దఎత్తున గ్రామస్తులు నిరసన చేపట్టడంతో సమాచారం అందుకున్న అడిషనల్ డీసీపీ జయరాం, ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్, రూరల్ సీఐలు వెంకటేశ్వర్లు, సైదయ్య, వేల్పూర్ ఎస్ఐ వినయ్ అక్కడికి చేరుకొని వీడీసీతో మాట్లాడారు. పలువురు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల సమయం ఇవ్వాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ విధించారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు



నవతెలంగాణ-షాద్‌నగర్

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ తపాలా కార్యాలయం వద్ద గ్రామీణ తపాలా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2016వ సంవత్సరంలో 7వ పే కమిషన్‌ను అమలు చేయకుండా, మరలా కమల చంద్ర కమిషన్‌ను వేశారన్నారు. ఆ కమిషన్ చేసిన అధ్యయనంలో కార్మికుల సేవలను గుర్తించిందని తెలిపారు. కానీ ఆ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం దాచి చోద్యం చూస్తుందన్నారు. తక్షణమే ఆ రిపోర్ట్‌ను బహిర్గతం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత, 8 గంటల పనితో పాటు అన్నీ ప్రయోజనాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు బాలరాజు, శివాజీ నాయక్, విక్రమ్ రెడ్డి, జమిల్, సువర్ణ, మోగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీరపొట్టు అదరహో...!

కూరగాయలు తరిగినప్పుడు ఆ చెక్కును పడేస్తుంటాం. మిగిలిన కూరగాయల సంగతి ఎలా ఉన్నా గానీ ఈసారి బీరకాయ పొట్టును మాత్రం పడేయకండి.. ఎందుకంటే బీరకాయే కాదు, బీర పొట్టుతోనూ నోరూరించే వంటలు చేసి ఇంటిల్లిపాదికీ వడ్డించొచ్చు. ఇలాంటివి ప్రయత్నిస్తే.. రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం.. మరెందుకు ఆలస్యం బీరపొట్టుతో ఏమేమి వంటలు చేయొచ్చొ ఓ సారి ప్రయత్నిద్దామా...!



పచ్చడి

కావాల్సిన పదార్థాలు : మినప్పప్పు, తెల్లనువ్వులు - పావుకప్పు చొప్పున, బీరపొట్టు - కప్పు, జీలకర్ర - చెంచా, చింతపండు - కొద్దిగా, బెల్లం - చిన్నముక్క, ఉప్పు - సరిపడా, నూనె - చెంచా, ఎండుమిర్చి - ఐదారు.

తయారు చేసే విధానం : చింతపండును నీళ్లల్లో నానబెట్టుకుని రసం తీసి పెట్టుకోవాలి. తెల్ల నువ్వుల్ని నూనెలేకుండా వేయించుకుని తీసుకోవాలి. కడాయిలో చెంచా నూనె వేడి చేసి బీరపొట్టును వేయించుకుని తీసుకోవాలి. ఇప్పుడు మిగిలిన నూనెను వేసి ఎండుమిర్చి, జీలకర్రా, మినప్పప్పును వేయించుకోవాలి. వేయించిన బీరపొట్టును మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. అందులో వేయించుకున్న తాలింపూ, బెల్లం, తగినంత ఉప్పూ, నువ్వులూ, చింతపండు రసం వేసుకుని పచ్చడిలా రుబ్బుకోవాలి. కావాలనుకుంటే పచ్చడంతా తయారయ్యాక మినప్పప్పూ, ఎండుమిర్చి, కరివేపాకు తాలింపు కూడా కలుపుకోవచ్చు.

వడలు

కావాల్సిన పదార్థాలు : బియ్యం - అరకప్పు, మినప్పప్పు, శెనగపప్పు - చెంచా చొప్పున, కరివేపాకు - పది ఆకులు, పచ్చిమిర్చి - ఐదు లేదా ఆరు, బీరపొట్టు - కప్పు, జీలకర్ర- చెంచా, అల్లం - పెద్ద ముక్క, ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : రెండు గంటల ముందు బియ్యాన్ని నానబెట్టు కోవాలి. కడాయిలో చెంచా నూనె వేడిచేసి ముందుగా మినప్పప్పు, శెనగపప్పు వేయించుకుని తీసుకోవాలి. తర్వాత బీరపొట్టును కూడా పచ్చివాసన పోయేదాకా సన్న మంట మీద వేయించుకుని విడిగా తీసి పెట్టుకోవాలి. అలాగే కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, జీలకర్ర, అల్లం ముక్కలు కూడా నూనెలో వేయించుకుని తీసుకోవాలి. నానిన బియ్యం, శెనగపప్పు, మినప్పప్పు మిక్సీలో వేసుకుని నీళ్లు చల్లుకుంటూ మెత్తగా, గట్టి పిండిలా రుబ్బుకోవాలి. తర్వాత బీరపొట్టు, కరివేపాకు, పచ్చిమిర్చి, తగినంత ఉప్పు, జీలకర్ర, అల్లంముక్కలు మెత్తగా రుబ్బుకుని బియ్యప్పిండిలో కలపాలి. కడాయిలో నూనె వేసి వేడయ్యాక ఈ మిశ్రమాన్ని వడల్లా అద్ది అందులో వేసుకోవాలి. ఎర్రగా వేగాక తీసుకుంటే సరిపోతుంది. ఇవి వేడివేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి.



ఇన్‌స్టంట్ చిప్స్



కావాల్సిన పదార్థాలు : బీరపొట్టు మూడు - నాలుగు కప్పులు (మందంగా వచ్చేలా చెక్కు తీసుకుని ముక్కల్లా చేసుకోవాలి. వీటిని రెండు రోజుల ముందు ఎండలో ఎండబెట్టుకోవాలి), నూనె - వేయించడానికి సరిపడా, ఎండుమిర్చి- రెండు, కరివేపాకు - రెండు రెబ్బలు, ఉప్పు - తగినంత, ఛాట్ మసాలా లేదా ఆమ్‌చూర్ పొడి కొద్దిగా.

తయారు చేసే విధానం : కడాయిలో తగినంత నూనె వేడిచేసి ఎండబెట్టిన బీరపొట్టును వేయించుకుని తీసుకోవాలి. ఇప్పుడు మరో కడాయిలో చెంచా నూనె వేడిచేసి ఎండుమిర్చి, కరివేపాకు వేయించుకోవాలి. బీరపొట్టు వేడిగా ఉన్నప్పుడే ఈ తాలింపూ, తగినంత ఉప్పు, ఛాట్ మసాలా లేదా ఆమ్‌చూర్ పొడి వేసి బాగా కలపాలి. ఈ ఇన్‌స్టంట్ చిప్స్ భలే రుచిగా ఉంటాయి.



పొడి కూర

కావాల్సిన పదార్థాలు : కందిపప్పు - అరకప్పు, బీరపొట్టు - కప్పు, మినప్పప్పు - చెంచా, ఆవాలు, జీలకర్ర - చెంచా చొప్పున, కరివేపాకు రెబ్బలు - కొన్ని, వెల్లుల్లి రెబ్బలు రెండుమూడు, ఉప్పు - తగినంత, నూనె - రెండు టేబుల్స్పూన్లు, పచ్చికొబ్బరి తురుము రెండు చెంచాలు, ఎండుమిర్చి- రెండు.

తయారు చేసే విధానం : బీరపొట్టును ముక్కల్లా కోసి కడిగి ఉడికించుకుని, నీటిని పిండేసి విడిగా ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అలాగే కందిపప్పును కూడా మరీ మెత్తగా కాకుండా ఉడికించి నీటిని వంపేసి తీసి పెట్టుకోవాలి. కడాయిలో నూనె వేడి చేసి మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేయించుకోవాలి. తర్వాత కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలు వేయాలి. ఇవి వేగాక కందిపప్పును వేసేయాలి. ఇది పొడిగా అయ్యాక బీరపొట్టు కూడా వేసి వేయించాలి. కూరంతా పొడిపొడిగా అయ్యాక తగినంత ఉప్పూ, పచ్చికొబ్బరి తురుము వేసి కలిపి దింపేయాలి.

కారప్పొడి




కావాల్సిన పదార్థాలు : బీరపొట్టు - రెండు కప్పులు, శెనగపప్పు, మిన పప్పు, నువ్వులు - పావుకప్పు చొప్పున, ఇంగువ - చిటికెడు, ఎండు మిర్చి ఐదారు, చింతపండు - కొద్దిగా, వెల్లుల్లి రెబ్బలు- ఐదారు, కరివేపాకు - పది ఆకులు, నూనె - పావుకప్పు, ఉప్పు - తగినంత.

తయారు చేసే విధానం : నువ్వుల్ని నూనె లేకుండా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. కడాయిలో రెండు చెంచాల నూనె వేడి చేసి బీర పొట్టును దోరగా వేయించుకోవాలి. పచ్చివాసన, నీరు పోయాక తీసి పెట్టుకోవాలి. అదే కడాయిలో మిగిలిన నూనె వేడి చేసి శెనగపప్పు, మినపప్పు, ఇంగువా, ఎండుమిర్చి, వెల్లుల్లి రెబ్బలు, చింతపండు,కరివేపాకు వేయించుకుని పొయ్యి కట్టేయాలి. ముందుగా బీరపొట్టును మిక్సీలో మెత్తని పొడిలా చేసుకోవాలి. తర్వాత శెనగ పప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, వెల్లుల్లీ, కరి వేపాకూ, చింతపండు తగినంత ఉప్పు మిక్సీలో వేసుకుని పొడిలా చేసుకోవాలి. ఈ కారాన్ని చేసి పెట్టుకున్న బీరపొట్టు పొడిలో వేసి కలిపితే సరిపోతుంది. ఈ పొడిని వేడివేడి అన్నం, నెయ్యితో కలిపి తింటే రుచిగా ఉంటుంది. ఇది వారం వరకూ నిల్వ ఉంటుంది.

విరివిగా వాడుతున్నారా?

కొత్తగా పెండ్లయిన వాళ్లు చాలా వరకు గర్భ నిరోధక మాత్రలను విరివిగా వాడతారు. అలా వాడటం మంచిది కాదంటున్నారు వైద్యులు. అది అనేక అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుందట. అవేంటో తెలుసుకుందాం...



- గర్భం రాకుండా ఉండటానికి ఈ మాత్రలు వేసుకుంటారు. కానీ దీని వల్ల చాలా దుష్ప్రభావాలు ఉన్నాయని చాలామందికి తెలియదు. అయితే అవాంఛిత గర్భధారణను నివారించడానికి ఇది సులభమైన మార్గం. కానీ వీటిని మరీ ఎక్కువ కాలం వాడటం.. శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అంతేగాక హార్మోన్ల అసమతుల్యత కూడా ఏర్పడుతుంది. అందుకే ఈ మాత్రలు తీసుకునే ముందు వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం.
- వైద్య నిపుణుల ప్రకారం.. 25-45 ఏండ్లలోపు మహిళలు ఈ మాత్రలు వాడకూడదు. కానీ కౌమార దశలో ఉన్నవారు దీన్ని పదే పదే ఉపయోగిస్తే అది వారి పునరుత్పత్తి వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. హార్మోన్ల స్థాయిలు లేని యువతులకు ఈ మాత్రలు తీసుకోవడం కూడా ప్రమాదకరం. అలాంటి బాలికలు భవిష్యత్‌లో ఎండోమెట్రియోసిస్, పాలిసిస్టిక్ అండాశయ వ్యాధులతో బాధపడవచ్చు.
- గర్భధారణకు కూడా సమస్యలు ఏర్పడతాయి. గర్భనిరోధక మాత్రలు గర్భాశయం కంటే ఫెలోపియన్‌ను ప్రభావితం చేస్తాయి. ఇది అంతర్గత రక్తస్రావం కలిగిస్తుంది.
- ఈ మాత్రలను ఎప్పటికీ వాడటం వల్ల వంధ్యత్వం, రుతుస్రావం సరిగా రాకపోవడం, స్కిన్ అలెర్జీలు వంటి సమస్యలు వస్తాయి.
- ఈ మాత్రలు శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిలను తగ్గిస్తాయి. అంతేగాక తలనొప్పి, వాంతులు, వికారం, కడుపు నొప్పి మొదలైన సమస్యలు వస్తాయి.
- ఈ మాత్రలలోని సింథటిక్ హార్మోన్లు మూడ్ స్వింగ్‌కు కారణమవుతాయి. దాంతో చికాకు పెరుగుతుంది.
- వీటిని తరుచూ వినియోగిస్తే.. అది మహిళల ఆరోగ్యానికి మానసికంగా హాని కలిగిస్తుందని చాలా పరిశోధనలు వెల్లడించాయి. కొంతమంది మహిళల్లో బరువు పెరగడానికి కూడా ఈ మాత్రలు కారణమయ్యాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

వారానికి ఒక్కసారైనా...

ఎక్కడికైనా బయటకు వెళ్ళేటప్పుడు సర్దుకునే వస్తువుల్లో దువ్వెన ముందుంటుంది. అయితే దీని పట్ల ఎవరూ అంతగా జాగ్రత్తలు తీసుకోరు. కొందరికైతే దువ్వెనను శుభ్రం చేయాలనే ఆలోచన కూడా రాదు. ఇప్పటి కాలంలో బ్యాగుల్లో అన్నం బాక్స్ లేకపోయినా ఉంటున్నారు కానీ, దువ్వెన లేకుండా ఉండడం లేదంటే అతిశయోక్తికాదు. మరి ఇలాంటి దువ్వెనను ఎలా శుభ్రం చేయాలో చూద్దాం..

దువ్వెనలో చిక్కుకుపోయిన జుట్టును పెన్ను లేదా పెన్సిల్‌తో వదులు చేయాలి. ఆ తర్వాత కత్తెర సాయంతో ఎక్కడికక్కడ కత్తిరించి, బయటకు తీయాలి. ఆపై గోరువెచ్చని నీటిలో కొద్దిగా షాంపూ వేసి దువ్వెనను నానబెట్టాలి. ఇక మెత్తని బ్రష్‌తో దువ్వెనను బాగా రుద్దాలి. అలాగని గట్టిగా రుద్దితే దువ్వెనకు ఉండే పళ్ల



విరిగిపోతాయి. కనుక కాస్త చూస్తూ రుద్దాలి.

బాగా రుద్దిన తర్వాత మళ్ళీ గోరువెచ్చని నీటితో బాగా కడిగి పొడి టవల్‌తో తుడిచి ఆరబెట్టాలి. అలానే దువ్వెనను నానబెట్టి నీటిలో షాంపూ స్థానంలో బేకింగ్ సోడా, వెనిగర్‌ను ఉపయోగించవచ్చును. దువ్వెనను వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసుకుంటే మంచిది.



ఇట్ల చేద్దాం

కంది పప్పు ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించేపుడు అందులో కొంచెం మెంతులు కూడా వేస్తే పప్పు తొందరగా ఉడుకుతుంది. తొందరగా అరిగేందుకు సహకరిస్తుంది. మెంతులు చేదుగా ఉంటాయి కాబట్టి కొద్ది మొత్తంలో మాత్రమే ఉపయోగించాలి.

భద్రత డొల్లే

(మొదటిపేజి తరువాయి)

ఆందోళనకు యత్నించారు. పసుపు, ఎరుపు రంగుల పొగను వదిలారు. దీంతో వారిని భద్రతా సిబ్బంది వెంటనే అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఐబీ అధికారులు, సీనియర్ భద్రతా అధికారులు వారిని విచారిస్తున్నారు.



వైఫల్యం.. దర్యాప్తు బాధ్యత నాదే: స్పీకర్ హామీ

మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తారు. భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్చించాలని పట్టుబట్టారు. దీనికి స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. "లోకసభ లోపల ఇద్దరు దుండగులు, బయట మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నాం. వారి దగ్గరున్న వస్తువులను స్వాధీనం చేసుకున్నాం. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతాం. ఆ పూర్తి బాధ్యత నాదే. నిందితులు వదిలింది కేవలం సాధారణ పొగే అని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయితే, నిందితులు వదిలిన గ్యాస్ ఏమిటనే దానిపై సమగ్ర విచారణ జరుపుతాం. సభ్యుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటాం" అని వెల్లడించారు.

భద్రత ఏదీ..?

కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత అధిర్ రంజన్ మాట్లాడుతూ "ఏ సెక్యూరిటీ కనిపించలేదు. ఎంపీలందరూ కలిసి ఆగంతకుడిని పట్టుకున్నారు. ఉదయం అందరం కలిసి 2001 పార్లమెంట్‌పై దాడిలో అమరవీరులను స్మరించుకున్నాం. అదే రోజు, సభలో అలాంటి సంఘటన జరిగింది. ఇది భద్రతలో లోపం" అని అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ మాట్లాడుతూ 'సభలోకి దూసుకొచ్చిన వ్యక్తి చేతిలో ఉన్న వస్తువు(గొట్టం ఆకారంలో) నుంచి పసుపు రంగు గ్యాస్ వెలువడింది. ఆయన నుంచి నేను దానిని లాగి, బయటకు విసిరాను. ఈ ఘటన అతిపెద్ద భద్రతా వైఫల్యం' అని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇది పూర్తిగా భద్రతా వైఫల్యం: డింపుల్ యాదవ్

"లోక్‌సభలోకి చొరబడిన వ్యక్తులు సందర్శకులు కావొచ్చు లేదంటే ఇతరులు కావొచ్చు.. వాళ్ల దగ్గర ట్యాగ్స్ ఏమీ లేవు. దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనని భావిస్తున్నాం. సభలో ఏమైనా జరగవచ్చు" అని ఎస్పీ ఎంపీ డింపుల్ యాదవ్ అన్నారు. "ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.. వాళ్లుకిందకు దూకినప్పుడు వెనుక బెంచీలు ఖాళీగా ఉన్నాయి. దీంతో వాళ్లను పట్టుకున్నాం. ఆ సమయంలో సభలో ఇద్దరు మంత్రులు ఉన్నారు" అని శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ తెలిపారు.

మొత్తం ఆరుగురు ఆగంతకులుగా గుర్తింపు

మరో ఇద్దరు నిందితులను లలిత్, విక్రమ్‌లుగా పోలీసులు గుర్తించారు. నిందితులందరూ తమ బూట్లలో పొగ డబ్బాలను తీసుకెళ్లారని నివేదికలు చెబుతున్నాయి. "తమకు ఏ సంఘంతోనూ సంబంధం లేదు. ప్రభుత్వం పౌరులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నందున ఈ చర్యకు పాల్పడ్డాం" అని నీలం మీడియాతో అన్నారు.

వివిధ ఏజెన్సీలు ఏకకాలంలో నిందితులను విచారించాయి. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు ఉన్నట్టు స్పష్టమైంది. ఈ ఆరుగురు సోషల్ మీడియాలో ఒకరికొకరు కనెక్ట్ అయ్యారు.

ఆరుగురిలో నలుగురిని అరెస్టు చేయగా, ఐదుగురిని గుర్తించగా, ఒకరిని గుర్తించాల్సి ఉంది.

ఫోరెన్సిక్ బృందం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ నుంచి నమూనాలను సేకరించడం పూర్తి చేసింది.

ఆరుగురు నిందితులు ఒకరికొకరు ఆరేండ్లుగా తెలుసునని, కొద్ది రోజుల క్రితం పథకం పన్నారని పోలీసులు తెలిపారు.

ఆరుగురూ పార్లమెంట్‌లోకి ప్రవేశించాలని అనుకున్నారు. కానీ ఇద్దరు మాత్రమే విజిటర్స్ పాస్ పొంది లోపలికి వెళ్లారు.

పార్లమెంటు భద్రతను ఉల్లంఘించేలా ఏదైనా సంస్థ లేదా వ్యక్తి ఆరుగురు నిందితులకు "సూచనలు" ఇచ్చారా? అని భద్రతా సంస్థలు ఆరా తీస్తున్నాయి.

గూడు.. గోడు

(మొదటిపేజి తరువాయి)

కాంగ్రెస్ సర్కారు వీరికి ఇందిరమ్మ ఇండ్ల గ్యారంటీ అందజేస్తుందని గంపెడాశతో వేచి చూస్తున్నారు.

గృహనిర్మాణ శాఖ పునరుద్ధరణకు అడుగులు

ఈనెల 12న గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి గృహనిర్మాణ సంస్థ, రాజీవ్‌స్వగృహ, గృహనిర్మాణ మండలి అధికారులతో సమావేశమైన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా రోడ్లు భవనాల శాఖలో విలీనమైన గృహనిర్మాణ శాఖను పునరద్ధరించేందుకు ఆలోచనలు చేసినట్టు సమాచారం. 1983-87 మధ్య కాలంలోనే సదరు శాఖలో నియమితులైన సిబ్బంది ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 50 నుంచి 60 మంది ఉండేవారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ శాఖ ఆధ్వర్యంలో వేలాది ఇందిరమ్మ ఇండ్లను నిర్మించిన చరిత్ర ఉంది. అయితే అందులో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు సదరు శాఖను ఎత్తేసి రోడ్లు భవనాల శాఖలో విలీనం చేసింది. సిబ్బందిని ఇతర శాఖల్లోకి బదిలీ చేయగా.. అందులో సగం మంది వరకు ఉద్యోగ విమరణ అయినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మళ్లీ ఆ శాఖను పునరుద్ధరించి 'ఇందిరమ్మ ఇండ్ల' నిర్మాణానికి అడుగులు వేసే ఆలోచనలో కాంగ్రెస్ సర్కారు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మూడు, నాలుగు నమూనాలు సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించడంతో మళ్లీ పేదల సొంతింటి ఆశలు చిగురిస్తున్నాయి.

అసంపూర్తిగా 'డబుల్' ఇండ్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో 4438 గృహాలు అసంపూర్తిగా ఉన్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అసలు టెండర్ తీసుకోవడానికి ముందుకురాని ఇండ్లు 16వేల వరకు ఉన్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 23,944 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేసిన బీఆర్ఎస్ సర్కారు అందులో 3929 మాత్రమే పూర్తి చేసింది. అందులో కొన్నింటిని లబ్దిదారులకు పంపిణీ చేసింది.

4438 ఇండ్లు పునాదులు, స్లాబులు, గోడల నిర్మాణ దశలో నిలిచిపోయాయి. ఈ పథకం జాప్యానికి ప్రధానంగా కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడమేనన్న విమర్శలున్నాయి. చాలాచోట్ల కాంట్రాక్టర్లు బిల్లులు రాక నిర్మాణం మధ్యలోనే వదిలిపెట్టారు. మరికొన్ని చోట్ల మార్కెట్‌లో పెరిగిన నిర్మాణ సామాగ్రి ధరల కారణంగా ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ ఏమాత్రమూ సరిపోకపోవడంతో అదనపు భారం మోయాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో నిర్మాణం పూర్తయిన ఇండ్లు, పునాదులు, స్లాబుల స్థాయిలో నిరూపయోగంగా మారిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు దిష్టిబొమ్మల్లా తయారయ్యాయి.

'గృహలక్ష్మి' అటకెక్కినట్టే..

గత ప్రభుత్వం చివరలో ప్రవేశపెట్టిన 'గృహలక్ష్మి' పథకం అటకెక్కినట్టేనని చెప్పొచ్చు. సొంత స్థలం కలిగి ఇల్లు నిర్మించుకునే వారికి దశలవారీగా రూ.3లక్షలు చెల్లిస్తామని చెప్పింది. అది కూడా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే రెన్నెళ్ల ముందు ప్రారంభించిన ఈ పథకానికి ఉమ్మడి జిల్లాలో పేదలు లక్షా 8వేల మందికిపై దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అర్హులుగా గుర్తించిన వారిలో 35825 మందికి ఈ పథకం మంజూరు చేయనున్నట్టు ఆయా జిల్లాల అధికార యాంత్రాంగం ప్రకటించింది. రాష్ట్రంలో మారిన ప్రభుత్వం గత సర్కారు పథకాన్ని కొనసాగించే అవకాశమేలేదు. దీంతో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్నవారు, అర్హులుగా ప్రకటించినవారి ఆశలు అడియాశలే అయ్యాయి.

అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులను విస్తరించాలి

(మొదటిపేజి తరువాయి)

హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన రాష్ట్ర కమిటి సమావేశం ప్రారంభమైంది. పోలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. రాష్ట్రంలోని గ్రామాలన్నింటికీ బస్సు సర్వీసులను విస్తరింపచేయాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించినట్టు ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. 'కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంచింది. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు వాగ్దానాలను తక్షణం అమలు చేయటం హర్షణీయం. కానీ రాష్ట్రంలో సుమారు నాలుగువేల గ్రామాలకు నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనందువల్ల గ్రామీణ నిరుపేద మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే అవకాశం లేదు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పల్లెవెలుగు, ప్యాసింజర్ బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రమే పరిమితం చేయటంతో దూరప్రయాణం చేసే మహిళలకు ఈ సదుపాయం పరిమితంగానే అందుబాటులో ఉంటుంది.

అందువల్ల ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని ప్రతి గ్రామానికీ బస్సు సౌకర్యం కల్పించాలని' ఆయన కోరారు. గుర్తింపు కార్డు గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు వార్తలు వచ్చాయనీ, ఆ సమస్య ఏండ్ల తరబడి ఇక్కడ పనిచేస్తున్న వలస కూలీలు, గుర్తింపు కార్డు లేని పేద కుటుంబాల మహిళలకు ఆటంకం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఉపయోగకరమైనప్పటికీ, ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు.

స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్

(మొదటిపేజి తరువాయి)

ప్రతిపక్షం బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ పార్టీలు మద్దతు తెలిపాయి. దీంతో ఆయన ఎన్నిక లాంఛనమే కానుంది. రాజకీయాలకతీతంగా ఉండే స్పీకర్ ఎన్నిక ప్రక్రియకు కూడా బీజేపీ దూరంగా ఉంది.

స్పీకర్ ఎన్నికకు సంబంధించి శాసనసభ కార్యదర్శి వి.నరసింహా చార్యులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉండగా, అధికార పక్షం నుంచి గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం నామినేషన్ వేశారు. ఆయన నామినేషన్ పత్రంపై సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సంతకాలు చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేల సమక్షంలో అసెంబ్లీ కార్యదర్శికి ప్రసాద్ కుమార్ నామినేషన్ పత్రాలు అందజేశారు. గురువారం శాసనసభ ప్రారంభంకాగానే స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నికైనట్టు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ప్రకటించనున్నారు. సభా నాయకుడు, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు ప్రసాద్ కుమార్ తోడ్కొని స్పీకర్ స్థానం వద్దకు తీసుకెళతారు. అనంతరం స్పీకర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. ఉభయ సభలనుద్దేశించి శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో శనివారం చర్చ జరగనుంది.

తెలంగాణ తొలి దళిత స్పీకర్‌గా గడ్డం

కొత్తగా కొలువుదీరిన సభకు కాంగ్రెస్ పార్టీ తరపున స్పీకర్ అభ్యర్థిగా మాజీ మంత్రి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన సంగతి తెలిసిందే. సాధారణంగా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే స్పీకర్‌గా ఉంటారు. గడ్డం ప్రసాద్ స్పీకర్‌గా నియమితులైతే తెలంగాణ రాష్ట్రానికి తొలి దళిత స్పీకర్ ఆయనే కానున్నారు.

కాంగ్రెస్ పార్టీకి గడ్డం ప్రసాద్‌కుమార్ అత్యంత విధేయుడు. సీనియర్ నాయకుడు. వికారాబాద్ జిల్లా మర్పల్లి గ్రామంలో 1964లో ఆయన జన్మించారు. తాండూరు ప్రభుత్వ కళాశాలలో ఆయన ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నారు. ఆయనకు భార్య శైలజ, ఇద్దరు పిల్లలున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఉప ఎన్నికల్లో (2008) ఆయన వికారాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో గెలిచారు. 2012లో ఆనాటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో చేనేత, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రిగా సేవలందించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014, 2018 ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిగిరి గెలుపొందారు.

ఇండియా కూటమి బలపడాలి

- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి
- ప్రజాస్వామిక, లౌకిక శక్తులన్నీ ఏకం కావాలి
- హిందూత్వ ఎజెండాతోనే కాషాయ పార్టీ విజయం: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని ఓడించడమే లక్ష్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్ చెప్పారు. దేశంలోని ప్రజాస్వామిక, లౌకికశక్తులన్నీ ఏకం కావాలన్నారు. ఇండియా కూటమి మరింత బలపడాలని ఆకాంక్షించారు. హిందూత్వ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్లే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందనీ, ఇది దేశానికే ప్రమాదకరమని అన్నారు. రెండురోజులపాటు జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, అనుభవాలపై చర్చించామని చెప్పారు. దేశంలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులను ఐక్యం చేసేందుకు తమ పార్టీ ప్రయత్నిస్తుందన్నారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలు, ప్రజాసమస్యలపై దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని వివరించారు. హిందూత్వ ఎజెండాను, ఆ భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతోపాటు డబ్బు ప్రభావం, మీడియా మద్దతు ఈ గెలుపు వెనుక ఆ పార్టీకి ఉందని అన్నారు. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఉన్నా హిందూత్వ శక్తుల ఎదుగుదలను అడ్డుకోవడంలో అది విఫలమైందని విమర్శించారు. ఇంకోవైపు ఆ పార్టీ హిందూత్వ భావజాలాన్ని వ్యతిరేకించలేదని చెప్పారు. రాజస్థాన్‌లో దీర్ఘకాలంగా అంతర్గత సమస్యలున్నాయని వివరించారు. బీజేపీ వ్యతిరేక శక్తులను ఐక్యం చేయడంలోనూ కాంగ్రెస్ విఫలమైందని అన్నారు. హిందూత్వ ఎజెండా, ప్రజలను విభజించే రాజకీయాలను బీజేపీ అనుసరించడంతో దేశం ప్రమాదంలో పడిందన్నారు. మైనార్టీలు, ప్రజాస్వామ్యం, లౌకికవాదంపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇండియా కూటమిలోని పార్టీలన్నీ బీజేపీ ప్రమాదంపై చర్చించాలని సూచించారు. దేశంలో లౌకిక ప్రభుత్వం రావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. పేదలు ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యలపై అధ్యయనం చేసి విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఇప్పుడు తెలిసొస్తుంది

(మొదటిపేజి తరువాయి)

ప్రశ్నించారు. ఎవరైనా ఆర్థిక పరిస్థితిపై లెక్కలేసుకుని హామీలిస్తారా..? లేక హామీలిచ్చిన తర్వాత లెక్కలేసుకుంటారా..? అని అడిగారు. అందువల్ల కాంగ్రెస్‌కు అసలు ఆట ఇప్పటి నుంచి మొదలవుతుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న రాహుల్ గాంధీ హామీ ఏమైంది..? తొలి మంత్రివర్గంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధతన్న వాగ్దానం ఎక్కడ..? అంటూ ఆయన ప్రశ్నించారు.

ధరణిపై 10 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వండి

(మొదటిపేజి తరువాయి)

రాగానే దాన్ని ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే ధరణి పోర్టల్‌పై సంబంధిత అదికారులతో సమీక్ష నిర్వహించారు. ధరణిని రద్దు చేసి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు భూమాత పోర్టల్‌ను తీసుకురావడంలో భాగంగానే బుధవారం సీఎం సమీక్ష నిర్వహించి కమిటీ ప్రతిపాదన చేసినట్టు సమాచారం.

అంతా గోప్యతే

అదానీ లావాదేవీలపై బ్లూమ్‌బర్గ్ కథనం



- వివాదాస్పద పీఎంసీ ప్రాజెక్ట్స్‌కు కాంట్రాక్టులు
- దానికి చిరునామా, ఫోన్ నెంబరే లేవు
- అది డమ్మీ కంపెనీ కావచ్చునని అనుమానాలు

న్యూఢిల్లీ : అయితే ఈ ఆరోపణలన్నింటినీ అదానీ తోసిపుచ్చారు. ఈ వ్యవహారంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ)కి చెందిన సంస్థ 2017లో విచారణ జరిపి ఆరోపణలను తోసిపుచ్చింది. దిగుమతులన్నీ నిజంగా జరిగినవేనని తేల్చింది. ప్రకటించిన విలువ సరిగానే ఉన్నదని, దానిని మరోసారి ధృవీకరించాల్సిన అవసరం లేదని తెలిపింది.

పీఎంసీ వ్యాపార కార్యకలాపాలు 2016 ఏప్రిల్‌లో హోవ్ కంపెనీలో కలిసిపోయాయని కోర్టు ఫైలింగ్స్ చెబుతున్నాయి. ఈ ఫైలింగ్స్‌ను ఇటీవల బ్లూమ్‌బర్గ్ విశ్లేషించింది. మన దేశంలో నిర్మాణంలో ఉన్న కొన్ని ముఖ్యమైన ఓడరేవులు, రైల్వే లైన్లకు హోవ్ కంపెనీ ఇప్పటికీ అదానీ కాంట్రాక్టర్‌గా కొనసాగుతోందని తేలింది. హోవ్ కంపెనీకి, అదానీ గ్రూపుకు మధ్య సంబంధం ఉన్నదా? కాంట్రాక్ట్ సంస్థకు అదానీ పోర్ట్స్ చేసిన చెల్లింపులపై ఎందుకు అభ్యంతరాలు తెలిపారు? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో అదానీ గ్రూప్ కంపెనీల ఆడిటర్‌గా వ్యవహరించిన డెలాయిట్ విఫలమైంది.

అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్ ఆడిటర్ పదవికి డెలాయిట్ రాజీనామా చేసింది. అదానీ పోర్ట్స్, కాంట్రాక్ట్ సంస్థ ఖాతాలను తాను పూర్తి స్థాయిలో పరిశీలించలేదని డెలాయిట్ తెలిపింది. పీఎంసీ అనేది అదానీకి సంబంధించినదేనని హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ తన నివేదికలో తేల్చి చెప్పింది. అదానీ గ్రూపుకు చెందిన లిస్టెడ్ కంపెనీల నుండి సొమ్మును తరలించేందుకు ఈ కంపెనీని వాడుకున్నారని తెలిపింది. అదానీ గ్రూపుకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ పీఎంసీ ప్రాజెక్ట్స్ గత 12 సంవత్సరాలలో 784 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించిందని హిండెన్‌బర్గ్ వివరించింది. అయినా ఈ కంపెనీకి ఓ వెబ్‌సైట్ అంటూ లేదు. అదానీతో దాని సంబంధాలను రికార్డులు బయటపెడుతున్నాయి. ఆ కంపెనీ కార్పొరేట్ చిరునామా, ఫోన్ నెంబర్ కూడా అదానీ గ్రూపుదే.

పీఎంసీ ప్రాజెక్ట్స్ అనేది అదానీ గ్రూపుతో అనుబంధమున్న డమ్మీ సంస్థా అని బ్లూమ్‌బర్గ్ వివరణ కోరింది. దీనికి అదానీ గ్రూప్ ప్రతినిధి బదులిస్తూ హోవ్, పీఎంసీ అనేవి వేర్వేరు కంపెనీలని, వాటికి అదానీతో సంబంధమేమీ లేదని తెలిపారు. అన్ని లావాదేవీలు చట్ట ప్రకారమే జరిగాయని బదులిచ్చారు. ఇక్కడ ఆసక్తికరమైన విషయమేమంటే తైవాన్‌కు చెందిన పెట్టుబడిదారు ఛాంగ్ ఛంగ్-లింగ్ కుమారుడే పీఎంసీ ప్రాజెక్ట్స్ కంపెనీకి అధిపతి. వ్యవస్థీకృత నేరాలు, అవినీతిని బయటపెట్టే ప్రాజెక్ట్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఛాంగ్ ఛంగ్-లింగ్ అదానీ గ్రూప్ కంపెనీల వాటాలను ఆఫ్‌షోర్ నిధుల (విదేశీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే మ్యూచువల్ ఫండ్స్) ద్వారా కొనుగోళ్లు, అమ్మకాలు జరిపి పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించారు. హోవ్, పీఎంసీలతో తనకు సంబంధం లేదని అదానీ గ్రూప్ వాదిస్తున్న నేపథ్యంలో వాటికి జరిపిన చెల్లింపులకు సంబంధించి ఎలాంటి పరిశీలనలు, తనిఖీలు చేయలేదు.

బ్లూమ్‌బర్గ్ ప్రతినిధులు హి లింగోస్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ కంపెనీకి తైవాన్‌లో ఛంగ్-లింగ్ యజమాని. ఆ కార్యాలయంలో అదానీ లోగోను ప్రదర్శించారు. ఇంటర్వ్యూ ఇచ్చేందుకు ఛంగ్-లింగ్ సుముఖంగా లేరని కార్యాలయ కార్యదర్శి చెప్పారు. పోనీ ఆయన కుమారుడి ఫోన్ నెంబర్ అయినా ఇవ్వమని బ్లూమ్‌బర్గ్ ప్రతినిధులు కోరగా అందుకు కార్యదర్శి నిరాకరించారు. డెలాయిట్ ఆరోపణ చేసే వరకూ హోవ్‌కు ఎంత సొమ్ము ఇచ్చిందీ అదానీ వెల్లడించలేదు. అప్పటి నుండి హోవ్ 245 మిలియన్ డాలర్ల డిపాజిట్లను వాపసు చేశారు. సాధారణంగా కాంట్రాక్ట్ పూర్తయితేనో లేదా రద్దయినప్పుడో కాంట్రాక్టర్లు ఈ నిధులను వాపసు చేస్తుంటారు.

> కాంట్రాక్టు పనులు నిర్వహించే వివాదాస్పద సంస్థ హోవ్ ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌తో అదానీ గ్రూప్ సంబంధాలు కొనసాగిస్తోంది. తైవాన్‌కు చెందిన ఓ కుటుంబంతో ఈ కంపెనీకి సంబంధాలు ఉన్నాయని బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ తెలిపింది. బ్లూమ్‌బర్గ్ కథనం ప్రకారం ఈ కంపెనీ పీఎంసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అనే మరో కంపెనీకి చెందిన కీలక వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే పీఎంసీ ప్రాజెక్ట్స్ కంపెనీపై పలు ఆరోపణలు ఉన్నాయి. పీఎంసీ ప్రాజెక్ట్స్ మరో రెండు ఇతర కంపెనీలతో కలిసి దిగుమతి చేసుకున్న విద్యుత్, మౌలిక సదుపాయాల పరికరాల విలువలో రూ.1,500 కోట్ల మేర దండుకున్నదనే వార్తలు వస్తున్నాయి. కోట్లకు పడగలెత్తిన గౌతమ్ అదానీ సామ్రాజ్యం ఈ కంపెనీని ఉపయోగించుకొని దాని ద్వారా విదేశాల నుండి సొమ్ము ఆర్జించిందని 2014లోనే కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది.

'డబ్బు ఎవరికి ముట్టింది? హోవ్, అదానీ కోసం వారు చేసిన పని ఏమిటి? ఆ డబ్బును ఎలా ఖర్చు చేశారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది' అని హాంగ్‌కాంగ్‌లోని ఆసియన్ కార్పొరేట్ గవర్నెన్స్ అసోసియేషన్‌లో భారత ప్రత్యేక సలహాదారుగా వ్యవహరిస్తున్న షర్మిలా గోపీనాథ్ ప్రశ్నించారు. చెల్లింపులకు సంబంధించిన సమాచారాన్ని ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. కాంట్రాక్టర్‌కు అదానీ చెప్పుకోదగిన మొత్తంలో చెల్లింపులు జరిపారని, ఆ కాంట్రాక్టర్‌కు యజమాని తైవాన్ సంస్థేనని తెలిపారు. అదానీ, హోవ్, పీఎంసీ కంపెనీల మధ్య ఉద్యోగులు తరచూ మారుతున్నారని, హోవ్, పీఎంసీ కంపెనీలలో గతంలో డైరెక్టర్లుగా పనిచేసిన వారు అదానీ కంపెనీ బోర్డుల్లో సంవత్సరాల తరబడి నియమితులయ్యారని కోర్టు ఫైలింగ్స్‌ను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ తెలియజేసింది. పెట్టుబడిదారుల సొమ్ముతో కూడిన వ్యవహారం కాబట్టి లిస్టెడ్ కంపెనీలు చేసే చెల్లింపుల సమాచారం అందుబాటులో ఉండాలని గోపీనాథ్ చెప్పారు.

ఫ్రీ బస్సుల్లో 60 శాతం మహిళలే ప్రయాణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సుల్లో ఇప్పటి వరకు 60 శాతం మహిళలే ప్రయాణించారు. టీఎస్‌టీసీ గణాంకాల ప్రకారం సోమవారం ఒక్క రోజే ఆర్టీసీ బస్సుల్లో మొత్తం 51 లక్షల మంది ప్రయాణించగా, అందులో 20.87 లక్షల మంది పురుషులు కాగా 30 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. గత వారం రోజులుగా ఇదే సగటు కొనసాగుతోందని తెలిసింది..

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం ఫోన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం ఫోన్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న పలు పెండింగ్ అంశాలు, పరస్పర సహకారం కోసం కేంద్ర ప్రభుత్వ ముఖ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి విషయంలో పూర్తి సహాయ సహకారాలను అందించాలనీ సీఎం కోరారు.



చికెన్ టిక్కాను తిన్న విరాట్ కోహ్లి.. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే..?

న్యూఢిల్లీ : స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి చికెన్ టిక్కా తిన్నాడు. ఈ ఫొటోలు కూడా తానే స్వయంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఈ మాక్ చికెన్ టిక్కాను మీరు తప్పక ఇష్టపడతారు.' అంటూ ఈ ఫొటోకి క్యాప్షన్ కూడా పెట్టాడు. ఈ పోస్టు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టు చూసిన నెటిజన్లు షాకయ్యారు. కోహ్లి శాఖాహారి కదా..! మరి ఇప్పుడు చికెన్ తినడం ఏంటి? అంటూ నెటిజన్లు కామెంట్స్ చేశారు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. కోహ్లి తిన్నది చికెన్ టిక్కా కాదు. మాక్ చికెన్ టిక్కా అన్నది వెజిటేరియన్ ఫుడ్. దీన్ని ఓ మొక్కతో తయారు చేస్తారు. నెటిజన్లు చికెన్ టిక్కా అన్న పదాన్నే చూశారు. మాక్ చికెన్ టిక్కా అన్న పదాన్ని చూడలేదు అని ఓ నెటిజన్ క్లారిటీ ఇచ్చాడు. మాక్ చికెన్ టిక్కాను తయారు చేయడానికి సోయాను వాడతారు. దీన్ని తింటే నాన్‌వెజ్ తిన్నట్టే ఉంటుంది. అందుకే నాన్‌వెజ్ తిననివాళ్లు దీన్ని ఇష్టంగా తింటారు.

తొలి టెస్టుకు ఇరుజట్ల ప్రకటన..

వరల్డ్ కప్ హీరోకు వైస్ కెప్టెన్సీ.. స్టార్ బ్యాటర్‌ను తప్పించిన పాక్



పెర్త్ : గురువారం నుంచి ఆస్ట్రేలియా వేదికగా పాకిస్తాన్‌తో జరుగనున్న తొలి టెస్టుకు ఇరు జట్లు తమ ఫైనల్ జట్టును ప్రకటించాయి. వరల్డ్ కప్ హీరో, ఈ ఏడాది ఆ జట్టు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన ట్రావిస్ హెడ్‌కు ఆస్ట్రేలియా వైస్ కెప్టెన్సీ బాధ్యతలను అప్పజెప్పింది. స్టార్ స్పిన్నర్ నాథన్ లియన్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఇక పాకిస్తాన్ కూడా స్టార్ వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్‌ను పక్కనబెట్టి ఇద్దరు కొత్త ఆటగాళ్లకు తుది జట్టులోకి అవకాశమిచ్చింది.

ఆసీస్ జట్టు : డేవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీ, మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ (కెప్టెన్), నాథన్ లియాన్, జోష్ హెజిల్‌వుడ్.

రిజ్వాన్ ఔట్.. సర్ఫరాజ్‌కు ఛాన్స్

మరోవైపు బాబర్ ఆజమ్ సారథిగా తప్పుకున్నాక షాన్ మసూద్ సారథ్యంలో తొలి మ్యాచ్ ఆడనున్న పాకిస్తాన్.. తుది జట్టులో రిజ్వాన్‌ను తప్పించింది. మాజీ సారథి సర్ఫరాజ్ అహ్మద్‌ను ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా ఎంచుకుంది. ఆల్ రౌండర్ అమీర్ జమాల్‌తో పాటు బౌలర్ ఖుర్రమ్ షాజాద్‌లు తుది జట్టులో ఉన్నారు.

పాకిస్తాన్ జట్టు: షాన్ మసూద్ (కెప్టెన్), ఇమామ్ ఉల్ హక్, అబ్దుల్లా షఫీక్, బాబర్ ఆజమ్, సౌద్ షకీల్ సర్ఫరాజ్ అహ్మద్, సల్మాన్ అలీ అఘా, ఫహీమ్ అష్రఫ్, షహీన్ షా అఫ్రిది, అమీర్ జమాల్, ఖుర్రమ్ షాజాద్.

అర్జున అవార్డు రేసులో షమి

ముంబయి: టీమిండియా సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి అర్జున అవార్డు రేసులో నిలిచాడు. ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో షమి అద్భుతంగా బౌలింగ్ చేయడంతో అతడి పేరుని అర్జున అవార్డు కోసం సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈ విషయంలో క్రీడా మంత్రిత్వ శాఖకు బిసిసిఐ ప్రత్యేక అభ్యర్థన చేసినట్లు తెలిసింది. క్రీడా మంత్రిత్వ శాఖకు తొలుత పంపిన జాబితాలో మహ్మద్ షమి పేరు లేదు. ప్రపంచకప్‌లో కేవలం ఏడు మ్యాచ్‌ల్లోనే 24 వికెట్లు పడగొట్టి లీగ్‌లో ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. మూడు మ్యాచ్‌ల్లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టాడు. అత్యుత్తమ ప్రదర్శన(7/57) న్యూజిలాండ్‌పై. ప్రపంచ కప్ తర్వాత విశ్రాంతి తీసుకుంటున్న షమి.. ఇక 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డుకు పురుషుల బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి పేర్లను సిఫారసు చేశారు.


అంతిమ్‌కు 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డు



ముంబయి: భారత మహిళా యువ రెజ్లర్ అంతిమ్ పంగల్(19)కు ప్రతిష్టాత్మక 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కింది. 2023 ఏడాదికిగాను అంతిమ్‌కు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యుడబ్ల్యు) ఈ ప్రతిష్టాత్మక ఈ అవార్డును అందజేసింది. రెండేళ్లుగా అద్భుత విజయాలతో పతకాలు కైవసం చేసుకోవడంతో పాటు 2024 పారిస్ ఒలింపిక్స్‌కూ అర్హత సాధించింది. అంతిమ్‌కు ఈ అవార్డు దక్కడం ఆమెకు ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంచింది. గతేడాది అండర్-20 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో అంతిమ్ మూడో స్థానంలో నిలువగా.. ఈ ఏడాది ఏకంగా ఛాంపియన్‌గా నిలిచింది. 2020లో జూనియర్ ఆసియన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన అంతిమ్.. ఆ తర్వాత అండర్-23 ఆసియన్ ఛాంపియన్‌షిప్స్‌లో రెండో స్థానం నిలిచింది. హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా క్రీడలలో కాంస్యం గెలిచింది.

నవచిత్రం

హ్యాట్రిక్ హిట్ కోసం..



హరీష్ శంకర్, రవితేజ

రవితేజ, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ ఓ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వివేక్ కూచిభొట్ల ఈ చిత్రానికి సహ నిర్మాత. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో రవితేజ నటించిన 'ధమాకా' చిత్రం బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే.

ఇంకా టైటిల్ ఖరారు చేయని కొత్త సినిమాని బుధవారం మేకర్స్ అధికారికంగా అనౌన్స్ చేశారు. హరీష్ శంకర్ తన హీరోలను పక్కా మాస్‌గా చూపించడంలో దిట్ట. రవితేజతో హరీష్ చేసిన 'షాక్', 'మిరపకాయ్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత వీరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అందరిలోనూ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా ఎలాంటి మాస్ ఎలిమెంట్స్‌ను కలిగి ఉంటుందో తెలియజేయడానికి ..'ఈసారి మాస్ రీయూనియన్ స్పైసీగా ఉంటుంది' అని మేకర్స్ పేర్కొనటం విశేషం. హై ప్రొడక్షన్, టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపొందనున్న ఈ ప్రాజెక్ట్ కోసం హరీష్ శంకర్ ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేయనున్నారు.

ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్




నరేష్ అగస్త్య, భావన

నరేష్ అగస్త్య, భావన, జ్ఞానేశ్వరి కాండ్రేగుల ప్రధాన పాత్రలలో నటించిన '# మాయలో'. మేఘా మిత్ర పేర్వార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఫ్రేమ్ బై ఫ్రేం పిక్చర్స్ బ్యానర్ పై షాలినినంబు, రాధా కృష్ణ నంబు నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 15న రిలీజ్ కానుంది.

ఈ సందర్భంగా హీరో నరేష్ అగస్త్య మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. ఇందులో ప్రతి సన్నివేశం హాయిగా నవ్వుకునేలా ఉంటుంది' అని తెలిపారు. 'ఇదొక మంచి సినిమా. యూత్, కాలేజ్, ఫ్రెండ్స్, లవర్స్..అందరూ కనెక్ట్ అవుతారు. ఫీల్ గుడ్ మూవీ ఇది' అని జ్ఞానేశ్వరి కాండ్రేగుల చెప్పారు. భావన మాట్లాడుతూ, 'ఇది నా మొదటి ఫుల్‌లెంత్ మూవీ. చాలా లైట్ హార్ట్ మూవీ ఇది' అని అన్నారు.

దర్శకుడు మేఘా మిత్ర పేర్వార్ మాట్లాడుతూ,'చక్కని వినోదం, మనసుని హత్తుకునే భావోద్వేగాలు, మంచి పెర్ఫార్మెన్స్, ఆకట్టుకునే మాటలు ఉన్న కథ ఇది' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ,'ఇది చాలా క్లీన్ ఫిలిం. మంచి ఎంటర్ టైనర్. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు

అందర్నీ మెప్పిస్తుంది



విరాజ్ అశ్విన్

హీరో విరాజ్ అశ్విన్ తాజాగా నటించిన చిత్రం 'జోరుగా హుషారుగా'. పూజిత పొన్నాడ నాయిక. అనుప్రసాద్ దర్శకుడు. నిరీష్ తిరువిధుల నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది.

ఈ సందర్భంగా హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ, "బేబి' బ్లాక్‌బస్టర్ తరువాత చాలా ఆఫర్లు వస్తున్నాయి. కానీ నేను బాధ్యతగా, చాలా సెలెక్టీవ్‌గా ఎంపిక చేసుకుంటున్నాను. 'బేబి' తరువాత వస్తున్న ఈ సినిమాపై అందరిలోనూ మంచి పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. ఈ చిత్రంలో ఓ మిడిల్ క్లాస్ అబ్బాయిగా కనిపిస్తాను. చేనేత కుటుంబానికి చెందిన యువకుడిగా నాలో చాలా ఎమోషన్స్ ఉంటాయి. అలాగే ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ అందర్నీ కట్టిపడేస్తుంది. ఒక మిడిల్ క్లాస్ ఫాదర్ తన కొడుకును సక్సెస్‌ఫుల్ చేయడానికి ఎలాంటి త్యాగాలు చేశాడు? ఫ్యామిలీ కోసం కొడుకు ఏం చేశాడు? అనేది ఎంతో ఎమోషన్‌గా ఉంటుంది. ఇదొక లైట్ హార్టెడ్ సినిమా. అందరూ బాగా ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది. హీరోగా నటిస్తూనే పవర్‌ఫుల్ పాత్రలు వస్తే ఇతర హీరోల సినిమాల్లోనూ నటించటానికి రెడీగా ఉన్నాను' అని చెప్పారు.

కంటెంట్ ఉన్న సినిమా



సిరి చందన, కిరణ్, ఎస్తర్ నోర్హానా, రమేష్ నాని

విన్ క్లౌడ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై జీరో ప్రొడక్షన్స్ సమర్పిస్తున్న తాజా చిత్రం 'మాయ'. రాజేష్ గొరిజవోలు నిర్మాణ సారథ్యంలో రమేష్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా టీజర్ విడుదలైంది.

ఈ సందర్భంగా హీరో కిరణ్ ఆవల మాట్లాడుతూ, 'డైరెక్టర్ రమేష్ చెప్పిన కథ చాలా బాగుంది. సినిమా అవుట్‌పుట్ బాగా వచ్చింది' అని తెలిపారు. 'కథ చాలా కొత్తగా ఉంది. ఇలాంటి స్టోరీలు ఎలాగైనా ప్రేక్షకులకు తెలియాలి' అని హీరోయిన్ ఎస్తర్ నోర్హానా అన్నారు. 'చిన్న సినిమా, చిన్న బడ్జెట్.. కానీ మంచి కంటెంట్ అని ప్రేక్షకులందరూ ఖచ్చితంగా ఆదరిస్తారని నమ్మకం ఉంది. నిర్మాత రాజేష్ గొరిజవోలు సినిమాకు పెద్ద బ్యాక్ బోన్‌గా నిలిచారు' అని డైరెక్టర్ రమేష్ నాని తెలిపారు.

విజయం ఖాయం



షకలక శంకర్, రాజీవ్ కనకాల

ఆకృతి క్రియేషన్స్ పతాకం పై రాజీవ్ కనకాల, శకలక శంకర్, శ్రీతేజ్, ఆక్సాఖాన్, రూపిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్‌రెడ్డి రచన, దర్శకత్వంలో ఎడవెల్లి వెంకట్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 15న కర్ణాటక, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా విడుదల అవుతుంది.

ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ, 'ఇది మాస్ ప్రేక్షకులకి అద్భుతంగా నచ్చు తుంది. ఒక ఊరులో వెంకట్ రెడ్డి అనే వ్యక్తి జీవితాన్ని ప్రేరణగా తీసుకుని చేసిన కథ' అని తెలిపారు. 'సినిమా బాగా వచ్చింది. మొదటి రోజు నుంచి హౌస్‌ఫుల్‌తో సూపర్ హిట్ అవుతుంది అనే నమ్మకం ఉంది. దళారి 2 కూడా తీస్తాను' అని నిర్మాత చెప్పారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ, 'మంచి కథ, మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులతో రూపొందిన ఈ సినిమా మీ అందరికి నచ్చుతుంది' అని తెలిపారు. 'ఇందులో మంచి యాక్షన్ ఉంది. క్లైమాక్స్ చాలా బాగా వచ్చింది' అని శకలక శంకర్ అన్నారు.

ప్రేక్షకుల్ని భయపెట్టే పిండం



అవసరాల శ్రీనివాస్

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు.

అవసరాల శ్రీనివాస్, ఈశ్వరీ రావు ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమా ఈనెల 15వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం అవసరాల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకుడు తీసిన స్మోక్ అనే షార్ట్ ఫిల్మ్ చూశాను. నాకు ఎంతగానో నచ్చింది. ముఖ్యంగా క్లైమాక్స్ ట్విస్ట్ మెప్పించింది. ఆ తర్వాత కథ కూడా నచ్చడంతో అంగీకరించాను. ఇందులో లోక్‌నాథ్ అనే అతీంద్రియ శక్తుల మీద పరిశోధనలు చేసే వ్యక్తిగా కనిపిస్తాను. అందులో నిష్ణాతులైన ఈశ్వరీ రావు దగ్గరకు నేను నేర్చుకోవడానికి వెళ్తాను. ఆ విధంగా నడుస్తుంది నా పాత్ర. నేను మామూలుగా హర్రర్ సినిమాలను పెద్దగా ఇష్టపడను. అయితే 'ప్రేమ కథా చిత్రమ్' థియేటర్‌లో చూస్తున్నప్పుడు ప్రేక్షకుల స్పందన చూసి ఆశ్చర్యపోయాను. త్వరలో విడుదల కానున్న 'ఈగల్', 'కిస్మత్', 'కన్యాశుల్కం' చిత్రాల్లో చేస్తున్నాను. దాంతో పాటు దర్శకుడిగా తదుపరి సినిమా కోసం ఒక మర్డర్ మిస్టరీ కథను సిద్ధం చేస్తున్నాను. కుమారి శ్రీమతి సీక్వెల్ చేయడానికి కూడా సన్నాహాలు జరుగుతున్నాయి' అని చెప్పారు.

మాస్ బీట్‌తో డుగు.. డుగు



మీనాక్షి గోస్వామి

కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో సూర్య తేజ ఏలే హీరోగా పరిచయం అవుతున్న యూనిక్ క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'భరతనాట్యం'. సినిమా ఈజ్ ది మోస్ట్ బ్యూటీఫుల్ ఫ్రాడ్ ఇన్ ది వరల్డ్' అనేది క్యాప్షన్. బుధవారం డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ చిత్రం నుంచి 'డుగు డుగు' పాటని లాంచ్ చేశారు.

సంగీత దర్శకుడు వివేక్ సాగర్ ఈ పాట కోసం మాస్ ఫుట్ ట్యాపింగ్ నెంబర్‌ని స్కోర్ చేశారు. క్యాచీ ట్యూన్, ఎనర్జిటిక్ బీట్స్‌తో స్వర పరిచిన ఈ పాట ఇన్‌స్టంట్ హిట్ అయ్యింది. సినిమా, నిజ జీవితాన్ని పోలుస్తూ కాసర్ల శ్యామ్ అందించిన లిరిక్స్ మాస్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. మంగ్లీ హైపిచ్ వోకల్స్, శేఖర్ మాస్టర్ కొరియోగ్రాఫ్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ మెస్మరైజ్ చేశాయి. విజువల్స్, సెట్స్ చాలా గ్రాండ్‌గా ఉన్నాయి. పీఆర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై పాయల్ సరాఫ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది.

కలశ రిలీజ్‌కి రెడీ



సోనాక్షి వర్మ, అనురాగ్

చంద్రజ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై బిగ్‌బాస్ ఫేమ్ భానుశ్రీ, సోనాక్షి వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కలశ'. కొండ రాంబాబు దర్శకుడు. డాక్టర్ రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మించారు.

ఈ సినిమా ఈ నెల 15న రిలీజ్ అవుతున్న సందర్భంగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఫిలింఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలో 'ఓ చిట్టీ తల్లి' సాంగ్‌ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన మురళీమోహన్ ఆవిష్కరించారు. 'కలశ' టైటిల్ సాంగ్‌ను దర్శకులు వీర శంకర్ రిలీజ్ చేశారు. నిర్మాత రాజేశ్వరి చంద్రజ మాట్లాడుతూ,'దర్శకులు రాంబాబు ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్‌గా ఫీలయ్యాను. ఇప్పటి వరకూ భారతీయ వెండితెరమీద ఇలాంటి పాయింట్‌తో ఏ సినిమా రాలేదు అని గర్వంగా చెప్పగలను' అని అన్నారు.

'చంద్రజ వంటి ప్యాషనేట్ ప్రొడ్యూసర్ దొరకబట్టే ఇంత అద్భుతంగా వచ్చింది. థ్రిల్లర్ కథలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కెమెరా చాలా కీలకం. ఈ విషయంలో మా సంగీత దర్శకుడు విజయ్ కురాకుల, డీఓపీ వెంకట్ గంగధారి అద్భుతమైన పనితనం చూపించారు' అని దర్శకుడు కొండ రాంబాబు అన్నారు. హీరో అనురాగ్, హీరోయిన్ సోనాక్షి వర్మ మాట్లాడుతూ, 'ఇదొక డిఫరెంట్ జోనర్ మూవీ. లవ్, కామెడీ ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా తెరకెక్కిన ఈ సినిమాను ఫ్యామిలీతో వచ్చి చూడచ్చు' అని తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.